fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 4 | విజయవాడ, గురువారం 4 జనవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
38
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Simhadri TMT
world class steel bars
Now Available For Cities At :
Nidamanuru, VJA. Ph: 0866-6453720 9948196219
Bala Nagar, HYD - 37. Ph: 040-23071106, 9949911366
Avail Special Offers For Projects

సీమాంధ్రలోనే తొలిసారిగా..
ఎంతో సురక్షితం, సౌకర్యవంతమైన అత్యాధునిక క్యాన్సర్ చికిత్స మెషీన్ ట్రూబీమ్
ఇప్పుడు మీ నాగార్జునలో..
నాగార్జున క్యాన్సర్ సెంటర్
కానూరు, విజయవాడ-7.
టోల్ ఫ్రీ: 1800 123 0066



'మహా'బంద్ సంపూర్ణం

- దళితాగ్రహంతో స్తంభించిన మహారాష్ట్ర
- హిందూత్వ శక్తులకు వ్యతిరేకంగా నిరసనల జ్వాల
- ఎక్కడికక్కడే నిలిచిన రవాణా
- స్కూళ్లు, ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు మూసివేత
- ఔరంగాబాద్‌లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేత

వార్త 8వ పేజీలో

కోరేగావ్ ప్రకంపనలు

ప్రధాని మోడీ మౌనం వీడాలి

దద్దరిల్లిన ఉభయ సభలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌ను స్మరించుకుంటున్న సమయంలో దళితులపై హిందూత్వ సంఘాలు దాడులు చేయడం దారుణమని, క్షమించరాని నేరమని పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీలు మండిపడ్డాయి. మహారాష్ట్రలో భీమ్-కోరేగావ్‌లో హింసాత్మక ఘటనలకు ఆర్‌ఎస్‌ఎస్, హిందుత్వ శక్తులు ప్రేరేపిస్తున్న హింసే కారణమని తీవ్రంగా ధ్వజమెత్తాయి. ఒకపక్క దేశం తగలబడుతున్నా, దళితులు హత్యలకు గురవుతున్నా ప్రధాని నరేంద్ర మోడీలో చలనం రాకపోవడం దారుణమని వ్యాఖ్యానించాయి. ఇప్పటికైనా మోడీ మౌనం వీడాలని, భీమ్-కోరేగావ్‌లో దళితులపై జరిగిన దాడులపై వివరణయివ్వాలని డిమాండ్ చేశాయి. ఈ ఘర్షణలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని, దళితులపై దాడులకు పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. బుధవారం పార్లమెంట్ ఉభయ సభల్లో భీమ్-కోరేగావ్‌లో దళితులపై మిగతా 8లో




దుర్గగుడి ఘటనపై ఉన్నత స్థాయి విచారణ

- ఆదేశించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- భైరవి పూజలు నిజమేనని ఒప్పుకున్న పూజారులు
- పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసిన ధార్మిక సంస్థలు
- పీఠాధిపతుల రంగ ప్రవేశం
- దేవస్థానం పరిసరాల్లోనే జంతు బలి
- ఇఓపై బదిలీ వేటు ?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో, విజయవాడ సిటీ ప్రతినిధి



విజయవాడ కనకదుర్గ దేవస్థానంలో తాంత్రిక పూజలు నిర్వహిం చింది నిజమేనని పూజారులు అంగీకరిం చారు. దీనిపై ఉన్నతస్థాయి విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పూర్తిస్థాయి నివేదికను శుక్రవారం సాయంత్రానికి అందించాలని విజయవాడ పోలీసు కమిషనర్ గౌతంసవాంగ్‌కు సూచించారు. డిసెంబర్ 26వ తేదీ అర్ధరాత్రి అనుమతి లేకుండా దేవస్థానంలో పూజలు నిర్వహించారని విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో పోలీసులు సుమోటోగా కేసు స్వీకరించి గర్భగుడిలో పూజలు నిర్వహించిన పూజారిని విచారించారు. ఆయనతోపాటు మరో ఆరుగురినీ విచారించగా భైరవీ పూజలు నిజమేనని అంగీకరించారు. మహిషాసురమర్ధని అవతారంలో ఉన్న కనకదుర్గమ్మకు భైరవి పూజలు నిర్వహించిన తరువాత అమ్మవారిని శాంతింపజేయడం కోసం పరిసరాల్లో ఎవరికీ తెలియకుండా జంతుబలి ఇవ్వడం ఆనవాయితీ. 26వ తేదీ కూడా దేవస్థానం పరిసరాల్లో జంతుబలి మిగతా 9లో



గజల్ శ్రీనివాస్‌కు బెయిలిస్తే ప్రమాదం

కోర్టుకు తెలిపిన పోలీసులు

9

అధిక దిగుబడులు పొందడానికి భూమిక నే వాడండి
BHOOMIKA
★ మొక్కలను వ్యాధుల నుండి పూర్తిగా రక్షించును.
★ మొక్క పెరుగుదలను మరియు పంట దిగుబడిని పెంచును.
★ మొక్కలు నీటి ఎద్దడిని తట్టుకునే విధంగా చేయును.
★ రసాయనాలకు తట్టుకోగల వివిధ రకాల వ్యాధికారక శిలీంద్రాలను నివారించును.
★ కాలుష్యరహిత మరియు పర్యావరణమునకు హాని కలిగించదు.
డీలర్స్ మరియు సేల్స్ ఆఫీసర్స్ సంప్రదించండి
డా॥ లియో డేనియల్ మొబైల్ : 94418 04911
Varsha Bioscience and Technology India Pvt Ltd
An ISO 9001-2008 Certified company
Corporate Office : 17-1-383/36/2, Floor 3&4, 2nd Main Road, Vinaynagar, Saidabad, Hyderabad-500059, Telangana
Ph : +914024074427, Fax : +914024071787



నదుల అనుసంధానమే శరణ్యం

- రూ.50 వేల కోట్లతో పక్కా గృహాలు
- వాణిజ్య పంటల కేంద్రంగా రాయలసీమ
- జన్మభూమిని రాజకీయ వేదికగా మార్చొద్దు
- పులివెందుల జన్మభూమిలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్రంలో కరువు నివారణకు నదుల అనుసంధానమే శరణ్యమని, శ్రీకాకుళం నుంచి రాయలసీమలోని పెన్నా, సోమశిల రిజర్వాయర్ల అనుసంధానం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. బుధవారం పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం పార్నపల్లి సమీపంలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఎత్తిపోతల పథకం పనుల ప్రారంభోత్సవం, పులివెందుల్లో నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత, సాంస్కృతిక పోటీల నిర్వహణ, పంచాయతీలకు స్టార్ మిగతా 9లో

బ్యాక్టీరియల్ తెగుళ్ల నియంత్రణకు
స్ట్రెప్టోసైక్లిన్
STREPTOCYCLINE
భారత ప్రభుత్వ సంస్థచే తయారు చేయబడినది
వివరాలకు సంప్రదించండి 9121019227
Dhana Crop Sciences Ltd
Vasavi Eden Square, Plot No.710, 7th Floor, Beside Apollo Hospital, St. John's Road, SECUNDERABAD - 500 003
Ph : 040-27890788, E-mail : info@dhanacrops.com

నేటికీ కాలి బాటలే..!



శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలో రోడ్డు సదుపాయం లేక రోగిని డోలీపై తీసుకెళ్తున్న గిరిజనులు (ఫైల్ ఫొటో)

- ఇదీ.. గిరిజన ప్రాంతాల ప్ర'గతి'
- రోడ్ల లక్ష్యం 2,871 కిలోమీటర్లు
- పూర్తి చేసింది 15 కిలో మీటర్లే..!!
- అత్యవసర వైద్యానికీ దారి లేని దుస్థితి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గిరిజన కుగ్రామాలకు చేరుకునేందుకు నేటికీ రోడ్లు లేవు. ఆయా గ్రామాల వారు వారపు సంతలకు వెళ్లిరావాలంటే కొండకోనల్లోని కాలిబాటలే శరణ్యమవుతున్నాయి. ప్రభుత్వమేదైనా రాష్ట్రంలోని గిరిజన గూడేలన్నింటికీ నూరు శాతం రోడ్డు సదుపాయం కల్పించడంలో వైఫల్యమే కనిపిస్తోంది. రోడ్డు సదుపాయం లేని గిరిజన గ్రామాల వారికి అత్యవసరమైనప్పుడు వైద్యం అందించడానికీ లేదా వారు వైద్యశాల ఉన్నచోటికి రావడానికీ వీలుంటం లేదు. ఇందుకు కారణం రోడ్లే లేక పోవడం, రోడ్లున్నా సరిగా లేక పోవడమే కారణమని గిరిజనులు వాపోతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో 1,536 గ్రామాలకు 2,871 కిలోమీటర్ల పొడవున రోడ్లు నిర్మించాలని గత ఏడాది ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అధికారులు రూ.864 కోట్లు వ్యయం కాగలవని అంచనా వేశారు. ఈ నిధులను కొంత మేరకు గిరిజన ఉప ప్రణాళిక నుంచి, మరి కొన్ని నిధులను ఉపాధి హామీ పథకం నుంచి సమకూర్చాలని నిర్ణయించారు. ఆయా గిరిజన గ్రామాల కోసం శ్రీకాకుళం జిల్లాలో 325, విజయనగరం జిల్లాలో 772, విశాఖపట్నం జిల్లాలో 871, తూర్పుగోదావరి జిల్లాలోని రంపచోడవరం ఐటిడిఎ పరిధిలో 553, చింతూరు పరిధిలో 185, పశ్చిమగోదావరి జిల్లాలో 163 కిలో మీటర్ల మిగతా 9లో

అన్ని వసతులుంటేనే అమరావతిలో హైకోర్టు

సిజె అధ్యక్షతన ఫుల్‌కోర్టు నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్



తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు ఎట్టకేలకు విభజన దిశగా చర్యలకు బుధవారం శ్రీకారం చుట్టింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్ అధ్యక్షతన హైకోర్టు న్యాయమూర్తులంతా (ఫుల్ కోర్టు) సమావేశమైంది. హైకోర్టు విభజన కోసం చర్యలు తీసుకుంటున్నామని, అమరావతిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక భవనాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరుతూ ఎపి సిఎం నారా చంద్రబాబునాయుడు లేఖ రాసిన నేపథ్యంలో బుధవారం ఫుల్ కోర్టు సమావేశమైంది. అన్ని వసతులు ఉంటేనే అమరావతికి వెళ్లాలని గంటకుపైగా జరిగిన ఈ సమావేశంలో న్యాయమూర్తులు నిర్ణయించారని సమాచారం. తొలుత ఈ ప్రతిపాదనపై కొందరు న్యాయమూర్తులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఓటింగ్ కూడా జరిగినట్లు తెలిసింది. మెజార్టీ సభ్యుల నిర్ణయం మేరకు అమరావతిలో హైకోర్టు కోసం ఎంపిక చేసినట్లు చెబుతున్న భవనాల పరిశీలన కోసం అయిదుగురు న్యాయమూర్తులతో కూడిన కమిటీని పంపాలని సమావేశం నిర్ణయించింది. ఉద్యోగు విభజన, ఇతర అంశాలపై కూడా కమిటీలు వేయాలని సమావేశం అభిప్రాయపడినట్లు తెలిసింది. అమరావతి పరిశీలనకు వెళ్లే కమిటీ నిర్ణయం తర్వాత ఇతర కమిటీలపై నిర్ణయం ఉండవచ్చునని సమాచారం.

'చర్మ'వ్యాధులతో బాధలా?
కాన్స్‌టిట్యూషనల్ హోమియోపతితో సరైన పరిష్కారాలు.
• సోరియాసిస్
• ఎగ్జిమా
• చర్మం పొడిబారటం
• జుట్టు రాలుట/బట్టతల
హోమియోకేర్ ఇంటర్‌నేషనల్
టోల్ ఫ్రీ 1800 108 1212
కన్సల్టేషన్ ఉచితం 955 000 1199
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
కర్ణాటక | తమిళనాడు | పుదుచ్చేరి



వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో 10 శాతం పెట్టుబడులు ఉపసంహరణ

రాజ్యసభలో కేంద్ర మంత్రి విష్ణు దేవ సాయి 8



ఇంటర్ గ్రేడింగ్‌పై మళ్లీ చర్చ

జెఇఇ నిబంధనలు అడ్డు

విద్యార్థుల్లో ఆందోళన 9



ఉభయ కొరియాల మధ్య హాట్‌లైన్ పునఃప్రారంభం

9

సమ్మె కాలానికి జీతాలివ్వాలి

మున్సిపల్ జెఎసి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికులు డిసెంబర్ 18 నుంచి 22 వరకు చేపట్టిన సమ్మె కాలాన్ని రెగ్యులరైజ్ చేసి, జీతాలివ్వాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపి మున్సిపల్ జెఎసి) నాయకులు కె ఉమామహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డిసెంబర్ 22న జెఎసికి ఇచ్చిన మినిట్స్ కాపీ ఆధారంగా ఉత్తర్వులు జారీ చేయాలని, పర్మినెంట్ కార్మికుల సమస్యలపై ప్రత్యేక చర్చకు జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్ కరికాల వలవన్‌కు విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. ముఖ్య కార్యదర్శిని కలిసిన వారిలో జెఎసి నాయకులు పి రామచంద్రరావు, ఈ మధుబాబు, ఎస్ శంకరరావు ఉన్నారని ఆయన పేర్కొన్నారు.



భద్రతపై సమీక్ష

తీర ప్రాంత భద్రతపై హోంశాఖ ఉన్నతాధికారులు, పోలీసు అధికారులతో బుధవారం విజయవాడలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్

'ప్రకృతి'లో వికృతి

విషాహారంతో 20 మందికి అస్వస్థత

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఎఎన్‌యు) ఎదురుగా ఉన్న బైబిల్ మిషన్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయంపై శిక్షణకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు పలువురు అక్కడి ఆహారం సరిపడక రెండు రోజులుగా కడుపునొప్పితో సుమారు 70 మంది విలవిల్లాడారు. విరేచనాలు, వాంతులతో నానాయాతన పడ్డారు. ఫుడ్‌పాయిజన్ వల్ల 20 మందికి సెలైన్లు ఎక్కించారు. కొందర్ని గుంటూరు జిజిహెచ్‌కు తరలించారు. ఫుడ్ పాయిజన్ సంఘటన తెలుసుకున్న జాయింట్ కలెక్టర్-2 ఎం.వెంకటేశ్వరరావు, జెడిఎ ఎం.విజయభారతి ఫుడ్ కమిటీ సభ్యులతో బుధవారం ఆ శిక్షణ కేంద్రం వద్ద అత్యవసర సమావేశం నిర్వహించారు. కిందటి రోజు మిగిలిన ఆహార పదార్థాలను మరుసటి రోజూ వినియోగించటం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న జెసి-2 రైతులకు అందించే ఆహారంలో నాణ్యత లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారని తెలిసింది. ఆహారంలో మషాళా మోతాదును తగ్గించాలని, తగినంత పెరుగు, మజ్జిగను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు.



పొడి వాతావరణం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో పొడి వాతావరణం కొనసాగుతుందని విశాఖపట్నం వాతావరణ కేంద్ర అధికారులు బుధవారం రాత్రి వెల్లడించారు. ఎపి, తెలంగాణలో వాతావరణ పరిస్థితులు, చలిలో పెద్దగా హెచ్చుతగ్గుల్లేవని పేర్కొన్నారు. సాధారణ చలికాలంలో ఉండే విధంగానే ఉష్ణోగ్రతలున్నాయని వెల్లడించారు.

టైపిస్టుల క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర టైపిస్ట్స్, స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ జాయింట్ సెక్రటరీ ఎన్ శ్రీనివాసులు బుధవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ టైపిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్రన్న యాదవ్, కార్యదర్శి సాంబశివరావు, రాష్ట్ర టైపిస్ట్, స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి శ్రీనివాసరావు, జిఎం గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్ఞ

సముద్రాదనాలు 7లో

1. ఈజిప్టులో అత్యవసర పరిస్థితిని తాజాగా ఎన్ని నెలలు పొడిగించారు?
2. ఏ వలస జాతీయులను తమ దేశం నుంచి వెళ్లిపోవాలని ఇజ్రాయల్ ఆదేశించింది?
3. ఏ దేశానికి అమెరికా ఆర్థిక సహాయాన్ని నిలిపివేసింది?
4. సోలార్ బేస్డ్ మైక్రో ఇరిగేషన్‌ను ఏ రాష్ట్రం ప్రారంభించింది?
5. ఇటీవల రాజ్యసభ ఆమోదించిన బిల్లు?

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.


ఇండస్ట్రియల్ టౌన్ షిప్పులకు

ప్రణాళికలు సిద్ధం చేయాలి

- వారధులకు అత్యుత్తమ నిర్మాణాలను పరిశీలించాలి
- సిఆర్‌డిఎ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పారిశ్రామిక వాడలు, వారధులతో ఆకర్షణీయ అమరావతిని నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. బుధవారం రాత్రి విజయవాడ క్యాంపు కార్యాలయంలో సిఆర్‌డిఎ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజధాని బాహ్య వలయ రహదారి మార్గంలో రెండు, మూడు ఇండస్ట్రియల్ టౌన్‌షిప్పుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కృష్ణా నదిపై నిర్మించనున్న వారధుల కోసం ప్రపంచంలోనే అత్యుత్తమ నిర్మాణాలను పరిశీలించాలన్నారు. ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండే ప్రదేశాల్లో, నీటి వనరులు పుష్కలంగా ఉన్న చోట్ల ఈ టౌన్‌షిప్పులు ఏర్పాటు చేయాలన్నారు. పారిశ్రామిక జోన్ల ఏర్పాటు ద్వారా ఆ ప్రాంతం వాణిజ్యపరంగా త్వరగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. దీనిపై 30 రోజుల్లో ప్రతిపాదనలు అందించాలన్నారు. బాహ్య, అంతర్ వలయ రహదారుల్లో శీఘ్రగతిన అభివృద్ధి ఎలా చేయాలన్న అంశంపై ఇప్పటి నుంచే తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అమరావతి-అనంతపురము ఎక్స్‌ప్రెస్ హైవే మార్గంలో కూడా పలు జిల్లాల పరిధిలో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్పులను ఏర్పాటు చేయాలని, తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందంటే సంబంధిత భూ యజమానులు భూ సమీకరణకు ముందుకొస్తారని అన్నారు. మూడు, నాలుగేళ్లలో ఏర్పాటు చేయబోయే అంతర్జాతీయ విమానాశ్రయ అవసరాలను దృష్టిలో



పెట్టుకుని ఇప్పటి నుంచే భూ సమీకరణకు తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో 30 గ్రామాల మీదుగా సాగే అమరావతి అంతర్ వలయ రహదారిని మొదటి విడతగా 97.5 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్నట్లు అధికారులు సిఎంకు వివరించారు. ఐదు గ్రామాల రైతులు భూ సమీకరణలో భూముల్ని ఇచ్చేందుకు ముందుకొచ్చారని సిఆర్‌డిఎ కమిషనర్ శ్రీధర్ సిఎంకు తెలిపారు. 189 కిలోమీటర్ల మేర బాహ్య వలయ రహదారిని నిర్మిస్తున్నామని, ఎన్‌హెచ్‌ఎఐ అనుమతులు మంజూరు చేసిందని అధికారులు వివరించారు. రూ.17,761 కోట్ల వ్యయంతో 150 మీటర్ల వెడల్పుతో ఆరు లేన్ల రహదారిగా ఇది ఏర్పాటు అవుతుందని తెలిపారు. ఇందుకు మొత్తం 3,404 హెక్టార్ల భూమి అవసరమవతుందన్నారు. అమరావతి-అనంతపురము ఎక్స్‌ప్రెస్ హైవే పూర్తయితే 13 జిల్లాల మధ్య ప్రయాణ భారం తగ్గిపోతుందని, ముఖ్యంగా రాజధానికి రాయలసీమ బాగా దగ్గర అవుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. 200 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న ఈ రహదారికి సమాంతరంగా రైల్వే లైను కూడా రానుండటంతో దారి పొడవునా ఉన్న జిల్లాల్లో అభివృద్ధి వేగంగా జరుతుందన్నారు. ఎక్స్‌ప్రెస్ హైవే భూ సేకరణకు ఈ బడ్జెట్ తొలి త్రైమాసికంలోనే రూ.2500 కోట్లు కేటాయించాలని అధికారులు సిఎంను కోరారు.

జన్మభూమికి రోజువారీ గ్రేడింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జన్మభూమి నిర్వహణపై గ్రామాలు, డివిజన్ల వారీగా రోజువారీ గ్రేడింగ్ ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ప్రజాసేవలో పోటీతత్వం పెంచేందుకే ఈ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. రోజువారీ నివేదికలకు 40 శాతం, గ్రామ స్థాయిలో సర్వేకు మరో 40 శాతం, సెంటిమెంట్ అనాలిసిస్‌కు 20 శాతం మార్కులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. తన నివాసం నుంచి బుధవారం ఉదయం జన్మభూమిపై అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలిరోజు విజయనగరం, కడప, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాలు ఎ గ్రేడ్ సాధించినట్లు చెప్పారు. మరోవైపు జన్మభూమి నిర్వహిస్తున్న తీరు, సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నామని తెలిపారు. గుంటూరు, పశ్చిమ గోదావరి, నెల్లూరు, కృష్ణా, చిత్తూరు, ప్రకాశం జిల్లాలో తొలిరోజు ప్రజల్లో 70 నుంచి 80 శాతం సంతృప్తి వచ్చిందన్నారు. గ్రామాలు, డివిజన్‌లలో ప్రశాంతంగా, క్రమశిక్షణతో కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అడ్డంకులు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్థికేతర ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజా సంతృప్తి, అభివృద్ధి, సంక్షేమం, అధికారుల పనితీరుకు నిదర్శనమని తెలిపారు. సాధికారమిత్రలను విలేజ్ రిసోర్సు పర్సన్‌లుగా వినియోగించుకోవాలన్నారు. ఆహారం, నీరు, పరిసరాల పరిశుభ్రత, జీవన విధానంపై ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సేంద్రియ వ్యవసాయంతో ఆహారంతో పోషక విలువలు పెంచుతున్నట్లు చెప్పారు.

బోయ వాల్మీకులను ఎస్టీలో చేర్చొద్దు

ఎస్టీ కమిషన్‌కు యానాదుల సంఘం వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బోయ,వాల్మీకులను ఎస్టీ జాబితాలో కలపొద్దని ఏపి యానాదుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కుడమల రామచంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నాడిక్కడ జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ నందకుమార్ సాయి, సిపిఎం జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు, కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులకు ఏపి యానాదుల సంక్షేమ సంఘం బృందం వినతి పత్రం అందజేసింది. బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏపి అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకోవద్దని, వారిని ఎస్టీ జాబితాలో చేర్చొద్దని పేర్కొన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ నంద కుమార్ సాయి ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారని రామచంద్రయ్య తెలిపారు. ఏపి ప్రభుత్వం బోయలను ఎస్టీలో చేర్చుతూ తీర్మానం చేయడం అశాస్త్రీయంగా జరిగిందని, గిరిజనులకు అన్యాయం జరుగుతుందని సిపిఎం కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.శ్రీనివాసరావుకు బృందం వివరించింది. యానాదుల సంఘ నేతలు వివరించిన అంశాలను విన్న వి. శ్రీనివాసరావు చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసినవారిలో సంఘం చైర్మన్ నిమ్మల దశరథరామయ్య, ఉపాధ్యక్షులు కె.సి పెంచలయ్య, చేవూరు సుబ్బారావు, ఎం.లక్ష్మీనారాయణ, ఐ.చిరంజీవి, మురళి తదితరులు పాల్గొన్నారు.

రాజధానికి రుణమంటే ప్రపంచ బ్యాంకుకు తాకట్టే : రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు రుణాన్ని మంజూరు చేయిస్తామని కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించడం దారుణమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. విభజన చట్టం ప్రకారం కేంద్రం రాష్ట్రానికి సహకరించాలని గుర్తు చేశారు. విజయవాడలోని దాసరి భవన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజధాని నిర్మాణం పేరుతో ఒక విధంగా రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టడమే కాగలదని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, టిడిపి ఎంపిలకు చిత్తశుద్ధి ఉంటే కేంద్రమే ఈ నిర్మాణ ఖర్చును భరించే విధంగా ఒత్తిడి పెంచాలని సూచించారు. ప్రపంచ బ్యాంకు అప్పు ఇస్తుంటే అమరావతి నిర్మాణంపై కేంద్రం బాధ్యతేమిటో, దీనిపై చంద్రబాబు వైఖరేమిటో స్పష్టం కావాలన్నారు. నాలా బిల్లు జాప్యంపై గవర్నర్‌పై రాద్ధాంతం చేస్తున్న బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పార్టీ ఫిరాయింపుదార్లపై చర్యల గురించి ఎందుకు నిలదీయరని ప్రశ్నించారు. ఆస్తికుల మనోభావాలను దెబ్బతీసే విధంగా దుర్గగుడిలో జరిగిన క్షుద్ర పూజలపై సమగ్ర విచారణ చేయించి, బాధ్యులను శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, రావుల వెంకయ్య పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

పెద గొట్టిపాడు ఘటనపై డిజిపికి ప్రజా సంఘాల వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా పెద గొట్టిపాడులో దళితులపై దాడి చేసిన అగ్రకులస్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిజిపి మాలకొండయ్యను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై మాలకొండయ్య స్పందిస్తూ విచారణ అయిన వెంటనే చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. సంఘటన జరిగి 30 గంటలు దాటినా నిందితులను ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం బాధితుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోందని నాయకులు వినతి పత్రంలో తెలిపారు. దాడులను పోలీసులు నిరోధించకపోగా, నిందితులను పట్టుకోకపోతే ప్రాణహాని ఉందనే భయాన్ని బాధితులు వ్యక్తపరుస్తున్నారని వివరించారు. వైద్య సౌకర్యం కూడా అందకుండా ఆర్‌ఎంపి వైద్యుణ్నీ అడ్డగిస్తున్నట్లు బాధితులు వాపోతున్నారని తెలిపారు. గ్రామంలో ఉన్న మంచి నీటి బావిని సైతం వాడొద్దంటు ఆంక్షలు విధిస్తున్నారని పేర్కొన్నారు. నిందితులను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం కింద అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సాంఘిక దురాచారాలను ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దాడికి కారణమైన అంశాలపై సమగ్ర విచారణ జరిపి తగు విధంగా కేసును ఫైల్ చేసి బాధితులకు అండగా నిలవాలని కోరారు. బాధితులను భయభ్రాంతులను చేస్తూ పోలీసులు గ్రామాన్ని, ముఖ్యంగా బాధితుల కుటుంబాలను ఇబ్బంది పెట్టడం మానుకోవాలని తెలిపారు. బాధితులకు ప్రాణరక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.డిజిపిని కలిసిన వారిలో కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు, సామాజిక న్యాయ సాధన కన్వీనర్ మాతంగి దిలీప్ కుమార్, సేవాస్తంభ అధ్యక్షులు ప్రసాద్ తదితరులున్నారు.

మైనార్టీ కవిత్వ పుస్తకావిష్కరణను అడ్డుకున్న టిడిపి

- పుస్తక మహోత్సవంలో ఉద్రిక్తత
- పోలీసుల రక్షణలో బయటకు తరలింపు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

విజయవాడ స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన పుస్తక మహోత్సవ్‌లో బుధవారం రాత్రి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పుస్తక మహోత్సవ ప్రాంగణంలో స్కై బాబా సంపాదకత్వంలో వెలువడిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు నాయకులు అడ్డుకున్నారు. నిర్వాహకులతో తీవ్రస్థాయిలో వాగ్వివాదానికి దిగారు. దీంతో పుస్తకావిష్కరణ వాయిదా పడింది. స్కైబాబాను నిర్వాహకుల, రచయితల సంరక్షణలో అక్కడి నుండి తరలించాల్సివచ్చింది. స్కైబాబా, షాజాహానాల సంపాదకత్వంలో 35 మంది మైనార్టీ రచయితలు రాసిన కవితల సంకలనం'మొఖామి'ని బుధవారం రాత్రి ఆవిష్కరించాల్సిఉంది. అంతకుముందే అక్కడకు చేరుకున్న టిడిపి నాయకులు పుస్తకావిష్కరణకు, స్కైబాబాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో స్కైబాబా ఆంధ్రులను తిడుతూ అసభ్యకరమైన కవితలు రాశారని, ఆయన రాసిన పుస్తకాన్ని ఎలా ఆవిష్కరిస్తారని వారు ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గన్నె వెంకట వర ప్రసాద్ (అన్నా), టిడిపి కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ, తెలుగు యువత నాయకులు చాగంటి విజయభాస్కర్, ఆ పార్టీకి చెందిన పలువురు మహిళలు, సోషల్ మీడియా విభాగానికి చెందిన కార్యకర్తలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఆవిష్కరిస్తున్నది స్కైబాబా రాసిన పుస్తకం కాదని, ఆయన సంపాదకత్వంలో వచ్చిన మైనార్టీ కవిత్వ పుస్తకాన్ని మాత్రమేనని నిర్వాహకులు నచ్చచెప్పడానికి ప్రయత్నించినా వారు ఖాతరు చేయలేదు. కార్యక్రమానికి హాజరైన పలువురు కవులు, రచయితలు స్కైబాబా కవితలతో తాము ఏకీభవించడం లేదని, అయితే పుస్తకాన్ని ఆవిష్కరించుకునే హక్కు ఆయనకుందని చెప్పడానికి ప్రయత్నించినా వారు వినలేదు.

ఎవరైనా కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చు : విజయకుమార్

విజయవాడ పుస్తక మహోత్సవ్‌లో ఎవరైనా కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చని పుస్తక మహోత్సవ్ సమన్వయకర్త, ఎమెస్కో బుక్‌హౌస్ అధినేత కె.విజయకుమార్ అన్నారు. అందుకే అనుమతించామని పుస్తక మహోత్సవ్‌లో ఎవరైనా ఒక్కటేనని అన్నారు. అయితే కొంత మంది మనోభావాలు దెబ్బతిన్నకారణంగా స్కై బాబా పుస్తకావిష్కరణను నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించారు.



నిర్వాహకులతో గొడవ పడుతున్న టిడిపి నేతలు

వివాదాస్పదమైన పోలీసుల తీరు

ముందుగా ప్రకటించిన కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించిన టిడిపి నేతలను వారించడానికి బదులుగా నిర్వాహకులపై పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేసిన తీరు వివాదాస్పదంగా మారింది. ఎసిపి కె. శ్రీనివాసులు ఒక దశలో నిర్వాహకులను, ప్రచురణ కర్తలను ఆరునెలల పాటు లోపలేస్తానని హెచ్చరించడం వినిపించింది.

ప్రత్యేకం


కోడి పందేలకు చెక్..!

- హైకోర్టు వ్యాఖ్యలతో కదిలిన యంత్రాంగం
- పోలీస్, రెవిన్యూ సిబ్బందికి ఆదేశాలు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంక్రాంతి పండుగ పేరిట నిర్వహించే కోడి పందేలు, ఇతర జూదాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో ఎవరైనా పందేలను నిర్వహిస్తే దానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి బాధ్యత వహించాలని హైకోర్టు హెచ్చరించిన నేపథ్యంలో యంత్రాంగం కదిలింది. ముందస్తు చర్యగా పోలీస్, రెవెన్యూ, పశు సంవర్థక శాఖ, ఎన్‌జిఒ ప్రతినిధులు, ఇతర అధికారులతో ఉమ్మడి కమిటీలు వేసే ప్రక్రియను బుధవారం ప్రారంభించారు. 1960 జంతు చట్టం, 1974 గేమింగ్ చట్టాలను అనుసరించి ఏర్పాటైన మండల స్థాయి కమిటీలే కోడి పందేలు జరగక్కుండా చూడాల్సి ఉంది. నిబంధనలు ఉల్లంఘించి కోడి పందేలు నిర్వహించే వారు, వాటిని ప్రోత్సహించే వారిపైనా చర్యలు తీసుకోవడానికి అధికారులు సిద్ధమవు తున్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్, డిజిపి మాలకొండయ్య ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. కోడి పందేలకు ప్రసిద్ధి చెందిన ఉభయ గోదావరి జిల్లాలు సహా అన్ని జిల్లాలపైనా దృష్టి కేంద్రీకరించమని ఆదేశాలు జారీ చేశారని సమాచారం. విశాఖపట్నం, విజయవాడ పోలీస్ కమిషనర్లకూ ఈ ఆదేశాలందాయి. ఈ నేపథ్యంలో విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతమ్ సవాంగ్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో సమావేశమై కోడి పందేలను అడ్డుకోవాలని ఆదేశించారు.గతంలో పందేలు నిర్వహించిన వారిని పండుగకు ముందు రోజుల్లోనే బైండోవర్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలను అతిక్రమించి పందేలను నిర్వహిస్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. పందెం కోళ్లను పెంచే ఫారాలు, వాటికి కత్తులు కట్టే వారిపైనా పోలీసులు నిఘా పెట్టారు. మండల స్థాయి కమిటీలు కోడి పందేలు ఎక్కువగా జరిగే గ్రామాల్లో అవగాహన కల్పించడానికి సమావేశాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. పందేలకు అనుకూలంగా ఉన్న అధికార పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధుల ద్వారా నిర్వాహకులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. కేవలం మూడు రోజులు అనుమతులిస్తే కత్తి కట్టకుండా డింకీ పందేలు నిర్వహిస్తామని వారు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.



PROCEEDINGS OF THE TAHSILDAR & MANDAL EXECUTIVE MAGISTRATE, VUYYURU MANDAL

ORDER:

[illegible]

కృష్ణాజిల్లా కలెక్టర్ నుంచి ఉయ్యూరు తహశీల్దారుకు అందిన జూద నిరోధక కమిటీ నియామక పత్రం

సంక్షిప్తం

11న జన్మభూమిలో రుణ మేళా

అమరావతి బ్యూరో : ఈ నెల 11న రాష్ట్ర వ్యాప్తంగా మెగా రుణ మేళా కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జన్మభూమి ఆఖరి రోజైన వచ్చే గురువారం 11న లబ్ధిదారులకు రుణాలు అందించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ, కాపు కార్పొరేషన్ల ద్వారా అమలు చేస్తున్న స్వయం ఉపాధి కల్పన పథకాలకు, బ్యాంకు లింక్డ్ స్కీమ్‌లకు ఈ రుణాలివ్వనున్నారు.

సమ్మె నోటీస్ అందజేసిన అంగన్‌వాడీ యూనియన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వ పథకాల ఉద్యోగులు ఈ నెల 23న నిర్వహిస్తున్న సమ్మెలో పాల్గొంటున్నామని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్(ఎఐటియుసి) తెలిపాయి. ఈ మేరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌ను సిఐటియు అనుబంధ సంస్థ ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి జె లలిత కలిసి సమ్మె నోటీస్‌ను బుధవారం అందజేశారు.

దళితుల పట్ల సిఎం చిన్నచూపు : వైసిపి

అమరావతి బ్యూరో : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దళితుల్ని చిన్నచూపు చూస్తున్నారని వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మేరుగు నాగార్జున ఆరోపించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ సిఎం వ్యవహార శైలితోనే రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగాయన్నారు. దళితుల సంక్షేమానికి తూట్లు పొడిచే విధంగా ప్రజాప్రతినిధులూ వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జన్మభూమి సభల్లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులపై ప్రశ్నిస్తున్న దళితులను అడ్డుకుంటున్నారని విమర్శించారు. పశ్చిమ గోదావరిజిల్లా గరగపర్రు, ప్రకాశం జిల్లా దేవరపల్లి ఘటనలన మరిచిపోకముందే విశాఖ జిల్లా జెర్రిపోతులపాలెంలో ఎమ్మెల్యే బండారు, అతని కుమారుడి ప్రోద్భలంతో దళిత మహిళను బహిరంగంగా వివస్త్రను చేసి దాడి చేశారని తెలిపారు. ఈ వ్యవహారంలో నిష్పక్షపాతంగా వ్యవహరించిన పోలీస్ అధికారి అర్జున్‌పై ఎమ్మెల్యే బండారు సిఎంకు ఫిర్యాదు చేసి విఆర్‌లో పెట్టించారని పేర్కొన్నారు. టిడిపి నేతల ఆగడాలను అడ్డుకుంటోన్న అధికారులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు.

ఎంవి చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా రేపు ఆర్టీసి ఎస్‌డబ్లుఎఫ్ నిరసనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మోటార్ వాహన చట్ట సవరణకు కేంద్రం పార్లమెంటులో బిల్లును ప్రవేశపెడుతుండడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం కేరళ, తమిళనాడుల్లో మోటారు వాహనాల సమ్మె చేపట్టనున్నారు. ఈ సమ్మెకు మద్దతుగా అదే రోజు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎపిఎస్ ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, ప్రధాన కార్యదిర్శ సిహెచ్ సుందరయ్య, ప్రచార కార్యదర్శి ఎం అయపరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ బిల్లు ద్వారా ఆర్టీసికి ఉన్న నిబంధనలు పోతాయని తెలిపారు. అగ్రిగేటర్లకు అనుమతివ్వడం వల్ల ప్రస్తుతం రాష్ట్రాల పరిధిలో ఉన్న రవాణా శాఖల అధికారాలు కేంద్రం చేతుల్లోకి వెళ్తాయని పేర్కొన్నారు. వాహనాలకు పర్మిట్లు ఇచ్చే అధికారం ప్రస్తుతం రాష్ట్రాల చేతుల్లో ఉందని, ఈ సవరణ బిల్లు ద్వారా ఆ అధికారాలు పోతాయని తెలిపారు. ప్రస్తుతం పర్మిట్లలో ఉన్న స్టేజ్, కాంట్రాక్ట్, టూరిస్ట్ క్యారేజి పర్మిట్లను తొలగించి ఒకే ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్‌ను ఎవరైనా తీసుకునేలా అనుమతివ్వడం సరికాదని పేర్కొన్నారు. ఈ సవరణ బిల్లు మొత్తం రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉందని వివరించారు.

ఫిబ్రవరి 19 నుంచి వరల్డ్ ఐటీ కాంగ్రెస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే నెలలో మరో ప్రతిష్టాత్మక సదస్సుకు హైదరాబాద్ వేదికకానుంది. ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు మూడు రోజులపాటు వరల్డ్ ఐటి కాంగ్రెస్ ఇక్కడ నిర్వహించాలని నిర్ణయించారు. వరల్డ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సర్వీస్ అలయెన్స్, దేశ ఐటి, అనుబంధ సంస్థల వేదిక అయిన నాస్కామ్‌లు సంయుక్తంగా సదస్సును ఏర్పాటు చేస్తున్నాయి. 'యాంప్లిఫై డిజిటల్-డిసరప్ట్ ద కోర్' అనే పేరుతో ఈ సదస్సును నిర్వహించనున్నాయి. డబ్ల్యూసీఐటీ సదస్సులో 80 ప్రధాన దేశాలకు చెందిన 2,500 మంది ప్రతినిధులతోపాటు, కేంద్రమంత్రులు పాల్గొననున్నారు. ఈ సదస్సును భారత్‌లో నిర్వహించడం ఇదే తొలిసారి. వివిధ దేశాలకు చెందిన ఐటి ప్రముఖులతో పాటు ఐటి కంపెనీల సంస్థల ప్రతినిధులు, విద్యాసంస్థల ప్రతినిధులు హాజరుకానున్నారు.

ట్రిపుల్ 'తలాక్'ను సెలక్ట్ కమిటీకి పంపాలి : సురవరం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి డిమాండ్ చేశారు. తలాక్ బిల్లును అంత ఆదరాబాదరాగా అమలు చేయాల్సిన అవసరమేముందని ప్రశ్నించారు. ముస్లిం మహిళలకు న్యాయం జరిగే విధంగా చట్టంలో సంస్కరణలు తీసుకురావాలన్నారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళా సంఘాలతో చర్చించి, వారి అభిప్రాయాలను, సూచనలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ఒకే జాతి, ఒకే చట్టం పేరిట బిజెపి అనేక సమస్యలను సృష్టిస్తోందని విమర్శించారు. విడాకులు లేకుండా, పరిహారం చెల్లించకుండా చట్టం రూపొందించడం సమంజసం కాదని పేర్కొన్నారు.



రాజమహేంద్రవరంలోని నురానీ మసీదులో మౌజాన్ మహ్మద్ ఫరూఖ్‌ను హత్యచేసిన కేసులో మీడియా ముందు నిందితుడిని ప్రవేశపెట్టిన ఎస్‌పి రాజకుమారి

రిమాండుకు మౌజన్ హంతకుడు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరంక్రైం

డిసెంబర్ 29న రాజమహేంద్రవరంలోని నురానీ మసీదులో మౌజాన్ మహ్మద్ ఫరూఖ్‌ను హత్యచేసిన కేసులో నిందితుడు ఆర్ముగం మణికంఠ (మణి)ను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు బుధవారం తరలించారు. ఈకేసుకు సంబంధించిన వివరాలను రాజమహేంద్రవరం అర్బన్ ఎస్‌పి బి.రాజకుమారి బుధవారం సాయంత్రం విలేకర్లకు తెలియజేశారు.

అనంతపురం జిల్లా గుంతకల్లులోని శ్రీలంక కాలనీకి చెందిన ఆర్ముగం మణికంఠ ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. హోటల్‌లో పనిచేస్తూ చెడువ్యసనాలకు బానిసై డబ్బు కోసం నేరాలకు పాల్పడుతున్నాడు. ఆరు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. నవంబర్‌లో అతడి తల్లిదండ్రులు చనిపోవడంతో సామగ్రి తీసుకుని రాజమహేంద్రవరం బర్మాకాలనీలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. వారు ఇతని గురించి తెలిసి నిరాకరించారు. దీంతో ఓ వ్యక్తి వద్ద తన సామగ్రిని రూ.200కు తాకట్టుపెట్టాడు. ఎవి.అప్పారావు రోడ్డులోని విద్యుత్‌కాలనీలో వున్న వినాయకుని గుడిలో దొంగతనం చేయడానికి రెక్కీ నిర్వహించాడు. నవంబరు 22వ తేదీన వినాయకుడి గుడి వద్దకు వచ్చి తాళం పగులగొట్టాడు. హుండీలోని చిల్లర తీసుకుని గర్భగుడిలోని వెండివస్తువులను రోడ్డుకి అవతలివైపున ఉన్న చెట్టు పక్కన పాతిపెట్టి అతడి స్వగ్రామానికి వెళ్లిపోయాడు. దీంతో రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్‌పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. డిసెంబరు 28న రాజమహేంద్రవరం వచ్చి దాచిపెట్టిన వెండివస్తువులను తీసుకున్నాడు. లాలాచెరువు మద్యం షాపులో మద్యంతాగాడు. అదేరోజు అర్ధరాత్రి సమయంలో స్పిన్నింగ్‌మిల్ వద్ద నడిచివెళ్తూ మసీదును చూశాడు. డబ్బులు వుంటాయని లోపలికి ప్రవేశించాడు. వరండాలో వున్న మౌజాన్ నిద్రపోతుండగా తనతో పాటు తీసుకువెళ్లిన సర్వేక్రతో తలపై పలుమార్లు మోది హత్య చేశాడు. అనంతపురం, ప్రకాశం జిల్లాల పోలీసుల సహకారంతో అతనిని ఈనెల ఒకటో తేదీన ఉరవకొండలో అరెస్టు చేసి రాజమహేంద్రవరం తీసుకువచ్చారు.

మరుగుదొడ్లలో అవినీతి కంపు

- పాత వాటికే సున్నాలు
- ఒకే దానికి రెండు, మూడు బిల్లులు
- ఇద్దరు అధికారులపై వేటు
- రూ.లక్షలు దండుకుంటున్న వైనం

మరుగుదొడ్డికి పాత పెంకులు, తలుపులు పెట్టున్న ఈ చిత్రం చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం పాత కందులూరిపల్లి గ్రామ పంచాయతీలోని ఐఎవై కాలనీలోనిది. ఇక్కడ పాత గోడలకే సున్నాలు పూసి, దానిపై పాత రేకులు, తలుపులు పెట్టేసి బిల్లులు పెట్టుకుని అధికారులు రూ.లక్షలు దండుకుంటున్నారు. ఈ గ్రామంలో 200కుపైగా మరుగుదొడ్లకు ఇదే పరిస్థితి. మధ్యవర్తులు, అధికారులు కుమ్మక్కై అందిన కాడికి దోచుకుంటున్నారు.

అవినీతి రూపాలు..

అధికారులపై ఒత్తిడి పెరగడంతో క్షేత్ర స్థాయిలో ఏమి జరుగుతుందో పట్టించుకోకుండా ఇష్టానుసారంగా బిల్లులు ఇచ్చేస్తున్నారు. సాధారణంగా ఇంటి మెట్ల కింద ఖాళీ స్థలం ఉంటుంది. దీనికి ఒక తలుపు పెట్టేసి మరుగుదొడ్డి కట్టేసినట్లు చూపిస్తున్నారు. ఇది వరకే వాడుతూ పాచి పట్టిపోయి ఉన్న మరుగుదొడ్లకు సున్నాలు కొట్టి బిల్లులు పెట్టేస్తున్నారు. అధికారులు కళ్లు మూసుకుని నిధులు ఇచ్చేస్తున్నారు. ఒక ఇంట్లో రెండు రేషన్ కార్డులుండి ఒకే మరుగుదొడ్డి ఉంటే.. దానికి రెండుసార్లు ఫోటోలు తీసి బిల్లులు మంజూరు చేస్తున్నారు. ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించుకునేందుకు స్థలం లేకపోయినా పక్కింటి వారి దానికి ఫోటో తీసి బిల్లులు కొట్టేస్తున్నారు.


కందులూరిపల్లిలో పాత మరుగుదొడ్డికి సున్నం వేసి బిల్లు పొందిన వైనం

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

ఈ పరిస్థితి ఒక్క రామ చంద్రాపురం మండలంలోనే కాదు. చిత్తూరు జిల్లావ్యాప్తంగా ఇదే దుస్థితి. ఇది వరకే వాడుతున్న మరుగుదొడ్లకు కొత్తగా కట్టినట్లు మాయ చేసి బిల్లులు పెట్టుకుని బొక్కేస్తున్నారు. ఇందులో లబ్ధిదారులకు కొంత ముట్టజెప్పి మిగిలినందా కాజేస్తున్నారు. కొందరు అధికారులు అసలు మరుగుదొడ్లు నిర్మించకుండానే బిల్లులు పెట్టి రూ.లక్షలు దండుకుంటున్నారు. ఇందుల మండలస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ అధికారులకు వాటాలు పంచుకుంటున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. ఈ అవినీతి రుజువు కావడంతో ఇప్పటికే చిత్తూరు జిల్లాలో ఇద్దరు అధికారులపై కలెక్టర్ వేటు వేశారు. ఇంకా పలు ప్రాంతాల్లో విచారణలు కొనసాగుతున్నాయి.


కందులూరిపల్లిలో సిమెంటు వేసి, పాత రేకులు పెట్టేసి బిల్లులు పొందిన మరుగుదొడ్డి

మరుగుదొడ్ల నిర్మాణంలో రాష్ట్రంలో చిత్తూరు జిల్లా చివరి నుంచి రెండో స్థానానికి పడిపోయింది. జిల్లాలో 4.97 లక్షల మందికి మరుగుదొడ్లు కావాల్సి ఉంది. ఇందులో స్వచ్ఛభారత్ మిషన్ కింద 2,24,009 కుటుంబాలకు మరుగుదొడ్లు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 1.10 లక్షలు మాత్రమే పూర్తయ్యాయి. మార్చి చివరకు జిల్లా మొత్తాన్ని ఒడిఎఫ్‌గా ప్రకటించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో కలెక్టర్ వ్యవసాయ శాఖ దగ్గరి నుంచి గనుల శాఖ వరకు ప్రతి ఉద్యోగీ 20 మరుగుదొడ్లను నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారు.

దరఖాస్తు చేయని వారి పేరు మీదా బిల్లులు

పాకాల మండలం కావలివారిపల్లిలో నవంబర్‌లో దరఖాస్తే చేయకుండా ఉన్న వారిపేరుతో బిల్లులు పెట్టి దాదాపు రూ.8 లక్షలు కాజేశారు. మొత్తం 53 మరుగుదొడ్లు నిర్మించకుండానే నిర్మించినట్లు రికార్డులు చూపించారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఇందులో ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ నటరాజ్‌ను సస్పెండ్ చేశారు. పులిచెర్ల మండలంలోనూ ఇదే తరహాలో 45 మరుగుదొడ్లు నిర్మించకుండానే బిల్లులు పెట్టారని సమాచారం. దీనికి సంబంధించి రూ.6.75 లక్షలు స్వాహా అయినట్లు తేలింది. దీనికి ఈ మండలంలోని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ స్వరూప రాణిని బాధ్యులుగా గుర్తించారు. ఈమెను విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తూ కలెక్టర్ ప్రద్యుమ్న మంగళవారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. ఇలాంటివి తవ్వేకొందికీ వస్తున్నాయి.

జెఎన్‌టియుకెలో అక్రమాల పరంపర

పేరుకే విచారణ కమిటీలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ విశ్వవిద్యాలయం కాకినాడ (జెఎన్‌టియుకె)లో అనేక అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. యూనివర్సిటీలో అవకతవకలపై విచారణకు కమిటీలు వేసినా అవి పేరుకే అన్నట్లుగా ఉంటున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఏడాదిన్నరగా యూనివర్శిటీలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుంభకోణం ఒకటి వెలుగుచూసింది. ప్రతినెలా సుమారు 560 నుంచి 600 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు యూనివర్సిటీ జీతాలు ఇస్తోంది. జీతాలను అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ఇవ్వాల్సి ఉండగా, కొన్ని నెలలుగా యూనివర్సిటీ ద్వారానే చెల్లిస్తున్నారు. ఉద్యోగుల జీతాల నుంచి పిఎఫ్, ఇఎస్‌ఐ కట్ చేస్తున్నా వారి ఖాతాల్లో జమ కావడం లేదు. ఈ డబ్బులు యూనివర్సిటీ ఒక ఖాతాను ప్రారంభించి దానిలో వేస్తున్నట్లు చెబుతున్నారు. మేన్ పవర్ ఏజెన్సీ అక్రమాలకు పాల్పడిందని ఆ ఏజెన్సీని రద్దు చేశారు. అప్పటినుంచీ ఈ డబ్బులు వేరే ఖాతాల్లో జమ చేయడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉద్యోగి లేదా వారి కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురైతే ఇఎస్‌ఐ సౌకర్యం లభించక ప్రయివేట్ ఆసుపత్రులకు లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. రెండు నెలలుగా ఒక ఏజెన్సీని సృష్టించి పిఎఫ్, ఇఎస్‌ఐ వేస్తున్నట్లు తెలిసింది. ఏడాదిన్నరగా జమ కాని డబ్బుల సంగతి ఎటూ తేల్చలేదని ఉద్యోగులు చెబుతున్నారు.

రూ.32 లక్షలు గోల్‌మాల్

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు యూనివర్సిటీలో సుమారు 600 మంది ఉన్నట్లు అధికారులు చూపించి, వారికి ప్రతినెలా జీతాలు జమ చేసేవారు. యూనివర్సిటీలో 500 మందే ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. అంటే సుమారు వందమంది ఉద్యోగులు లేకపోయినా ఉన్నట్లు చూపించి మూడేళ్లలో సుమారు రూ.32 లక్షలు స్వాహా చేశారు. యూనివర్సిటీ విసి, రిజిస్ట్రార్, ఏజెన్సీ కుమ్మక్కై నిధులను స్వాహా చేశారు. ఈ విషయం కొత్తగా వచ్చిన రిజిస్ట్రార్ సుబ్బారావు తేల్చారు. ఈ చెల్లింపులన్నీ గత రిజిస్ట్రార్ జివిఆర్ ప్రసాదరాజు హయాంలో జరిగినట్లు నిర్ధారణ అయ్యింది. మరోవైపు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చే జీతాల్లోనూ అంకెలు తప్పుగా చూపించి అధికంగా డ్రా చేసి దిగమింగినట్లు తేలినా ఒక్క చర్య కూడా తీసుకోలేదని సమాచారం.

అవుట్‌సోర్సింగ్ నియామకాల్లోనూ అవకతవకలు

మరోవైపు అవుట్‌సోర్సింగ్ నియామకాల్లో పలు అవకతవకలు జరిగాయి. విద్యార్హత సర్టిఫికెట్లు పరిశీలన చేయకుండా ఉద్యోగాలు ఇచ్చేశారని ఉద్యోగుల సర్టిఫికెట్ల తనిఖీలో బయటపడింది. డిగ్రీ, బిటెక్ చదివిన వారు అంటెండర్లుగా పనిచేస్తుంటే పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అయినవారు జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నారు. కనీస విద్యార్హత లేని వారు డైరెక్టర్లకు పిఎలుగా పనిచేస్తున్నారు. దీనిపై అధికారులు ఏమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు. ఏ అర్హత ఉన్నా ప్రస్తుతం చేసే పోస్టుకు అంగీకరించే వచ్చారని చెప్పి తప్పించుకుంటున్నారు. సర్టిఫికెట్ల నిర్ధారణకు రామలింగరాజు అధ్యక్షతన కమిటీ వేశారు. ఈ కమిటీ నివేదికలోనూ 90 మంది ఉద్యోగులు లేకుండానే ఉన్నట్లు చూపించారని తేల్చి చెప్పింది. మ్యాన్ పవర్ ఏజెన్సీని రద్దు చేసింది.

వెంటనే రికవరీ చేస్తాం...
వివిఎస్ఎస్.కుమార్, జెఎన్ టియుకె విసి

కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల విషయంలో అవకతవకలు జరిగాయని నిర్ధారణ అయ్యింది. ఒక ఉద్యోగిపై చర్యలు తీసుకున్నాం. త్వరలోనే రికవరీ చేస్తాం. త్వరలోనే కాంట్రాక్టు ఏజెన్సీని ఖరారు చేయనున్నాం. ఇప్పటికే టెండర్లు పిలిచాం.

ఘనంగా రాష్ట్రస్థాయి 45వ సైన్స్‌ఫేర్

- ఆకట్టుకున్న ప్రదర్శనలు
- ఆలస్యంగా సభ ప్రారంభం

ప్రజాశక్తి -నెల్లూరు అర్బన్

నెల్లూరులోని సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాలలో బుధవారం 45వ రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ ఘనంగా ప్రారంభమైంది. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి పలువురు నేతలు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభకు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ అధ్యక్షత వహించారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. రాష్ట్రంలోని 11 జిల్లాల (శ్రీకాకుళం, విశాఖ తప్ప) నుంచి వచ్చిన విద్యార్థులు 198 ప్రాజెక్టులను ఈ ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో కలెక్టర్ ముత్యాలరాజు మాట్లాడారు. వైజ్ఞానిక ప్రదర్శనలు చేపట్టేలా విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. పలు ఉదాహరణలతో విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపడంతోపాటు పలు ప్రశ్నలతో వారిని ఉత్సాహపరిచారు. ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ.. గ్రామీణ పిల్లలను సైన్స్‌పట్ల ప్రోత్సహించాలన్నారు. సాక్షాత్తు ప్రధాని నరేంద్రమోడి దేశంలో సైన్స్ అభివృద్ధి జరగలేదని చెప్పారని గుర్తు చేశారు. 25 ఏళ్లనుంచి దేశానికి ఒక్క నోబెల్ బహుమతి కూడా రాలేదన్నారు. నేటి విద్యా వ్యవస్థ తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రయోగపూర్వకంగా విద్యాభ్యాసం చేయడం లేదన్నారు. అందువల్లనే విద్యార్థుల్లో నైపుణ్యత లోపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జెడ్‌పి చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, డిఇఒ శ్యామ్యూల్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, ఆర్‌జెడి శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

పక్షుల పండుగపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - నెల్లూరు

నెల్లూరు నగరంలోని విఆర్‌సి గ్రౌండ్ నుంచి నర్తకి సెంటర్ వరకు ఫ్లెమింగో పక్షుల పండుగపై అవగాహన ర్యాలీ బుధవారం జరిగింది. ఈ ర్యాలీని జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 7,8,9 తేదీల్లో సూళ్లూరుపేటలో నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇతర దేశాల నుంచి వేల కిలో మీటర్లు ప్రయాణం చేసి సంతాన ఉత్పత్తికి ఫ్లెమింగో పక్షులు, పెలికాన్, గూడ కొంగలు ఈ ఏడాది అధికసంఖ్యలో వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట, అటకానితిప్ప, నేలపట్టు, బివిపాళెంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. బివి పాళెంలో బోటు షికారు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సూళ్లూరుపేట జూనియర్ కళాశాల ప్రాంగణంలో టివి, సినీ కళాకారుల సారథ్యంలో పలు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అనంతరం మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ఈ పక్షుల పండుగను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టరు - 2 వెంకట సుబ్బారెడ్డి, పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు జయప్రకాష్ పాల్గొన్నారు.

ప్రత్యేకం

సర్కారు మూడేళ్లపాలనపై రహస్య సర్వే..!

- నిఘా వర్గాలు, ప్రయివేట్ ఏజెన్సీలు బిజీబిజీ
- క్షేత్రస్థాయిలో పథకాల అమలుపై సమాచార సేకరణ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

టిడిపి అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్ల అనంతరం ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత ఉందా లేక వ్యతిరేకత ఉందా? మొదలగు వాటిపై సుమారు 25 అంశాలతో క్షేత్రస్థాయిలో ప్రభుత్వం రహస్య సర్వే నిర్వహిస్తోంది. సర్వే కోసం ప్రభుత్వ నిఘా వర్గాలు, ఇంటెలిజెన్సీ అధికారులు, స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితోపాటు చెన్నైకు చెందిన ఓ ప్రయివేట్ సంస్థతో ప్రభుత్వం సర్వే చేయిస్తున్నట్లు సమాచారం. మూడేళ్లపాలనపై సర్కారు అంతర్మథనంలో పడినట్లు స్పష్టంగా అర్థమవుతోంది.



టిడిపికి ఓటేసిన వారు ఎన్నికల ముందు ఏమి ఆశించారు? రాజధాని ఎంపిక, నిర్మాణాలు తదితర విషయాలపై ప్రజల్లో ఎలాంటి అభిప్రాయాలు ఉన్నాయనే అంశాలు సర్వేలో కీలకంగా ఉన్నట్లు సమాచారం. ఏడాదిలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో అసంతృప్తిగా ఉన్న వర్గాలకు ఎటువంటి పథకాలు ప్రవేశపెడితే ఆయా వర్గాల నుంచి ఓటు బ్యాంక్ రాబట్టుకోవచ్చనే అంశాన్నీ పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ప్రతిపక్షనేత వైఎస్ జగన్ పాదయాత్ర చేపట్టిన తరువాత ప్రజల్లో ఆ పార్టీ పట్ల ఎటువంటి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయనే అంశాన్నీ పరిశీలిస్తున్నట్లు సమాచారం. కాపు రిజర్వేషన్ల అంశం అసెంబ్లీలో ప్రవేశపెట్టి మమ అనిపించిన విషయంపైన ప్రజల్లో ప్రభుత్వంపై కొంత వ్యతిరేకత వచ్చే అవకాశాలున్నాయా అనే అంశాలను సర్వేలో పొందుపరిచినట్లు తెలిసింది. త్వరలో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వడం ద్వారా నిరుద్యోగుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగకుండా నివారించే అవకాశాలపై యువత అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని సర్వే నిర్వాహకులకు మౌఖిక ఆదేశాలిచ్చినట్లు సమాచారం. సర్వేలో ప్రభుత్వ బలాలు, బలహీనతలు, కాపు కార్పొరేషన్, బ్రాహ్మణ కార్పొరేషన్‌ల వల్ల ఆయా వర్గాలు సంతృప్తిగా ఉన్నారా? లేక అసంతృప్తిగా ఉన్నారా? ఆయా వర్గాలకు ఈ ఏడాదిలో ఎటువంటి సంక్షేమ ఫలాలు ప్రవేశపెడితే టిడిపికి కలిసి వస్తాయనే అంశాలపై ఆయా వర్గాల అభిప్రాయాలను రహస్య వర్గాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి ప్రజాప్రతినిధుల పనితీరు పట్ల ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు, 2019 ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు గెలిచే అవకాశాలు, ఆయా నియోజకవర్గాల్లో టికెట్‌లను ఎవరికి ఇస్తే బాగుంటుదని సర్వే చేస్తున్నట్లు సమాచారం.

జన్మభూమి మా ఊరు 2018
5వ విడత, జనవరి 2-11



స్వచ్ఛాంధ్రప్రదేశ్

అద్దంలా మెరిసే అందమైన ఆంధ్రప్రదేశ్‌ని తీర్చిదిద్దుదాం.

స్వచ్ఛమైన, సురక్షితమైన, అందమైన ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి మన ముఖ్యమంత్రి గారి నాయకత్వంలో చేపట్టిన కార్యక్రమాలు:

- 2018, మార్చి 31 నాటికి 100% ఓడిఎఫ్ రాష్ట్రంగా అవతరించాలనే లక్ష్యం, ఇప్పటికే ఈ దిశగా 80% సంపూర్ణం.
- అక్టోబర్ 2, 2016 తేదిన, 110 పట్టణ స్థానిక కేంద్రాలు బహిరంగ మల విసర్జన రహిత పట్టణాలుగా గుర్తించబడ్డాయి.
- విశాఖపట్టణం, తిరుపతి, విజయవాడ నగరాలు దేశంలోని మొదటి 20 పరిశుభ్రమైన నగరాల్లో చోటు సంపాదించుకున్నాయి.

స్వచ్ఛతే సేవ!
జై జన్మభూమి జై ఆంధ్రప్రదేశ్!

సంపాదకీయం

'మహా' దారుణం

దళితులను లక్ష్యంగా చేసుకుని మహారాష్ట్రలో జరుగుతున్న దాడులు సంఘ్ పరివార్ శక్తుల బరి తెగింపునకు నిదర్శనం. కొరెగావ్ గ్రామంలో ప్రారంభమైన ఈ దాడులు కొన్ని గంటల్లోనే రాష్ట్రమంతా వ్యాపించాయి. ఒక వ్యూహం ప్రకారం హిందూత్వ శక్తులు చెలరేగిపోయిన తీరు దిగ్భ్రాంతి కలిగిస్తోంది. బస్సుల్లో, ట్రాముల్లో ప్రయాణం చేస్తున్న దళితులను గుర్తించి ఎక్కడికక్కడ వారిపై భౌతిక దాడులకు తెగబడ్డారు. ప్రయాణాలను మధ్యలోనే రద్దు చేసుకుని తెలిసిన వారి ఇళ్లలో దళితులు రక్షణ పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే సంఘ్ పరివార్ ఎంత పకడ్బందీగా దాడులకు వ్యూహ రచన చేసిందో అర్థం చేసుకోవచ్చు. ఇంత పెద్ద ఎత్తున హింస చెలరేగుతున్నా మహారాష్ట్ర సర్కారుకు చీమ కుట్టినట్టు కూడా లేకపోవడం విచారకరం. కొరెగావ్‌లో దళిత యువకుని దారుణ హత్య అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా దళితులు, వామపక్ష శక్తులు, ఇతర అభ్యుదయ వాదులు సంఘటితం కావడం ప్రారంభమైన తరువాతే ఫడ్నవీస్ నేతృత్వంలోని మహారాష్ట్ర బిజెపి ప్రభుత్వం మేల్కొంది. న్యాయ విచారణకు ఆదేశించి చేతులు దులుపుకొంది. అంతకు ముందు ఈ వరుస సంఘటనలకు కుల ఘర్షణల ముద్ర వేసే ప్రయత్నం కూడా జరిగింది. అయితే దాడులకు సంబంధించి హిందూత్వ శక్తులతో అత్యంత సన్నిహిత సంబంధాలున్న ఇద్దరిపై పూణె పోలీసులు కేసు నమోదు చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన కుట్ర బట్టబయలైంది.

వాస్తవానికి కొరెగావ్ కేంద్రంగా ఘర్షణలు రెచ్చ గొట్టడానికి కొంతకాలం నుండే సంఘ్ పరివార్ శక్తులు ప్రయత్నాలు ప్రారంభించాయి. 200 సంవత్సరాల క్రితం ఇక్కడి పాలకుడైన పేష్వా దళితులను బానిసల కన్నా హీనంగా చూసేవాడు. వారిపై అత్యంత కఠినమైన ఆంక్షలు అమలు చేశాడు. ఈ పెత్తందారీ దురహంకార పోకడలు ఎప్పుడు అంతమై పోతాయా అని వారు ఎదురు చూసేవారు. అదే సమయంలో ఈస్ట్ ఇండియా కంపెనీ పేష్వాపై యుద్ధానికి దిగడంతో, కంపెనీ సైన్యంతో కలిసి దళితులు ఆ యుద్ధంలో పాల్గొన్నారు. పేష్వాపై నిర్ణయాత్మక విజయాన్ని సాధించారు. పెత్తందారులపై సాధించిన చిరస్మరణీయ విజయానికి గుర్తుగా కొరెగావ్‌లో స్తూపం కూడా నిర్మించుకున్నారు. 1927 జనవరి ఒకటిన డాక్టర్ బాబా సాహెచ్ అంబేద్కర్ ఈ గ్రామాన్ని సందర్శించి, నాటి పోరాటంలో మృతి చెందిన దళితులకు నివాళులర్పించారు. ఆ తరువాత దళితుల ఆత్మగౌరవ పోరాటానికి కోరెగావ్ ఒక చిహ్నంగా మారింది. ప్రతి ఏడాది జనవరి ఒకటిన స్థానిక దళితులు కొరెగావ్‌కు రావడం, పోరాట స్ఫూర్తిని పొందడమన్నది ఒక సంప్రదాయంగా మారింది. 2018 జనవరి ఒకటికి ఈ చారిత్రాత్మక విజయానికి 200 ఏళ్లు నిండుతుండటంతో ఆ కార్యక్రమాన్ని భారీగా నిర్వహించాలని దళిత సంఘాలు నిర్ణయించాయి. ఈ నిర్ణయం వెలువడిన వెంటనే హిందూత్వ శక్తుల బెదిరింపులూ ప్రారంభమైనాయి. కార్యక్రమానికి హాజరయ్యే వారిని దేశద్రోహులని నిందించాయి. ఈస్ట్ ఇండియా కంపెనీ విజయాన్ని ఎలా ఉత్సవం జరుపుకొంటారని ప్రశ్నించాయి. కార్యక్రమానికి అనుమతి ఇవ్వద్దని ప్రభుత్వాన్ని కోరాయి. తీవ్రమైన సంఘటనలు జరుగుతాయని హెచ్చరించాయి. అయితే ఈ బెదిరింపులను దళితులు, అభ్యుదయ వాదులు ఖాతరు చేయలేదు. భారీ సంఖ్యలో జనవరి ఒకటిన కొరెగావ్‌కు తరలి వచ్చారు. దళితుల్లో వచ్చిన ఈ కదలిక సంఘ్ పరివార్ శక్తులకు కంటగింపుగా మారింది. హింసాత్మక చర్యలకు దిగింది.

ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ శక్తులు చేసిన ఈ దుర్మార్గం పట్ల మహారాష్ట్ర ప్రజానీకం స్పందించిన తీరు అపూర్వం. దాడుల విషయం తెలిసిన వెంటనే దాదాపు రాష్ట్రమంతా స్వచ్ఛందంగా నిరసన పాటించారు. దళిత సంఘాలు బుధవారం ఇచ్చిన బంద్ పిలుపునకు వామపక్షాలు మద్దతు ప్రకటించాయి. సాధారణ ప్రజలు నిరసనల్లో పాల్గొన్నారు. ముంబయి మహా నగరం దాదాపుగా స్తంభించింది. ఇంత భారీ స్థాయిలో బంద్ విజయవంతం కావడానికి కొరెగావ్ సంఘటన తక్షణ కారణంగా కనిపిస్తున్నప్పటికీ, స్థానిక బిజెపి ప్రభుత్వం కొన్ని సంవత్సరాలుగా అనుసరిస్తున్న విధానాలు కూడా కారణమే! నయా పేష్వా ప్రభుత్వంగా దళిత సంఘాలు ఫడ్నవీస్ పాలనను అభివర్ణిస్తున్నాయంటే అక్కడి ప్రభుత్వం ఏ పోకడలు పోతోందో అర్థం చేసుకోవచ్చు. తాజా పరిణామాలతోనైనా కాషాయ పరివారంలో మార్పు రావాలి. లేని పక్షంలో ఎక్కడైతే ప్రజలు ఆదరించి పట్టం కట్టారో, అక్కడే గోరీ కట్టడం కూడా ఖాయం!

ఇదీ విషయం



మున్నేట్ర కళగం కాస్త
కకావికలం కానున్నది...
తమిళ తంబీ రాకతో
యువత ఊగుతున్నది!

వెండి తెరల జిలుగులతో
దక్షిణాది మెరుస్తోంది...
మెరుపో...అరుపో అది
త్వరలోనే తెలుస్తుంది!

- కొల్లూరు వెంకట్

అంతర్జాతీయం

ఆర్థిక ఇబ్బందుల నడుమ రష్యా ఎన్నికలు



ఎం కోటేశ్వరరావు



పుతిన్



గ్రడినిన్



జిరినోవస్కీ



యెవలిన్‌స్కీ



సోబ్‌చెక్

అంతర్జాతీయంగా రష్యా తన పట్టునిలుపుకొనే క్రమంలో అమెరికాను వ్యతిరేకిస్తున్నప్పటికీ దాని ఆర్థిక పరిస్థితి అంత సజావుగా లేదు. ఇతర ధనిక దేశాల మాదిరే ఆర్థిక సంక్షోభ ప్రభావం తీవ్రంగా పడింది. గత కొంత కాలంగా దాని అభివృద్ధి రేటు గిడసబారింది.ఈ పూర్వ రంగంలో జరుగుతున్న ఎన్నికలను ఆర్థిక స్థితి పెద్దగా ప్రభావితం చేయబోదని, పుతిన్ విజయం సాధిస్తారని మీడియా పండితులు చెబుతున్నారు. ఆర్థిక పరిస్థితి ఇలాగే కొనసాగితే రష్యన్ సమాజంలో ఎలాంటి అసంతృప్తి తలెత్తుతుందనేది ఇప్పుడే జోస్యం చెప్పలేం.

మార్చి 18న జరిగే రష్యా ఏడవ అధ్యక్ష ఎన్నికల నామినేషన్ల కార్యక్రమం మొదలైంది. నామినేషన్లు దాఖలు చేసిన స్వతంత్ర అభ్యర్థులు తమ అర్హతా పత్రాలను ఈనెల ఏడు, పార్టీల అభ్యర్థులు పన్నెండవ తేదీలోగా సమర్పించాలి. ఎన్నికల ప్రచారం అధికారికంగా డిసెంబరు 18న ప్రారంభమైంది. అప్పటి నుంచి 25 రోజులలోగా అంటే జనవరి పదహారవ తేదీ లోపు తాము ఫలానా వారిని అభ్యర్థులుగా నియమించినట్లు పార్టీలు సమావేశాలలో అధికారికంగా చేసిన తీర్మానాలను ఎన్నికల కమిషన్‌కు అందచేయాలి. అధ్యక్ష పదవికి ఎన్నికవ్వాలంటే యాభై శాతం పైగా ఓట్లు తెచ్చుకోవాలి. ఎవరికీ ఆ మేరకు రానట్లయితే మూడు వారాల్లోపు మొదటి రెండు స్థానాలలో వున్న అభ్యర్థుల మధ్య తుది పోటీ నిర్వహించాలి.

అధ్యక్ష పదవి కోసం మరోసారి పోటీ పడుతున్న వ్లదిమిర్ పుతిన్, కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా 'లెనిన్ వ్యవసాయ కంపెనీ' పారిశ్రామికవేత్త పావెల్ గ్రడినిన్, ఇతర పార్టీల తరఫున వ్లదిమిర్ జిరినోవస్కీ, గ్రిగొరీ యెవలిన్‌స్కీ, సెనియా సోబ్‌చెక్ తదితరులు వున్నారు. రష్యా నిబంధనల ప్రకారం పార్టీల అభ్యర్థులుగా పార్టీ సభ్యులు కాని వారిని కూడా నియమించ వచ్చు. దానికి అనుగుణంగానే కమ్యూనిస్టు పార్టీ తొలిసారిగా పార్టీ సభ్యుడు కాని వ్యక్తిని పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేసింది. ప్రస్తుతం రష్యాలో నమోదైన పార్టీలు 69. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలంటే మూడు లక్షల సంతకాలను సేకరించాలి. అయితే ఏ ఒక్క రాష్ట్రంలోనూ అవి ఏడున్నర వేలకు మించకూడదు. అంటే దేశమంతటా పలుకుబడి కలిగిన వారే పోటీకి అర్హులు. పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం లేని పార్టీల అభ్యర్థులు లక్ష సంతకాలను సమీకరించాలి. ఏ రాష్ట్రంలోనూ అవి రెండున్నర వేలకు మించకూడదు. ఒక ఓటరు ఒక అభ్యర్థికి మాత్రమే మద్దతుగా సంతకం చేయాలి. ఫిబ్రవరి మొదటి వారంలో నామినేషన్ల పరిశీలన, ఖరారు చేస్తారు.

పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షంగా వున్న కమ్యూనిస్టు పార్టీ తొలిసారిగా పార్టీ సభ్యుడు కాని వ్యక్తిని అధ్యక్ష పదవికి అభ్యర్థిగా నిర్ణయించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరచింది. డిసెంబరు 23న కమ్యూనిస్టు పార్టీ వార్షిక ప్లీనరీ సమావేశంలో పావెల్ గ్రడినిన్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. పార్టీ అధినేత జుగనోవ్ అభ్యర్థి గురించి మాట్లాడుతూ 'ఆయనొక శక్తివంతుడు, అనుభవశాలి. సోషలిస్టు పద్ధతులలో తన సంస్థను నిర్మించారు.... ఆయనకు వుత్పత్తి ఎలా చేయాలో మాత్రమే కాదు గౌరవ ప్రదమైన వేతనాలు, పెన్షన్లు ఎలా ఇవ్వాలో కూడా తెలుసు. గరిష్ట వేతనాలు, సిబ్బంది సంరక్షణ చూశారు. వుచిత గృహ వసతి, విద్య, వైద్యం కల్పించారు. సోవియట్ కాలం నాటి కార్మిక నిబంధనలన్నీ పాటించారు. పార్టీ మొత్తంగా ఆయన విజయానికి పని చేయాలి. మన అభ్యర్థి ఒక మంచి, విలువైన వ్యక్తి అని మనం రుజువు చేయాలి, ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా ఆయన విజయానికి కృషి చేయాలి'.

యాభైఏడు సంవత్సరాల గ్రడినిన్ మెకానికల్ ఇంజనీరు, మాస్కో సమీపంలోని ఒక వ్యవసాయ క్షేత్రంలో 1990 దశకం నుంచి పని చేస్తున్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించగానే రష్యన్ మీడియా ఆసక్తితో పాటు దాడులు కూడా ప్రారంభించింది. కమ్యూనిస్టు పార్టీ తన పలుకుబడిని పెంచుకొనేందుకు పార్టీ సభ్యుడు కాని వ్యక్తిని పోటీకి నిలిపినట్లు అనేక మంది వ్యాఖ్యానించారు. జుగనోవ్ ఇతర కమ్యూనిస్టు పార్టీ నేతలతో కలసి వేసిన నామినేషన్ కార్యక్రమానికి పెద్ద ప్రచారం కల్పించారు.

ఎన్నికల ప్రచారం లాంఛనంగా ప్రారంభమైనప్పటికీ ఇంకా వూపందుకోలేదు. పోలింగ్‌కు సరిగ్గా నెల రోజుల ముందు మీడియాలో అభ్యర్థుల ప్రచారం ప్రారంభం అవుతుంది. గతంలో జరిగిన ఎన్నికలపై అనేక విమర్శలు వచ్చాయి. ఈసారి ఎలా జరుగుతాయో వూహించటం కష్టం కాదు. 2016 అమెరికా ఎన్నికలలో రష్యా జోక్యం చేసుకుందన్న తీవ్ర విమర్శలు, ఆరోపణల నేపథ్యంలో ఈసారి దానికి పోటీగా అమెరికా జోక్యం చేసుకుంటుందా అన్నది ప్రశ్న. ప్రస్తుతం వెల్లడవుతున్న అభిప్రాయాల ప్రకారం పుతిన్ తిరిగి విజయం సాధించటం ఖాయం అనే వాతావరణం వుంది. డోనాల్డ్ ట్రంప్‌కు అనుకూలంగా రష్యన్లు జోక్యం చేసుకున్నారనే విమర్శల నేపథ్యంలో ఇపుడు రష్యా ఎన్నికలలో జోక్యం అనే వార్తలు వస్తున్నాయి. అవినీతి కేసులలో శిక్ష పడిన అలెక్సీ నవాల్నే పోటీకి అనర్హుడని ప్రకటించటంతో రష్యన్ ఎన్నికలను బహిష్కరించాలని అతడు పిలుపునిచ్చాడు. తను రంగంలో వుంటే పుతిన్ అవకాశాలు దెబ్బతింటాయనే కారణంతోనే తనను తప్పించారని చేసిన ఆరోపణను అమెరికన్ మీడియా ప్రముఖంగా ప్రస్తావించింది. ఆ చర్య తమ అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవటమే అని పుతిన్ ప్రభుత్వ ప్రతినిధి ఖండించారు. నిజానికి పుతిన్ అధికార రాజకీయాలలో తల పండిన వ్యక్తి. తన ఎన్నికకు మార్గం సుగమం చేసుకొనేందుకు గత ఏడాది కాలంగా అనేక చర్యలు తీసుకున్నాడు. తనకు వ్యతిరేకంగా పనిచేస్తారనే అనుమానం వున్న గవర్నర్లను తొలగించటం, బదిలీ చేయటం వంటి వాటిని కొద్ది నెలల ముందుగానే పూర్తి చేశాడు. విదేశాలలో సొమ్ము దాచుకున్నవారిపై కఠిన చర్యలంటూ ఆర్భాటం చేసినప్పటికీ ఎన్నికల నేపథ్యంలో వారికి అనుకూలమైన చర్యలు తీసుకున్నాడు. ఆర్థికశాఖ నిషేధ జాబితాలో వున్న దేశాలలో తప్ప ఇతర దేశాలలో దాచుకున్న సొమ్మును రష్యా తీసుకురానవసరం లేదని, పన్నులు చెల్లించక్కరలేదని లెక్కలు ప్రకటిస్తే చాలనే వెసులుబాటు కల్పించాడు. నిధుల వివరాలు వెల్లడించిన వారి మీద ఒకటి రెండు శాతం పన్ను విధించి క్షమించి వదలి వేయాలనే ఆలోచన వున్నట్లు వార్తలు రాయించారు. జనవరి ఒకటి నూతన సంవత్సరాది సందర్భంగా చిన్న సంస్థలకు వెసులుబాటు కల్పిస్తూ పుతిన్ పలు చర్యలు ప్రకటించారు. ఇవన్నీ ఎన్నికల అక్రమాలు తప్ప మరొకటి కాదు.

అంతర్జాతీయంగా రష్యా తన పట్టు నిలుపుకొనే క్రమంలో అమెరికాను వ్యతిరేకిస్తున్నప్పటికీ దాని ఆర్థిక పరిస్థితి అంత సజావుగా లేదు. ఇతర ధనిక దేశాల మాదిరే ఆర్థిక సంక్షోభ ప్రభావం తీవ్రంగా పడింది. గత కొంత కాలంగా దాని అభివృద్ధి రేటు గిడసబారింది. గతేడాది అభివృద్ధి రేటు 1.8-2.2 శాతం మధ్య వుండవచ్చని డిసెంబరు మధ్యలో రష్యన్ సెంట్రల్ బ్యాంకు ప్రకటించింది. దాని అంచనా ప్రకారం 2018లో 1.5-2 శాతం మధ్య వుంటుందని పేర్కొంది. రానున్న పది సంవత్సరాలలో రష్యా ఆర్థిక పరిస్థితి నిరాశాజనకమే అని బ్లూమ్‌బెర్గ్ విశ్లేషించింది. 2021 నాటికి చమురు పీపా ధర 20 డాలర్లకు పడిపోతుందని, రష్యన్ ప్రభుత్వం బడ్జెట్ సమస్యలతో పాటు కార్మికుల సమ్మెలతో తలెత్తే పరిస్థితిని ఎదుర్కోవాల్సి వుంటుందని పేర్కొంది. 2024 నాటికి చమురు ధర పది డాలర్లకు పడిపోతుందని, 2028 నాటికి రాజకీయ రంగం నుంచి పుతిన్ కనుమరుగవుతారని జోస్యం చెప్పింది.

ఈ పూర్వ రంగంలో జరుగుతున్న ఎన్నికలను ఆర్థిక స్థితి పెద్దగా ప్రభావితం చేయబోదని, పుతిన్ విజయం సాధిస్తారని మీడియా పండితులు చెబుతున్నారు. ఆర్థిక పరిస్థితి ఇలాగే కొనసాగితే రష్యన్ సమాజంలో ఎలాంటి అసంతృప్తి తలెత్తుతుందనేది ఇప్పుడే జోస్యం చెప్పలేం. అయితే 'సోషలిజాన్ని పోగొట్టుకున్న పాతికేళ్ల తరువాత సాధించిందేంటి?' అని నెమరువేసుకుంటున్నవారి సంఖ్య పెరుగుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. బోల్షివిక్ విప్లవం జరిగి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 58 శాతం మంది సోవియట్‌ను కోల్పోయినందుకు విచారం వెలిబుచ్చుతున్నట్లు ఒక సర్వే వెల్లడించింది. గతం మాదిరే చరిత్ర పునరావృతం కాదుగాని ముందుకే పోతుంది, అది పురోగమనం వైపే అన్నది చరిత్ర చెప్పిన సత్యం.

సందర్భం

అంధుల వెలుగురేఖ



నేడు ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం

సృష్టిలో నిక్షిప్తమైన రహస్యాలను ఛేదించాలన్నా, ఆ అంశాలకు అక్షర రూపం ఇవ్వాలన్నా దృష్టి ముఖ్యం. మరి కళ్లు లేని వారి పరిస్థితి ఏంటి? భాషకు అందని భావం ద్వారా మాత్రమే వారు అందాలను ఆస్వాదిస్తారు. వారంతా కళ్లు లేవని నిరాశా నిస్పృహలతో కుంగిపోకుండా... వారి జీవితాలకు దిక్సూచిలా, మహోన్నత గురువులా లూయి బ్రెయిలీ పేరు నిలిచిపోతుంది.

లూయి ఫ్రెంచ్ విద్యావేత్త, బ్రెయిలీ లిపి సృష్టికర్త. ఈయన 1809 జనవరి 4న పారిస్‌లోని 'క్రూవే' గ్రామంలో జన్మించాడు. తన 4వ ఏట అనుకోకుండా జరిగిన ఒక ప్రమాదంలో రెండు కళ్లు కోల్పోయాడు. విద్యార్థి దశలో విద్యాభ్యాసం కోసం పారిస్‌లోని ఒక అంధుల పాఠశాలకు వెళ్లాడు. 1784లో ప్రారంభమైన ఈ పాఠశాలలో స్పెయిన్ దేశానికి చెందిన ఫ్రాన్సిస్కో లూకాస్ కనుగొన్న ఉబ్బెత్తు అక్షరాల ద్వారా అంధులకు చదువు చెప్పేవారు. ఈ పాఠశాలలో చేరిన లూయి తక్కువ కాలంలోనే లైన్ టైప్ పద్ధతిలో బోధించే విద్యలో విశేష ప్రతిభ చూపాడు. అంతేకాదు, విద్యాభ్యాసం చేసిన ఆ పాఠశాలలోనే తన 17 వ ఏటనే ప్రొఫెసర్‌గా నియమితులయ్యాడు.

సాధారణ విద్యార్థులు చదువుకునే పుస్తకాల ద్వారా అంధులు విద్యాభ్యాసం చేయలేరు. వారికి కేవలం స్పర్శ ద్వారా చదువుకునే అవకాశమే వుంది. అందుకే ఆ స్పర్శ ద్వారా చదువుకునేందుకు కొత్త లిపిని కనుగొనడానికి రకరకాల ప్రయోగాలు జరిగాయి. ఈ కృషిలో అంధులే ఉండటం ఆసక్తికర అంశం.

అంతవరకు వున్న పుస్తకాలను అర్థం చేసుకోవడానికి అంధ విద్యార్థులు వారి స్పర్శ జ్ఞానాన్ని ఎక్కువ స్థాయిలో వినియోగించేవారు. ఇందులో చాలా లోపాలున్నాయని భావించిన లూయిలో వీరి కోసం సులువైన మార్గం కనుగొనాలన్న సంకల్పం బలంగా నాటుకుంది. 16వ శతాబ్దంలో... పాదరస్ అంధ సంగీత విద్వాంసుడు, అతని స్నేహితుడైన హెయిలీ కలసి పేపరు మీద అక్షరాలను ఉబ్బెత్తుగా ప్రింటు చేశారు. ఇదే సమయంలో స్పెయిన్‌కు చెందిన ఫ్రాన్సిస్కో లూకాస్ ఉబ్బెత్తు అక్షరాలను కాగితం మీద కాక చెక్కపై ముద్రించాడు. ఈ రెండు అంశాలపై విశేష పరిశోధనలు చేసిన లూయి ఇరవై ఏళ్లకే 'ఆరు చుక్కల' సంపూర్ణ నవీన ఆవిష్కరణనూ.. నూతన సిద్ధాంతాన్ని అంధులకు అందించాడు. అటు కాగితంగా, ఇటు చెక్కలపై రూపొందించబడిన అక్షరాలు, వరుసలుగా కాకుండా చుక్కల రూపంలో గనుక అందుబాటులో ఉంటే ఆ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, చాలా తేలికగా అర్థం చేసుకుంటారని భావించాడు. ఈ చుక్కల లిపి ఆవిర్భావానికి సైన్యాధ్యక్షుడు చార్లెస్ బార్బియర్ లూయిస్‌కు ప్రేరణ ఇచ్చాడు. ఈయన 1821లో అవలంబించిన విధానం లూయిని ఎంతో ఆకర్షించింది. తను పంపే సమాచారం చీకట్లో వున్న తన సైనికులకు అందేలా ఆ సైనికాధికారి 12 చుక్కలతో సంకేతాలు కనిపెట్టి, చిహ్నాలతో లిపిని కనుగొన్నాడు. దీంతో ప్రేరణ పొందిన లూయి ఆ 12 చుక్కలను 6 చుక్కలకు కుదించి అక్షరాలను, పదాలను, అంకెలను రూపొందించాడు. ఈ నిర్విరామ కృషిలో తీరిక లేకుండా పనిచేయడం వల్ల క్షయవ్యాధికి గురై తన 43వ ఏట 1852లో మరణించాడు. ఆయన కృషికి చిహ్నంగా ఫ్రాన్స్ ప్రభుత్వం నూతన లిపికి బ్రెయిలీ లిపి అని పేరు పెట్టింది. అంతేకాక ప్రతి ఏడాది జనవరి 4న 'ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం'గా జరపాలని నిర్ణయించింది. ఒక్క ఫ్రాన్సే కాదు, ప్రపంచ దేశాలన్నీ ఆయన కృషిని కొనియాడాయి. బెల్జియం, ఇటలీలు బ్రెయిలీ బొమ్మతో రెండు యూరోల నాణాన్ని ముద్రించాయి. మన ప్రభుత్వం కూడా బ్రెయిలీ బొమ్మతో 2 రూపాయల నాణాన్ని ముద్రించింది. 2009లో బ్రెయిలీ 200 జన్మదినోత్సవం సందర్భంగా యావత్ ప్రపంచం ఆయనను స్మరించుకుంది. ఈ లిపితో అంధ విద్యార్థులు, హృదయంతో... వారి స్పర్శతో.. ఈ ప్రపంచాన్ని చూడగలుగుతున్నారు. రోజువారీ దినపత్రికలు కొన్ని బ్రెయిలీ లిపిలో ప్రచురిస్తున్నాయి. అందుకే లూయి అంధుల మనస్సులలో... వారి చేతి వేళ్ల కొనలలో.. వారి స్పర్శయై.. చిరకాలం వర్ధిల్లుతూనే వుంటాడు.

సూరం అనిల్,
సెల్ : 9059457045

జన వాక్యం

'జీవించే హక్కు' ఏది?



రాష్ట్రంలో ప్రభుత్వాలు, విద్యాలయాలు, సంస్థలు అనుసరిస్తున్న విధానాల వల్ల... చిన్నారుల ప్రాథమిక హక్కుగా ఐక్యరాజ్యసమితి పేర్కొన్న 'జీవించే హక్కు' హరించుకుపోతోంది. విద్యాలయాల్లో జరుగుతున్న ఆత్మహత్యలు, ప్రత్యేక తరగతుల పేరిట వేధింపులు, పరీక్షల పేరుతో ప్రయోగాలే ఇందుకు నిదర్శనం. ఇటీవల గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం రేపూడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు విద్యార్థులు మరణించడం కేవలం రోడ్డు ప్రమాదంగానే చూడగలమా? విద్యాసంస్థల ర్యాంకుల అత్యాశ వల్ల ఉదయం ఆరున్నరకే బయలుదేరిన విద్యార్థులు ఈ దుర్ఘటనలో బలయ్యారు. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, బాలల హక్కుల కార్యకర్తలు, జిల్లా స్థాయిలో బాలల సంక్షేమ కమిటీలు సమగ్రంగా చర్చలు చేస్తూ, నిత్యం జాగరూకతతో ఉన్నప్పుడు మాత్రమే బాలల మరణాలను ఆపగలం. అందుకే విద్యావ్యాపారానికి బాలలు సమిధలు కాకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వం పైనే వుంది.

బి హరి, బాలల హక్కుల వేదిక కన్వీనర్, విశాఖ.

వ్యాసాలు, ఉత్తరాలు పంపించాల్సిన చిరునామా
editpageps@gmail.com

మహిళా రంగం

ముస్లిం మహిళల హక్కులు మరిచిన 'తలాక్' చట్టం



ఎ ఎం ఖాన్ యజ్దానీ (డానీ)



సుప్రీంకోర్టు ముస్లిం భర్తల్ని మందలించి, ముస్లిం భార్యల వివాహ హక్కుల్ని పరిరక్షించింది. కొత్త చట్టం ముస్లిం భర్తను శిక్షించి ముస్లిం భార్యను గాలికి వదిలేస్తోంది. మరో మాటలో చెప్పాలంటే ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్ బాధితలైన ముస్లిం మహిళలకు సుప్రీం కోర్టు అందించిన ఆర్థిక హామీని, వైవాహిక సౌకర్యాన్నీ కొత్త చట్టం రద్దు చేసింది.

సునీతా రెడ్డి (పేరు మార్చాం) రాయలసీమ నుండి హైదరాబాద్ వచ్చి మాదాపూర్ ఇమేజ్ హాస్పిటల్ రోడ్డులో స్థిరపడిన ధనిక కుటుంబం. విదేశీ సంబంధం అని భారీ కట్నం ఇచ్చి పెళ్ళి చేశారు. అక్కడ ఆర్థిక మాంద్యం రావడంతో భర్త మన దేశానికి తిరిగి వచ్చేశాడు. సునీతారెడ్డి తండ్రి భారీగా పెట్టుబడి పెట్టి, జూబ్లీ హిల్స్‌లో అల్లుడికి అత్యాధునిక జిమ్ పెట్టించాడు. ఒక రోజు హఠాత్తుగా సునీతా రెడ్డి భర్త మాయమైపోయాడు. ఆమె అత్తమామలు జిమ్‌ను స్వాధీనం చేసుకుని సునీతా రెడ్డిని బయటికి గెంటేశారు. భర్త కనిపించక పోవడం, ఆస్తి పోవడం, తనూ, పిల్లలు దిక్కులేని వాళ్ళైపోవడం ఆమెకు తీరని బాధ. తనిప్పుడు భార్యో, విడాకులు పొందిన స్త్రీయో తెలియని అయోమయం అంతకన్నా ఎక్కువ బాధకు గురిచేస్తోంది.

ఊహాంజలి (పేరు మార్చాం) మియాపూర్ అమ్మాయి. పదేళ్ల క్రితం పెళ్ళయింది. వ్యాపారంలో నష్టపోయిన భర్త స్నేహితుల దగ్గర భారీగా అప్పులు చేశాడు. డబ్బు కోసం అత్తమామల మీద ఒత్తిడి తెచ్చాడు. వాళ్ళు నిరాకరించడంతో ఇంటికి రావడం మానేశాడు. తనతో పాటు పదేళ్ల కొడుకును పోషించుకోవడానికి ఆమె స్కూల్లో టీచరుగా చేరింది. ఊహాంజలిది కూడా సునీతా రెడ్డి సమస్యే. తనిప్పుడు భార్య కాదు, విడాకులు పొందిన స్త్రీ కూడా కాదు!.

గౌసియా బేగం (పేరు మార్చలేదు) హైదరాబాద్ శివార్లలో పహాడీ షరీఫ్ ప్రాంతంలోని ఎర్రకుంట మురికివాడ నివాసి. నిరుపేద ముస్లిం కుటుంబం. ఒమన్ దేశానికి చెందిన ఓ వృద్ధునితో 2008లో పెళ్ళి చేశారు. అతనెప్పుడూ తనను ఒమన్ తీసుకుని వెళ్ళలేదు. ఏడాదికి ఒకసారి హైదరాబాద్ వచ్చి ఓ రెండు వారాలు గౌసియా బేగంతో వుండి వెళ్ళిపోయేవాడు. వచ్చినప్పుడు కొంత డబ్బు ఇచ్చేవాడు. ఈ ఏడాది అతను రాలేదు. డబ్బులూ పంపలేదు. నాలుగు నెలల క్రితం ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్ సందేశం పంపించాడు.

గౌసియా దీనగాథ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. వాళ్లంతా గౌసియా మీద సానుభూతిని చూపించడంకన్నా ముస్లిం భర్తల్ని విమర్శించడానికి ఈ అవకాశాన్ని ఎక్కువగా వాడుకుంటున్నారు. పనిలో పనిగా, ముస్లిం మహిళ (వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లు-2017ను గట్టిగా వ్యతిరేకిస్తున్న ఏఐయంఐయం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ మీద విరుచుకు పడుతున్నారు. విడాకులు పొందిన స్త్రీల మీద వారికి అంతటి సానుభూతే వుంటే దాన్ని వాళ్ళు సునీతా రెడ్డి, ఊహాంజలి వంటివారి మీద కూడా చూపించి వుండాల్సింది. నిజానికి వైవాహిక బాధిత స్త్రీలు ముస్లిం సమాజంలో కన్నా హిందూ సమాజంలోనే ఎక్కువ.

కేంద్ర ప్రభుత్వం కూడా ఇప్పుడు 'ట్విట్టర్ వీరుల' భావజాలంతో నడుస్తోంది. ముస్లిం మహిళ (వివాహ హక్కుల పరిరక్షణ) చట్టం-2017 ద్వారా అది సాధించదలిచింది ముస్లిం వైవాహిక బాధిత మహిళల్ని ఆదుకోవడం కాదు. ముస్లిం నిందిత భర్తల్ని కఠినంగా శిక్షించడం మాత్రమే. ముస్లిం నిందిత భర్తల్ని భారీ అపరాధ రుసుముతో పాటూ మూడేళ్ళ వరకు జైలు శిక్ష విధించడానికి మెజిస్ట్రేట్‌లకు ఇచ్చిన విశేష అధికారాల గురించి ఇందులో చాలా స్పష్టంగా రాశారు. కానీ, బాధిత భార్యకూ, ఆమె సంతానానికీ జీవనభృతిని భర్త ఆస్తి నుండి ఇస్తారా? భర్తకు ఆస్తి లేకుంటే ప్రభుత్వమే ఇస్తుందా? వంటి ప్రాణప్రదమైన అంశాల్ని కొత్త చట్టంలో గాలికి వదిలేశారు.

బాల్య వివాహాలను రద్దు చేయడానికి హర్యానా ప్రభుత్వం 1994లో 'అప్నీ బేటీ-అప్నా ధన్' (మన అమ్మాయి-మన సంపద) పథకాన్ని ప్రవేశ పెట్టింది. అమ్మాయి పుట్టినపుడే 'అప్నీ బేటీ-అప్నా ధన్' బాండ్‌ను తల్లిదండ్రులకు అందిస్తారు. అమ్మాయికి 18 ఏళ్ళు దాటాక, అప్పటి వరకు ఆమెకు పెళ్ళి జరపలేదని నిరూపించి, ఆ బాండ్‌ను తల్లిదండ్రులు బ్యాంకులో నగదుగా మార్చుకోవచ్చు. ముస్లిం వివాహ బాధిత మహిళల మీద తమకెంతో సానుభూతి వుందని చెప్పుకుంటున్న ప్రభుత్వం 'అప్నీ బేటీ-అప్నా ధన్' పథకం వంటిది ఒకదాన్ని ప్రకటించి వుండాల్సింది. విడాకుల బాధిత ముస్లిం స్త్రీలకు ఇప్పటి ధరల ప్రకారం లక్ష రూపాయల బాండ్‌ను పెళ్ళి సమయంలోనే అందించే పథకాన్ని రూపొందించాల్సింది. ప్రభుత్వానికి అంతటి నిజాయితీ లేదు. ముస్లింల పడగ్గదుల్లోనికి ప్రవేశించడమే రాజ్యం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

'ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్ చెల్లదు, చట్ట విరుద్ధం' అని సుప్రీం కోర్టు ఆగస్టు 22 నాటి తీర్పులో తేల్చి చెప్పింది. దాని అర్థం ఏమంటే, ఒకవేళ భర్త ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్ చెప్పినా అది చెల్లదు. భార్య గతంలో మాదిరిగా అతనికి భార్యగానే కొనసాగుతుంది. భర్త సంపద, సంపాదనలపై ఆమెకూ, ఆమె సంతానానికీ సర్వహక్కులు యథాతథంగా వుంటాయి.

ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టం ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్‌ను శిక్షార్హమైన నేరంగా పరిగణిస్తుంది. ఒక సామాజిక చర్యను చెల్లదని చెప్పడానికీ, శిక్షార్హమైన నేరం అని చెప్పడానికీ నేరస్మృతిలో చాలా తేడా వుంది. సుప్రీంకోర్టు ముస్లిం భర్తల్ని మందలించి, ముస్లిం భార్యల వివాహ హక్కుల్ని పరిరక్షించింది. కొత్త చట్టం ముస్లిం భర్తను శిక్షించి ముస్లిం భార్యను గాలికి వదిలేస్తోంది. మరో మాటలో చెప్పాలంటే ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్ బాధితలైన ముస్లిం మహిళలకు సుప్రీం కోర్టు అందించిన ఆర్థిక హామీని, వైవాహిక సౌకర్యాన్నీ కొత్త చట్టం రద్దు చేసింది. ఇది కేంద్ర ప్రభుత్వం ముస్లిం మహిళలకు చేసిన ద్రోహం. ఈ చట్టంలో ఇంతకన్నా తీవ్రమైన విషయం మరొకటుంది. భర్తతో విభేదాలు వచ్చినప్పుడు భార్యలు సాధారణంగా సర్దుబాటును, దిద్దుబాటును కోరుకుంటారు. సంసారాన్ని ఏదో ఒక విధంగా గాడిలో పెట్టుకోవాలనుకుంటారు. భర్తను ఏకంగా జైలుకు పంపించేస్తారని తెలిస్తే ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్ బాధిత ముస్లిం మహిళలు ఇక ముందు కేసు పెట్టడానికి కూడా సాహసించక పోవచ్చు.

రాజ్యం ఒకేసారి రెండు తప్పులు చేస్తోంది. దేశ ప్రజలందరికీ చెందిన సహజ వనరుల్ని కొన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోంది. విడాకుల విషయంలో అన్ని సమాజాల్లోనూ జరుగుతున్న తప్పును పట్టుకుని ఒక సమూహం మీదకు నెట్టేస్తోంది. మొదటి తప్పులో లబ్ధిదారులు హిందూ సామాజిక వర్గానికి చెందిన వాళ్ళు. రెండో తప్పులో నిందితులు ముస్లిం సామాజిక వర్గానికి చెందినవారు. మొదటి తప్పులో వాటా కోరకుండా చేయడానికే రెండో తప్పులో వాళ్ళను బోను ఎక్కిస్తున్నారని భావించవచ్చు. చాలా మంది తలాక్ వివాదాన్ని సాంస్కృతిక వ్యవహారం అనుకుంటున్నారు గానీ ఇది పచ్చి ఆర్థిక వ్యవహారం.

(రచయిత ముస్లిం ఆలోచనాపరుల వేదిక జాతీయ అధ్యక్షుడు,
సెల్ : 9010757776)



15 చుక్కలు
1 వచ్చేవరకు

బహుమతి పొందిన ముగ్గు




ఆర్. శిల్పానాయుడు
చోడవరం గ్రామం
విశాఖపట్నం

రమణుల రంగవల్లి



మా చిరునామా:
జీవన,'రమణుల రంగవల్లి', జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇమెయిల్: jeevanapageps@ gmail.com
ఫోన్ నెం. 9490099006





ఎమ్.శ్రీధాత్రి
పుంగనూరు
చిత్తూరుజిల్లా

22 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు





కె.వి.యస్.తేజశ్రీ
చైతన్యపురి
గుంటూరు





13 మధ్యచుక్క
7 వచ్చేవరకు

యం.వి.శీలమ్మ
కర్నూలు





సంచిపీలికలే జీవనోపాధి

సాధారణంగా పొలాల్లో వరికోతల తర్వాత వాటిని నాలుగు రోజులు ఆరనిచ్చి, ఓదెలు తిప్పుతారు. వారం తర్వాత కట్టలుగా కడతారు. ఆ కట్టలను కుప్పలుగా వేస్తారు. అలా కట్టలు కట్టేందుకు వరిగడ్డినే ఉపయోగిస్తారు. అంటే, కోతల అనంతరం పైరులో కొంతభాగం గింజలు రాల్చి, ఆ గడ్డినే కట్టలు కట్టేందుకు ఉపయోగిస్తారు. అయితే, అది గతం. ప్రస్తుతం సాగుచేస్తున్న వరి వంగడాలు పొట్టిరకాలు కావడంతో పనలు కట్టలు కట్టేందుకు ఆ గడ్డి పనికిరావడం లేదు. దాంతో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించారు అక్కడి రైతులు. దాని ఫలితంగానే బాపట్లలోని వేదురుపల్లి, ఆ చుట్టుపక్కల గ్రామాల్లోని చాలామంది మహిళా కుటుంబాలకు ఉపాధి దొరుకుతోంది. అలా కొందరి ఆలోచనల్లోంచి పుట్టిన ఆ వినూత్న ప్రత్యామ్నాయ ఉపాధి ఏంటో తెలుసుకోవాలంటే గుంటూరు జిల్లా బాపట్ల వెళ్లాల్సిందే!

'గతంలో కట్టలు కట్టేందుకు వరిగడ్డి తర్వాత తాటాకులు నార, కొబ్బరితాళ్లు ఉపయోగించేవారు. అవి ఒక్కొక్కటిగా దూరమయ్యాయి. కొందరి ఆలోచనల నుంచి పుట్టుకొచ్చిన ఈ ప్రయోగం విజయవంతగా చుట్టుపక్కల ప్రాంతాలకు విస్తరించింది. పదుల సంఖ్యలో మాలాంటి కుటుంబాలకు ఆసరాగా నిలిచింది' అంటున్నారు వెదురుపల్లి మహిళలు. ఈ ఒక్క గ్రామమే కాదు కర్లపాలెం, దరివాద కొత్తపాలెం, కొత్తనందాయ పాలెం తదితర గ్రామాల్లోని మహిళలు దీనినే ఉపాధిగా ఎంచుకుని, జీవనం సాగిస్తున్నారు.

సంచుల్ని.. పీలికల్లా కత్తిరించి

రొయ్యల మేతకు వినియోగించే సంచులను కత్తిరించి, పరదాలను కుట్టడం ఈ చుట్టుపక్కల ఎన్నో ఏళ్లుగా చేస్తున్నారు. ఆ క్రమంలో మిగిలిపోయిన ముక్కలను తాళ్లుగా ముడివేసి, రైతులకు ఉచితంగానే అందించేవారు. క్రమేణా ఆ ప్లాస్టిక్ సంచి ముక్కలకు డిమాండ్ పెరుగుతూ వచ్చింది. రైతుల డిమాండ్‌కు తగ్గట్టుగా.. సంచి పీలికల తయారీనే ప్రత్యామ్నాయ ఉపాధిగా చేసుకుంటే ఎలా ఉంటుందన్న ఆలోచన కొందరికి వచ్చింది. 'ఎన్నో ఏళ్లుగా పరదాల వ్యాపారం చేస్తున్నాం. తక్కువ రేటు ఉండటంతో వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అయితే, ఈ సీజన్ వచ్చిందంటే పరదాల కంటే సంచుల పీలికలకే డిమాండ్ పెరుగుతూ వచ్చింది. అందుకే కూలీలను పెట్టి, పీలికలు కత్తిరించే పనులు చేస్తున్నాం' ఈ వ్యాపారం నిర్వహిస్తున్న మస్తాన్ బీ. వీరితోపాటు ఈ చుట్టుపక్కల చాలామంది సుదూర ప్రాంతాల నుంచి సంచులను తెప్పించి, దీనినే వ్యాపార మార్గంగా మలుచుకున్నారు. 'మాకు ఒక్కోసంచీ సైజును బట్టీ ఆరు నుంచి పది రూపాయలు పడుతుంది. వాటిని పరదాలుగానూ, పీలికలుగానూ కట్ చేయిస్తాం' అంటున్నారు వారు. నిజానికి, వరి పనలు తెచ్చి, వాటిని నూర్చి, కట్టు వేయాలంటే ఎకరానికి కూలీలతో కలిపి వెయ్యి రూపాయల వరకూ ఖర్చవుతుంది. అదే రొయ్యల సంచుల పీలికలతో కట్టేస్తే ఐదు వందలకు మించి అవ్వదు. దాంతో రైతులు వీటివైపే మొగ్గు చూపుతున్నారు. సంచులను అంగుళం వెడల్పు పీలికలుగా కత్తిరించి, రెండు పీలికలను కలిపి కడతారు. ఒక్కో కట్టు రూపాయికి విక్రయిస్తారు. సాధారణంగా ఎకరాకు 180 నుంచి 200 కట్లు అవసరం ఉంటుంది.

ఉపాధి దొరికింది!

ఇక్కడ చుట్టుపక్కల ఉండే పేటల్లో నివసించేవారంతా రోజు కూలీలుగా పనిచేసేవారే. ఉపాధి కోసం చాలామంది పురుషులు వలసలు వెళతారు. మహిళలు స్థానికంగా ఉంటూ, పిల్లలను చూసుకోవడంతోపాటు భవననిర్మాణ పనులకు వెళుతూ ఉంటారు. 'పనుల కోసం దూరప్రాంతాలకు వెళ్లాలి. ఈ సీజన్ వచ్చిందంటే కాస్త ఊరట. రెండు మూడు నెలలు సంచుల కత్తిరింపే మాకు ప్రధాన ఉపాధి మార్గం. మాకు ఒక్కో పీలికకూ పావలా వరకూ చెల్లిస్తారు. ఇంటిపట్టున ఉండి ఇలా పని చేసుకుంటే పెద్ద కష్టం అనిపించదు' అంటూ చెప్పుకొచ్చారు మన్నెం లక్ష్మి. రోజూ ఉదయం ఏడు గంటలకు మొదలుపెట్టి, సాయంత్రం వరకూ సంచులు కత్తిరిస్తారు. ఈ పనికి పెద్దగా ప్రావీణ్యం అవసరం లేదు. దాంతో మహిళలతో పాటు మిగిలిన కుటుంబసభ్యులూ పాలుపంచుకుంటూ ఉంటారు. అయితే, ఇవి ఎరువుల సంచులు కావడంవల్ల పిల్లలను వీటికి దూరంగా ఉంచుతారు. 'రోజు మొత్తంలో నాలుగు నుంచి ఐదు వేల పీలికలు కత్తిరిస్తాం. అంటే నాలుగు వందల రూపాయల వరకూ గిట్టుబాటవుతుంది. అదేపనిగా కత్తెరను ఉపయోగించడం వల్ల చేతి వేళ్లు నలిగి, పట్టు తప్పుతుంటాయి. అయినా, ఇంటిపట్టునే ఉండి పనిచేస్తున్నాం కనుక.. ఆ బాధ తెలీదు' అని చెప్పే 65 ఏళ్ల కొండమ్మ మాటల్లో.. 'ఆ వయసులోనూ సొంతంగా పనిచేసుకుని, నాలుగు డబ్బులు సంపాదించుకుంటున్నాననే తృప్తి కనపడుతుంది!' అంటున్నారు

అంత ఆర్థిక స్థోమత లేదు



ఐదేళ్లుగా ఈ పని చేస్తున్నాను. నా భర్త వలస కూలీ. ఏటా ఈ సీజన్‌లో కాస్త విశ్రాంతి దొరికినట్లు అనిపిస్తుంది. పిల్లల బాగోగులు చూసుకుంటూ ఇంటిపట్టునే ఉంటాను. రెండు నెలల తర్వాత మళ్లీ మామూలే. కూలీ పనుల కోసం బయటకు వెళ్లాలి. స్వయంగా సరుకును తెప్పించుకుని, చేసుకునేంత ఆర్థిక స్థోమత మాకు లేదు. అలా ఉంటే ఇంట్లో ఎవ్వరూ వలస పోకుండా ఉమ్మడిగానే చేసుకునే అవకాశం ఉంటుంది.

- ఎం. లక్ష్మి

దినసరి కూలీ

ఒకప్పుడు పని ఉండేదికాదు ఈ సీజన్‌లో రోజుకు వెయ్యి నుంచీ పదిహేనువందల వరకూ కట్టు అమ్ముడవుతాయి. కూలీల ఖర్చుతో కలుపుకొని, వంద కట్లకు పదిహేను రూపాయల వరకూ మిగులుతుంది. గతంలో ఈ సీజన్‌లో పని లేక ఖాళీగా ఉండేవాళ్లం. పీలికల పని మొదలుపెట్టాక బాగానే నడుస్తోంది.



మస్తాన్ బీ,
పీలికల విక్రేత

ఇది సీజన్



నా భర్త చనిపోయాడు. పిల్లలను చదివించేందుకు దూరప్రాంతాకు కూలీ పనులకోసం వెళుతుంటాను. ఈ సీజన్‌లో సంచుల పీలికలు కత్తిరించేపని బాగానే ఆదుకుంటుంది. రోజు మొత్తం చేసినా కొన్నిసార్లు పెద్దగా గిట్టుబాటు కాదు. అయినా, ఈ పనివల్ల అంతో ఇంతో కుటుంబానికి జరుగుతుంది.

- బి. పద్మ

- చందు తిలారు
ఫొటోలు : సుబానీ

కొత్త ఏడాదిలో ఏదో ఒక కొత్తదనం కావాలని కోరుకుంటారు. అందులో అందరమూ కోరుకునేది ముఖ్యంగా కొత్త క్యాలండర్ కాస్తంత కొత్తగా ఉండాలని. అయితే 21 ఫూల్స్ అందిస్తున్న ఈ సరికొత్త క్యాలెండర్‌లో కేవలం తేదీలు, ఎప్పుడెప్పుడు ఏయే కార్యక్రమాలు ఉంటాయో అనే సమాచారం కంటే మించి ఒక ప్రత్యేకత ఉంది. 'క్యారీ' పేరుతో వస్తున్న ఈ క్యాలెండర్‌ను మీరు చెత్తకుప్పలో పడేయలేరు మరి. దీన్ని దివ్యాన్షు అసోపా తయారుచేశాడు. ఒక్కో నెలా పూర్తవుతుంటే ఆ నెల తాలూకు కాగితాన్ని చించి చెత్తకుప్పలో పారేయకుండా తిరిగి దానికి జీవమిచ్చే ఆలోచన చేశాడు. అదేంటో తెలుసుకుందాం.

పూలూపూచే క్యాలెండర్





2014లో 21ఫూల్స్ అనే గ్రూపు చేతితో తయారుచేసిన బయోడిగ్రేడబుల్ కాగితాన్ని తయారుచేశారు. భారతదేశంలో మొదటి బయోడిగ్రేడబుల్ కాగితమూ ఇదే. ఈ పేపర్ తయారీలో వస్త్ర పరిశ్రమ నుంచి వచ్చిన వేస్ట్ పత్తి, వివిధ రకాల విత్తనాలు ఉపయోగించారు. ఈ ఏడాది దీన్నే క్యాలెండర్‌లా రూపొందిస్తే మరింత బాగుంటుందని అనుకున్నాడు దివ్యాన్షు. 21ఫూల్స్ అనే గ్రూప్ ద్వారా రూపొందించిన ఈ క్యాలెండర్‌ను నాటితే మంచి మొక్కలు తయారవుతాయి. చేయవలసిందల్లా ఏ నెలకానెల పూర్తయిన తర్వాత ఆ కాగితాన్ని చిన్నచిన్న ముక్కలుగా చేసి, తడిపి, మట్టిలో పూడ్చేయాలి. అప్పటి నుంచి నీరు పోస్తుంటే అది ఆరోగ్యంగా పెరిగి మొక్కగా ఎదిగి, అందమైన పూలు, కమ్మని ఫలాలను అందిస్తుంది. జయ్‌పూర్ దగ్గర్లో ఉన్న సంఘనేర్ అనే చిన్న నగరంలో తయారుచేసిన ఈ క్యాలెండర్‌లో 12 రకాల విత్తనాలు ఉంటాయి. మందారం, టమోటా, తులసి, మిర్చి, నిమ్మ గడ్డి, పెటునియా, కొరియోప్సీస్, కాస్మోస్, గులివింద, వింకా, పాన్సీ, పర్తులకా విత్తనాలుంటాయి. ఒక్కో నెలా ఒక్కో కొత్తరకం మొక్కతో ఏడాది పొడవునా ఇల్లంతా పూల వనంలా తయారవుతుంది. అయితే విత్తనాలు తాజాగా ఉండటం కోసం సంవత్సరానికి మూడు దఫాలుగా, కొత్త కొత్త విత్తనాలతో క్యాలెండర్‌ను పంపిణీ చేస్తారు. ఇప్పటికే లక్షల్లో ఈ క్యాలెండర్లు అమ్మేశారు. అంటే ఎంతమంది మొక్కల ప్రేమిలున్నారో కదా!

ఈ క్యాలెండర్‌తో పాటు దివ్యాన్షు వివిధ రకాల వస్తువుల్నీ తయారుచేస్తున్నాడు. అందులో బుక్‌మార్క్స్, కోస్టర్లు, గ్రీటింగ్, వెడ్డింగ్ కార్డులు, పేపర్ బ్యాగులు, రాఖీ, విజిటింగ్ కార్డులు వంటివి చాలానే ఉన్నాయి. ఇంతకీ అసలు ఇలాంటి కాగితాన్ని తయారుచేయాలనే ఆలోచన ఎలా వచ్చిందనే సందేహం కొందరికి కలగొచ్చు. 2012లో దివ్యాన్షు ఇంజినీరింగ్ చదువుతున్నప్పుడు మరో స్నేహితుడితో కలిసి 21 ఫూల్స్ ప్రారంభించాడు. ఆ వేదిక నుంచి మొదట ఒక పత్రికను నడిపారు. ఆ తర్వాత గ్రీటింగ్ కార్డులు తయారుచేయడం ప్రారంభించారు. అయితే అభివృద్ధి మందకొడిగా కొనసాగుతుందని తెలిసి అతని స్నేహితుడు పక్కకి తప్పుకున్నాడు. ఒంటరిగా ఉన్న దివ్యాన్షు మాత్రం వెనకడుగు వేయలేదు. మరింత కష్టపడి ఆకర్షణీయమైన ఉత్పత్తులను రూపొందించాడు. ప్రస్తుతం దేశమంతటి మీద దివ్యాన్షుకి చాలామంది టీమ్ సభ్యులు ఉండటం విశేషం. పర్యావరణాన్ని సంరక్షించడానికి మనవంతు చేస్తున్న కృషిలో చిన్నచిన్న సందర్భాలే ఎక్కువ ఫలితాలను ఇస్తుందనే ఈ ముప్పైయ్యేళ్ల యువకుడు ప్రస్తుతం చిన్న పిల్లలు ఆడుకోవడానికి ప్లాంటింగ్ కిట్లు తయారుచేసే ఆలోచనలో ఉన్నాడు.

మీ కోసం



కార్పెట్ మీద కార్న్‌ఫ్లోర్ చల్లి తర్వాత వాక్యూమ్ క్లీనర్‌తో క్లీన్ చేస్తే కొత్త వాటిలా ఉంటాయి.

జీవన సౌరభం

వెలిగే దీపమే ఇతర దీపాలను వెలిగించినట్లు. నిరంతరం నేర్చుకునేవారే ఇతరులకు జ్ఞానాన్ని పంచగలరు.

సెన్సెక్స్ ⬆ 19
33,793

నిఫ్టీ ⬇ 01
10,443

రూపాయి ⬆ 05 పై॥
అమెరికా డాలరుకు రూ.
63.53



పసిడికి రెక్కలు

గత 18 సెషన్లలో బంగారం ధర రూ.1.050 పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్‌కు డిమాండ్ తగ్గడంతో పసిడిపై పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఇదే క్రమంలో భారత్‌లోనూ పసిడి ధర ఎగిసిపడుతుంది. బుధవారం 10 గ్రాముల పసిడి ధర రూ.30,450గా పలికింది. క్రితం 18 సెషన్లలో వెండి ధర కూడా రూ.2,075 మేర పెరిగింది.

త్వరలోనే తపాల పేమెంట్ బ్యాంకులు

ఏప్రిల్‌లో 650 పోస్టు పేమెంట్ శాఖలు

మంత్రి మనోజ్ సిన్హా వెల్లడి

న్యూఢిల్లీ : వచ్చే ఏప్రిల్ నాటికి దేశంలో ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు (ఐపిపిబి) శాఖలను అందుబాటులోకి తేనున్నామని కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి మనోజ్ సిన్హా తెలిపారు. 2017 జనవరి 30న రాయిపూర్, రాంచీలో రెండు పైలెట్ శాఖలను ప్రారంభించడం జరిగిందన్నారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా ఏమీ తెరవలేదన్నారు. గతేడాది జనవరిలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఐపిపిబికి అనుమతులు ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ సేవలను దేశ వ్యాప్తంగా తపాళ శాఖల్లో అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ప్రస్తుతం దేశంలో 1.55 లక్షల పోస్టు ఆఫీసులు ఉన్నాయి. డిపాజిట్లను సమీకరించడం మినహా బ్యాంకు నిర్వర్తించే అన్ని లావాదేవీలను పేమెంట్ బ్యాంకులు అందించడానికి అనుమతులు ఉన్నాయి. కాగా ఇతర బ్యాంకులు, విత్త సంస్థలతో కలిసి ఐపిపిబి ఈ సేవలను అందించనున్నాయా అనే ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ దీనిపై ప్రాథమిక చర్చలు జరుగుతున్నాయన్నారు. కాగా ఐపిపిబి ఇప్పటికే పంజాబ్ నేషనల్ బ్యాంకు, పిఎన్‌బి మెట్‌లైఫ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలు భాగస్వామ్యం కుదుర్చుకున్నాయన్నారు. 2016 ఆగస్టు 17న ఐపిపిబి కంపెనీస్ యాక్ట్ 2013లో గుర్తింపు పొందిందన్నారు. తపాళ శాఖకు చెందిన 100 శాతం ఈక్విటీతో దీన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు.

ఎస్‌ఎంఇ ఐపిఒల దూకుడు

న్యూఢిల్లీ : చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎస్‌ఎంఇ) నిధుల సేకరణకు ఉపయోగించిన ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు విశేష స్పందన లభించింది. 2017లో 132 ఎస్‌ఎంఇలు రూ.1732 కోట్లు సమీకరించాయి. ఇంతక్రితం ఏడాదితో పోల్చితే ఇది మూడు రెట్లు ఎక్కువ. వ్యాపారాల విస్తరణ, మూలధన పెట్టుబడి, ఇతర కార్పొరేట్ అవసరాల కోసం ఆ కంపెనీలు ఐపిఒలకు వచ్చాయి. కాగా 2016లో 66 ఎస్‌ఎంఇలు రూ.540 కోట్లు సమీకరించాయి. గత ఐదు సంవత్సరాల్లో ఎస్‌ఎంఇలు ఐపిఒల ద్వారా రూ.13,150 కోట్ల నిధులు రాబట్టుకున్నాయి. కాగా గతేడాది నిధులు సమీకరించిన 132 కంపెనీల మార్కెట్ మూలధన విలువ రూ.30000 కోట్లుగా ఉంది.

బిఎస్‌ఎన్‌ఎల్ మరో అపరిమిత ఆఫర్

న్యూఢిల్లీ : ప్రయివేటు టెల్కోలకు ధీటుగా ప్రభుత్వ రంగ సంస్థ బిఎస్‌ఎన్‌ఎల్ మరో అన్‌లిమిటెడ్ ఆఫర్‌ను అందుబాటులోకి తెచ్చింది. రూ.187కే 28 రోజుల గడువుతో అపరిమిత 3జి, 4జి డేటాను అందించనుంది. రోజులో పూర్తిగా 1జిబి డేటా వినియోగించిన తర్వాత 40 కెబిపిఎస్ వేగంతో అపరిమితంగా ఉపయోగించుకునే సదుపాయాన్ని కల్పించింది. అంతేకాకుండా ఇతర నెట్‌వర్క్‌లకు అపరిమిత లోకల్, ఎస్‌టిడి కాల్స్, నేషనల్ రోమింగ్ ఉచితంగా అందిస్తున్నట్లు బిఎస్‌ఎన్‌ఎల్ తెలిపింది.

ఫ్యూచర్ గ్రూపు చేతికి స్నాప్‌డీల్ లాజిస్టిక్స్..!

న్యూఢిల్లీ : కిశోర్ బియానికి చెందిన ఫ్యూచర్ గ్రూపు ప్రముఖ ఆన్‌లైన్ పోర్టల్ స్నాప్‌డీల్ లాజిస్టక్ సంస్థ వుల్కాన్ ఎక్స్‌ప్రెస్‌ను స్వాధీనం చేసుకోనున్నట్లు సమాచారం. రూ.500 మిలియన్లు చెల్లించనుందని తెలుస్తోంది. వచ్చే కొద్ది వారాల్లోనే ఈ ఒప్పందం జరుగనుందని పేరు చెప్పుకోవడానికి ఇష్టపడని ఒక అధికారి తెలిపారు. ఈ విషయంపై స్నాప్‌డీల్, ఫ్యూచర్ గ్రూపు స్పందించలేదు.

పోస్టుపెయిడ్‌పై అనాసక్తి

- ప్రీపెయిడ్ ఆకర్షణీయం
- ముందస్తు చెల్లింపులకే ఖాతాదారులు సై..
- చౌక ఆఫర్లే కారణం
- మొబైల్ వినియోగదారుల సరళి



కోల్‌కత్తా : మొబైల్ వినియోగదారులు పోస్టుపెయిడ్ సెగ్మెంట్‌పై అనాసక్తిని వ్యక్తం చేస్తున్నారు. తర్వాత చెల్లింపుల కంటే ప్రీపెయిడ్ పైనే ఎక్కువ అసక్తి చూపుతున్నారు. టెల్కోలు పోస్టు పెయిడ్‌లో అధిక ఛార్జీలు వసూలు చేస్తుండటంతో వారు ప్రీపెయిడ్‌కు మారుతున్నారు. గత సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో పోస్టు పెయిడ్ ఖాతాదారులు మరో 2 శాతం తగ్గారని అంచనా. దీంతో కంపెనీల ఆదాయంలోనూ 10 శాతం తగ్గుదల చోటు చేసుకుందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో టెలికం రంగంలో ప్రీపెయిడ్ ఖాతాదారుల సంఖ్య 95.6 శాతానికి చేరింది. అదే ఏప్రిల్-జూన్ కాలంలో ఈ వాటా 95.52 శాతంగా ఉంది. ఇదే కాలంలో 5.17 కోట్ల మంది పోస్టుపెయిడ్ వినియోగదారులున్నారని టెలికం రెగ్యులేటరీ ఈ మధ్య కాలంలో ఒక నివేదికలో తెలిపింది. ఇంతక్రితం వినియోగదారులతో పోల్చితే 1.84 శాతం తగ్గారు. ఈ మధ్య కాలంలో ముఖ్యంగా మెట్రో నగరాల్లోని కేటగిరి ఎ, బి సర్కిళ్లలో పోస్టుపెయిడ్ ఖాతాదారులు క్రమంగా తగ్గిపోతున్నారు.

కాగా జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో పోస్టు పెయిడ్ సెగ్మెంట్ రెవెన్యూ 10 శాతం క్షీణించి రూ.5,900 కోట్లకు పరిమితమయ్యిందని ప్రముఖ బ్రోకరేజీ సంస్థ కొటాక్ సెక్యూరిటీస్ పేర్కొంది. ఇదే సమయంలో ప్రీపెయిడ్ రెవెన్యూ 9 శాతం పెరిగి రూ.24,000 కోట్లకు చేరింది. 2015-16లో పోస్టుపెయిడ్ రెవెన్యూ 30-40 శాతం పడిపోతే, ప్రస్తుతం మరో 20 శాతం మేర క్షీణించిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. కాగా టెలికం కంపెనీలు పోస్టు పెయిడ్ ఖాతాదారులను ఆకర్షించి రెవెన్యూ పెంచుకోవాలని భావిస్తున్నాయి. అయితే ప్రీపెయిడ్ విభాగంలో ఆకర్షణీయ ఆఫర్లు రావడంతో ఖాతాదారులు వీటిపైనే ఆసక్తి చూపుతున్నారని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే పోస్టుపెయిడ్ సెగ్మెంట్‌పై మరింత ఆర్థిక ఒత్తిడి నెలకొననుందని విశ్లేషిస్తున్నారు. ప్రీపెయిడ్, పోస్టు పెయిడ్ టారీఫ్‌ల మధ్య ఉన్న భారీ అంతరమే ప్రీపెయిడ్ చెల్లింపుల వైపు మొగ్గేలా చేస్తున్నాయని ఫిచ్ డైరెక్టర్ నితిన్ సోనీ పేర్కొన్నారు. కాగా పోస్టు పెయిడ్‌లోని సౌలభ్యాలను ప్రీపెయిడ్ సెగ్మెంట్ మాత్రం పూర్తి చేయలేదని మరో టెలికం విశ్లేషకులు ప్రశాంత్ సింఘాల్ పేర్కొన్నారు. పోస్టు పెయిడ్‌లో నిరంతర వాయిస్ కాల్స్, డాటా సర్వీసెస్, ఇంటర్నేషనల్ రోమింగ్ లాంటి కీలక సదుపాయాలు ఉన్నాయన్నారు. జియో రాకతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికంలో ప్రీపెయిడ్ ఖాతాదారుల్లో వృద్ధి చోటు చేసుకుందని సోనీ పేర్కొన్నారు. మరోవైపు రిలయన్స్ కమ్యూనికేషన్స్, టెలినార్, టాటా టెలీ సర్వీసెస్ లాంటి టెలికం కంపెనీల పోస్టుపెయిడ్ వినియోగదారులు ఇతర నెట్‌వర్క్‌లకు మారారు. జియో ఆకర్షణీయ ప్రీపెయిడ్ ఆఫర్లు ఖాతాదారులను ఈ విభాగం వైపు ఆసక్తిని పెంచేలా చేశాయన్నారు.

వృద్ధి రేటు 7% లోపే..

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 7 శాతం లోపే నమోదు కావొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. నోట్ల రద్దు, జిఎస్‌టి సంక్లిష్టత వల్ల వృద్ధి రేటుపై ఒత్తిడి నెలకొని ఉందని అభిప్రాయపడుతున్నారు. 2017-18లో మూడు, నాలుగు త్రైమాసికాలు మెరుగైన వృద్ధిని కనబర్చితే తప్పా వృద్ధి రేటు 7 శాతం సాధించడం కష్టమని ఎస్‌బిఐ రీసెర్చ్ చీఫ్ ఎకనామిస్ట్ సౌమ్య కాంతి ఘోష్ పేర్కొన్నారు.

2018 మార్చితో ముగిసిన ఏడాదిలో వృద్ధి రేటు 6.6-6.8 శాతం పెరుగుదల ఉండొచ్చని యాక్సిస్ బ్యాంకు చీఫ్ ఎకనామిస్ట్ సుగట భట్టచార్యా పేర్కొన్నారు. కాగా 6-6.5 శాతంగా నమోదు కావొచ్చని ప్లానింగ్ కమిషన్ మాజీ సభ్యులు అభ్జిత్ సేన్ తెలిపారు.

మార్కెట్లలో త్రైమాసిక భయాలు

ముంబయి : కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాల అంచనాలు బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి. 2017-18 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసిక ఫలితాలను వచ్చే వారం నుంచి ఆయా కంపెనీలు విడుదల చేయనున్నాయి. వీటిపై నెలకొన్న అంచనాలు తుదకు మార్కెట్ల మిశ్రమ ఫలితాలకు దోహదం చేశాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 19 పాయింట్లు నష్టపోయి 33,793 వద్ద ముగిసింది. ప్రారంభంలో 33,929.61 వద్ద మొదలైన సూచీ ఇంట్రా ట్రేడింగ్‌లో 33,998.37-33,765.43 మధ్య కదలాడింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ ఒక్క పాయింటు లాభపడి 10,443 వద్ద ముగిసింది. బిఎస్‌ఇలో రంగాల వారిగా లోహ సూచీ 1.47శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.22శాతం, రియాల్టీ 1.21శాతం, కన్స్యూమర్ డూరెబుల్స్ 0.98శాతం చొప్పున రాణించాయి. మరోవైపు ఆటో సూచీ 0.26 శాతం నష్టపోయింది.

బిట్ కాయిన్ విలువ పతనం

న్యూఢిల్లీ : కొత్త ఏడాది ప్రారంభంలోనే క్రిప్టో కరెన్సీ బిట్ కాయిన్ విలువ భారీగా పడిపోయింది. సోమవారం ఏకంగా 5 శాతం క్షీణించి 14,000 డాలర్లకు దిగజారింది. 2017లో ఈ కరెన్సీ ఏకంగా 1400 శాతం పెరిగింది. గతేడాది డిసెంబర్ 18న బిట్ కాయిన్ విలువ రికార్డు స్థాయిలో 19,511 డాలర్లకు చేరింది. కాగా 2017 ముగింపు నాటికి 20 శాతం నష్టపోయి 16,000 డాలర్లుగా పలికింది. గత కొద్ది రోజుల నుంచి క్రిప్టో కరెన్సీలపై వివిధ దేశాల నియంత్రణ సంస్థలు, విశ్లేషకులు హెచ్చరికలు జారీ చేయడంతో బిట్ కాయిన్ విలువపై క్రమంగా పడిపోతోంది.

వర్తమానాంశాలు : అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ పోటీ పరీక్షల ప్రత్యేకం

ఆమ్నెస్టీ జనరల్ సెక్రటరీగా నూతన అధ్యక్షుడు?



ఎ. ఉమామహేశ్వరరావు
సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9985288150

ఆర్డినెన్సు

అటవీయేతర ప్రాంతాల్లో పెంచే వెదురును చెట్టు నిర్వచనం నుంచి తప్పిస్తూ భారతీయ అటవీ చట్టాన్ని సవరించే అత్యవసర ఆదేశాని(ఆర్డినెన్సు)కి 2017, నవంబర్ 24న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిద్ ఆమోదముద్ర లభించింది. ఇకపై వెదురును నరికేందుకు, తరలించేందుకు అనుమతులు తీసుకోవాల్సిన అవసరం ఉండదు.

వాసెనర్‌లో సభ్యత్వం

ఆయుధాల సరఫరా, ఎగుమతిని నియంత్రించే వాసెనార్ కూటమిలో భారత్‌కు సభ్యత్వం దక్కింది. వియన్నాలో డిసెంబర్ 7న ముగిసిన ప్లీనరీలో భారత్‌ను సభ్యదేశంగా చేర్చుకునేందుకు వాసెనార్ కూటమి ఆమోదం తెలిపింది. దీంతో సంబంధిత ప్రక్రియను పూర్తిచేసి కూటమిలో చేరనున్నట్లు భారత్ ప్రకటించింది. భారత్ చేరికతో కూటమిలోని సభ్యదేశాల సంఖ్య 42కి పెరిగింది.

'సముద్ర' ప్రాజెక్ట్

కేంద్ర సముద్ర మత్స్య సంపద పరిశోధన సంస్థ (సీఎంఎఫ్‌ఆర్‌ఐ), భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)తో కలిసి సముద్రజలాల్లో పెద్దఎత్తున చేపలు లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించే 'సముద్ర' ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. సముద్రంలో మార్పులను విశ్లేషిస్తూ, మత్స్య సంపద లభ్యతపై అంచనాలు రూపొందించే ఉపగ్రహ ఆధారిత వ్యవస్థ అభివృద్ధికి ప్రణాళికలు రచించినట్లు సీఎంఎఫ్‌ఆర్‌ఐ డైరెక్టర్ ఎ. గోపాల కృష్ణన్ తెలిపారు.

సూపర్ సోనిక్ క్షిపణి పరీక్ష విజయవంతం

గగనతల రక్షణ కోసం దేశియ పరిజ్ఞానంతో రూపొందించిన సూపర్‌సోనిక్ క్షిపణి పరీక్ష విజయవంతమైంది. తక్కువ ఎత్తు నుంచి (30 కిలోమీటర్ల లోపు) వచ్చే ఎటువంటి ఖండాంతర క్షిపణులనైనా ఇది ధ్వంసం చేయగలదు. చండీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ ప్రదేశం నుంచి పృథ్వీ క్షిపణిని ప్రయోగించారు. భూమికి సుమారు 15 కిలోమీటర్ల ఎత్తులోనే ఏఏడీ పృథ్వీని అడ్డుకుని ధ్వంసం చేసింది. 7.5 మీటర్ల పొడవుండే ఈ క్షిపణిలో నావిగేషన్ సిస్టం, హైటెక్ కంప్యూటర్‌ను అనుసంధానం చేశారు.





జియో చేతికి 'ఆర్‌కామ్'

టవర్లు, ఫైబర్ నెట్‌వర్క్, స్పెక్ట్రం ఆస్తుల కొనుగోలుకు జియో ఒప్పందం చేసుకుంది.

ప్రపంచ చాంపియన్ ఆనంద్

ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ విజేతగా విశ్వనాథన్ ఆనంద్ నిలిచాడు.

యూజీసీ చైర్మన్‌గా ధీరేంద్రపాల్ సింగ్

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మన్‌గా ప్రొఫెసర్ ధీరేంద్రపాల్ సింగ్ నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన ప్రస్తుతం బెంగళూరులోని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్(నాక్) డైరెక్టర్‌గా ఉన్నారు. ధీరేంద్ర ఐదేళ్లపాటు యూజీసీ చైర్మన్‌గా పదవిలో కొనసాగుతారని సిబ్బంది, శిక్షణ విభాగం (డీఓపీటీ) తెలిపింది. కాగా, ప్రొఫెసర్ వేద్ ప్రకాశ్ యూజీసీ చైర్మన్‌గా 2017 ఏప్రిల్‌లో పదవీ విరమణ పొందినప్పటినుంచి ఆ పదవి ఖాళీగానే ఉంది.

ఆమ్నెస్టీ జనరల్ సెక్రటరీగా కుమీనాయుడు



అంతర్జాతీయ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రధానకార్యదర్శిగా తెలుగు మూలాలున్న దక్షిణాఫ్రికా ఉద్యమకారుడు కుమీనాయుడు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఈ పదవిలో ఉన్న బెంగళూరుకు చెందిన సలీల్ షెట్టి 2018 ఆగమస్తులో రిటైరయిన తరువాత నాయుడు బాధ్యతలు స్వీకరిస్తారు. 52 ఏళ్ల నాయుడు 2009 -2015 మధ్యకాలంలో గ్రీన్‌పీస్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు. తెలుగు మూలలున్న తల్లిదండ్రులకు జన్మించినా మిగిలిన భారత సంతతి ప్రజల మాదిరిగానే నాయుడూ తనను నల్లజాతి దక్షిణాఫ్రికా పౌరుడిగానే భావించి, తెల్లజాతి పాలకులపై పోరు సాగించారు. చదువుకునే రోజుల్లో అక్కడి ఎమర్జెన్సీ నిబంధనలు ఉల్లంఘించారనే కారణంతో పలుమార్లు అరెస్టయ్యారు.

పన్ను సంస్కరణ బిల్లుకు ట్రంప్ ఆమోదం



ఆమెరికా పన్ను వ్యవస్థలో భారీ సంస్కరణలు తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన బిల్లుపై ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ సంతకం చేశారు. ఇదిఅమెరికా ప్రజలకు తన క్రిస్మస్ కానుక అని అన్నారు. గత 30 ఏళ్లలోఇంత భారీ సంస్కరణలు తీసుకురావడం ఇదే తొలిసారి. ఇప్పటికే అమెరికా సెనెట్, ప్రతినిధుల సభ అమోదం పొందిన బిల్లుపై ట్రంప్ కూడా సంతకం చేయడంతో ఇది త్వరలోనే అమల్లోకి రానుంది. దీనివల్ల అమెరికన్లు వ్యక్తిగత ఆదాయంపై పన్ను తగ్గుతుంది. కాగా, ఈ కొత్తబిల్లును డెమోక్రాట్లు విమర్శిస్తున్నారు. దీనివల్ల అమెరికా 1.5 ట్రిలియన్ డాలర్ల ఆదాయం తగ్గడంతోపాటు ఆ దేశంలో పనిచేసేందుకు వచ్చిన కుటుంబాలపై అధికభారం పడుతుందనీ, 1.3 కోట్ల మందికి హెల్త్ ఇన్సూరెన్స్ లభించకపోవడం వల్ల ఆరోగ్యరంగం స్థిరత్వం దెబ్బతింటుందని కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి అన్నారు.

★

తెలుసుకోండి మీ నాలెడ్జ్

1.యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నూతన చైర్మన్? **దేవేంద్రపాల్ సింగ్**

2. నేషనల్ కేడర్ కోర్ నూతన డైరెక్టర్ జనరల్? **బి.ఎస్.సహరావత్**

3. 'ఇంటర్‌నేషనల్ క్రికెట్ కౌన్సిల్ ప్రకటించిన ఉమెన్ టి20 టీం ఆఫ్ ద ఇయర్'లో చోటు పొందిన భారతీయుల్లో లేనిది? **జూలన్‌గోస్వామి**


4. 2018 లో భువనేశ్వర్(వడిశా)లో నిర్వహించనున్న 'హాకీ వరల్డ్ కప్' అంపైర్స్ ప్యాలెట్‌లో చోటు పొందిన భారతీయులు? **రఘుప్రసాద్, జావెద్ షేక్**

5. గుజరాత్ నూతన ముఖ్యమంత్రిగా ఎవరు ప్రమాణస్వీకారం చేశారు? **విజయ్ రూపాని**

6. 'నేషనల్ డిజైన్ అవార్డు-2017'కి ఎంపికైన రక్షణమంత్రి శాస్త్ర సాంకేతిక సలహాదారుడు? **సతీష్ రెడ్డి**

7. ఇటీవల దక్షిణ ఫిలిప్పీన్స్‌లో విధ్వంసం సృష్టించిన తుపాను? **టెంబిన్**

8. 'విరామమెరుగని ప్రయాణం' రచనకు అనువాద విభాగంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 2017'కి ఎంపికైనది? **వెన్నా వల్లభరావు**



9. 2022 కామన్వెల్త్ క్రీడల నుంచి దేనిని తొలగించారు? **షూటింగ్**

10.SAFF-2017 అండర్-15 మహిళల ఫుట్‌బాల్ టోర్నీలో బంగ్లాదేశ్ ఎవరిపై గెలుపొంది, విజేతగా నిలిచింది? **ఇండియా**

11. భారత ప్రొఫెషనల్ బాక్సర్ విజేందర్‌సింగ్ ఎవరిపై గెలుపొంది వరుసగా 10వ బౌట్ విజయాన్ని నమోదు చేశాడు? **ఎర్నస్ట్ అమాజు(ఘనా)**

12. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరిగిన తొలి 25వ జాతీయ లీగ్ విజేత? **కేరళ కింగ్స్**

13. ఎవరి పుట్టినరోజు పురస్కరించుకొని, డిసెంబర్ 25న 'జాతీయ సుపరిపాల దినోత్సవం'గా నిర్వహిస్తారు? **వాజ్‌పేయి**

14. హిమచల్‌ప్రదేశ్ నూతన ముఖ్యమంత్రి జయరామ్ **ఠాకుర్**

15. దేశీయ విమానయాన రవాణాకు ఉద్దేశించిన UDAN పథకంలో ఇటీవల చేరిన విమానయాన సంస్థ. **ఎయిర్ డెక్కన్**

16.2018 ప్రొరెజ్లింగ్ లీగ్ ఆటగాళ్ల వేలంలో సుశీల్‌కుమార్ అత్యధికంగా రూ.55 లక్షల ధర పలికాడు. అయితే అతన్ని ఏ జట్టు సొంతం చేసుకుంది? **ఢిల్లీ సుల్తాన్స్**

17. మాజీ ప్రధాని చరణ్‌సింగ్ జ్ఞాపకార్థం **డిసెంబర్ 23**వ రోజున 'కిసాన్ దివస్'గా నిర్వహిస్తారు.

18. 2018 జనవరి 1 నుంచి భారత్ ఏదేశంతో కుదుర్చుకున్న పన్నుల సమాచారం మార్పిడి ఒప్పందం అమల్లోకి రాబోతుంది? **స్విట్జర్లాండ్**

19.'ఫోర్బ్స్' 2017కి గాను ప్రకటించిన టాప్ 100 సెలబ్రిటీల జాబితాలో తొలిస్థానం పొందిన వ్యక్తి సల్మాన్‌ఖాన్

20. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం **డిసెంబర్ 24**

బిట్ బ్యాంక్

1. (UNICEF) యూనిసెఫ్ నూతన అధిపతి?

ఎ) అడ్రే అజేలే బి)హెన్రియెట్టా.హెచ్.ఫోర్
సి) ఇరినా బొకావొ డి) టెడ్రాస్ అదానం గాబ్రియోసస్

2. శ్రీనివాస రామానుజన్ జ్ఞాపకార్థం 'డిసెంబర్22'ని జాతీయ గణితశాస్త్ర దినోత్సవంగా ఎప్పటి నుంచి నిర్వహిస్తున్నారు.

ఎ)2012 బి)2010 సి)1996 డి)1986

3. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ సలీల్‌శెట్టి తర్వత ఆ బాధ్యతలు స్వీకరించనున్నది?

ఎ) థామస్ హమ్మర్ బర్గ్ బి) ఇరేన్ ఖాన్
సి) కుమినైడో డి) పియర్రిసేన్

4. 'రిపబ్లికన్ ఆఫ్ పెరూ'లో భారత నూతన రాయబారి?

ఎ) మోహన్ సింగ్ బి) ఈనం గంభీర్
సి) ఎం. సుబ్బారాయుడు డి) దీపా మెహతా

5. ఆంధ్రాబ్యాంకు నూతన మేనెజింగ్ డైరెక్టర్‌గా ఇటీవల ఎవరు నియామితులైయ్యారు. (ఎ)

ఎ) బ్రాహ్మజీరావు బి) లలితా చాహల్
సి) ఉమేష్ గుప్తా డి) వినయ్ కత్రియాల్

6. 'గాలి రంగు' కవిత్వానికి' కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు -2014' ఎంపికైన దేవిప్రియ అసలు పేరు?

ఎ) షేక్ ఖాజా హుస్సేన్ బి) లలితా కుమారి
సి) నలియెల భాస్కర్ డి) మెర్సీ మార్గరెట్

7. ఎప్పటిలోగా దేశంలోని అన్ని రైళ్లలో 100 శాతం ఎల్ఇడి బల్బులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

ఎ) 2018 మార్చి 31 బి)2018 జూన్ 1
సి) 2018 ఆగస్టు15 డి) 2018 అక్టోబర్ 2

8. కార్టోశాట్-2E ఉపగ్రహంతో కూడిన PSLV40ను ఇస్రో



ఎప్పుడు ప్రయోగించనుంది.

ఎ) 2018 మార్చి 16 బి) 2018 జనవరి 26
సి) 2018 జనటరి 10 డి) 2018 ఫిబ్రవరి 18

9. భారత్ ఏ దేశంతో కలిసి నిర్వహించిన సంయుక్త నౌకా విన్యాసాలను 'నసీం-అల్- బహర్'లా వ్యవహరించాడు.

ఎ) ఒమన్ బి) సౌదీ అరేబియా
సి) ఇరాన్ డి) మాల్దీవులు

10. 2040 నాటికి ఆయిల్ సహజవాయువు వెలికితీతను పూర్తిగా నిలిపి వేయనున్న దేశం (సి)

ఎ) జర్మనీ బి) ఫ్రాన్స్ సి)ఐస్‌లాండ్ డి) ఐర్లాండ్

జవాబులు

1బి, 2 ఎ, 3 సి 4 సి, 5 ఎ,6 ఎ,7ఎ,8 సి,9ఎ,10సి

హిందీ అకాడమీని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ)

ఆంధ్రప్రదేశ్‌లో హిందీ అకాడమీని పునరుద్ధరించి, అభివృద్ధి పరచాలని రాజ్యసభ మాజీ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో స్వరాజ్యమైదాన్‌లో జరుగుతున్న 29వ పుస్తక మహోత్సవం సందర్భంగా బుధవారం సాయంత్రం శత వసంతాల తెలుగు కథ, మహాభారత చరిత్ర, విశ్వకథాశతకం, తెలుగుభాషా చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందీభాషలో అనువాదం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. దేశ భాష హిందీలో అనువాదం పెరిగితే సాంస్కృతిక ఉత్సవాలు



నిరసన

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికిసమాన వేతనం ఇవ్వాలని బుధవారం కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

బాబూ మళ్లీ వస్తే ఉన్న ఉద్యోగాలూ పోతాయి

పలుచోట్ల విద్యుత్ కార్మికుల ధర్నాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వివిధ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రంలో పలుచోట్ల బుధవారం కార్మికులు ధర్నాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఐక్య వేదిక అధ్వర్యంలో కార్మికులు కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నం వద్ద ఉన్న ఎన్‌టిటిపిఎస్ ఎదుట మౌన ప్రదర్శన నిర్వహించారు. సిఐటియు పశ్చిమ కృష్ణా కార్యదర్శి ఎన్‌సి హెచ్.శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే జోగి రమేష్‌లు పాల్గొని మద్దతు తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని టిడిపి ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిందన్నారు. ఐకాస చైర్మన్ డి.మల్లిఖార్జునరావు మాట్లాడారు. జోగి రమేష్ మాట్లాడుతూ.. చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వస్తే ఉన్న ఉద్యోగాలూ పోతాయని జోస్యం చెప్పారు. ప్రస్తుతం ఎపిజెన్‌కోను ప్రయివేట్ వ్యక్తులకు అప్పజెప్పేందుకు తాపత్రయపడుతున్నారని విమర్శించారు. అనంతరం కార్మికులతో కలిసి నోటికి నల్ల రిబ్బన్ కట్టుకుని మౌనప్రదర్శన నిర్వహించారు. నూజివీడులో ఎలక్ట్రికల్ డిఈ కార్యాలయం ముందు భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మికులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. విశాఖ జిల్లా చోడవరం ఎడిఇ కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ప్రేమ చంద్రశేఖర్, మండల కార్యదర్శి చంద్రరావు అధ్యక్షతన ఆందోళన చేపట్టారు. ప్రకాశం,ఒంగోలు,శ్రీకాకుళం జిల్లాలో ఎలక్ట్రిసిటీ ఎంపాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా, నిరసన చేపట్టారు.

అవినీతికి కేరాఫ్‌గా ఎపి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

రాష్ట్రంలో ధృతరాష్ట్ర పరిపాలన, అవినీతి పాలన సాగుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. బుధవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. చంద్రబాబు ఏ జిల్లాకు వెళ్ళినా ఇచ్చిన హామీలనే పదేపదే చెబుతున్నారని విమర్శించారు. అవినీతికి కేరాఫ్‌గా ఎపి ఉందన్నారు. 12 నెలల కాలంలో ఎసిబి దాడుల్లో రూ.2,500 కోట్లు ప్రాపర్టీ సీజ్ చేశారన్నారు. సాధారణ అధికారులే ఇంత అవినీతికి పాల్పడుతుంటే ప్రజాప్రతినిధులు రాష్టాన్ని దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రతిపక్ష నేత జగన్ 45 సంవత్సరాల వారికి పింఛన్ ఇస్తామంటూ హామీ ఇస్తున్నారని విమర్శించారు. ప్రజలను భిక్షగాళ్ళను చేయడానికి ఇలాంటి హామీలు ఇస్తున్నారని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర మహాసభలు ఏప్రిల్ 7,8,9 తేదీల్లో కడపలో జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభలో సమస్యలపై మహోద్యమానికి రూపకల్పన చేస్తామని పేర్కొన్నారు

తెలుగు సాహిత్యాన్ని కాపాడండి

సాంస్కృతిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎల్‌వి.సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-కార్పొరేషన్ (గుంటూరు)

వేగవంతమైన నేటి రోజుల్లో ప్రాభవం కోల్పోతున్న తెలుగు సాహిత్యాన్ని కాపాడుకోవాలని సాంస్కృతిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం అన్నారు. గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కొప్పవరపు కవుల సాహితీ సర్వస్వం(శ్రీం) అనే పుస్తకంను హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం మాజీ ఆచార్యులు డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం, సాహితీవేత్త ఇంద్రగంటి శ్రీకాంతశర్మతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోదుగుల రవికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎల్వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నేడు ఇంగ్లీష్ మీడియం వైపు తమ పిల్లలను తల్లిదండ్రులూ మరల్చడం బాధాకరమని చెప్పారు. కొప్పరపు కవుల మనుమడు మాశర్మ ఎంతో వ్యయ ప్రయాసలతో సేకరించిన కొప్పవరపు కవులు పద్యాలు తెలుగు నాట ఒకనాటి సాహిత్య మాధుర్యాన్ని నేటి తరానికి అందిస్తుందనటంలో అతిశయోక్తి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తెలుగు విశ్వవిద్యాలయాన్ని స్థాపించనున్నదని, ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల్లోని మరుగుపడిన సాహిత్యాన్ని వెలుగులోకి తేవడానికి అందరూ కలిసి రావాలని కోరారు.

ప్రజ్ఞ

జవాబులు

1. మూడు నెలలు
2. ఆఫ్రికా
3. పాకిస్తాన్
4. హర్యానా
5. నాబార్డ్ (సవరణ) బిల్లు 2017

ప్రజా చైతన్యానికి కలం, గానం, గాత్రమే అస్త్రాలు

ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభల్లో పిలుపు

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

ప్రజలను చైతన్యవంతం చేయడంలో కళాకారులు.. కలం, గానం, గాత్రం అన్నింటినీ ఏకం చేసి ప్రజలను జాగృతం చేయాల్సిన అవసరముందని సిఐటియు పూర్వ రాష్ట్ర కమిటీ నాయకులు వి.రాంభూపాల్ ఉద్బోధించారు. ప్రజానాట్యమండలి 9వ రాష్ట్ర మహాసభలు అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో జరుగుతున్నాయి. బుధవారం రెండో రోజు ప్రతినిధుల సభలో రాంభూపాల్ ప్రారంభోన్యాసం చేశారు. 'ఇప్పటివరకూ దోపిడీకి వ్యతిరేకంగానే పోరాటం సాగిస్తూ వచ్చాం.. ఇక నుంచి ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించాల్సిన అవసరముంది.' అని రాంభూపాల్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఫాసిస్టు శక్తులు ప్రజ్వరిల్లుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోనూ ఇదే ధోరణి నెలకొందన్నారు. ఇటువంటి తరుణంలో దోపిడీతో పాటు, ఫాసిస్టు శక్తులను నిలువరించే బాధ్యత అభ్యుదయవాదులపై ఉందన్నారు. పాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేయడంలో ప్రజా కళాకారుల పాత్ర చాలా కీలకమన్నారు. అందుకే పిలుపునిచ్చారు. ఆ దిశగా ఈ మహాసభలు విజయవంతమవ్వాలని ఆకాంక్షించారు. సిఐటియు నాయకులు ఓబులు మాట్లాడుతూ.. దేశంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలోనున్న ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. ప్రపంచీకరణ ప్రభావం ప్రజలపై తీవ్రంగా ఉందన్నారు. ఇది ప్రాచీన కళలను సైతం విధ్వంసం చేస్తోందని విమర్శించారు. ఇలాంటి తరుణంలో మరోమారు పునరుత్తేజమై ప్రజలకు మరింతగా చేరవయ్యేందుకు ఈ మహాసభలు దోహదపడాలని ఆకాంక్షించారు.



ప్రజానాట్య మండలి ప్రతినిధుల సభలో ప్రారంభోపన్యాసం చేస్తున్న వి.రాంభూపాల్

కళలు ప్రభువులను సంతోష పెట్టేవికావు : దేవేంద్ర

ప్రజానాట్యమండలి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దేవేంద్ర మాట్లాడుతూ.. కళలు అంటే ప్రజలను రజింపజేసివి కావన్నారు. ప్రభువులను సంతోషపెట్టేవి ఎంత మాత్రం కాదన్నారు. ప్రజలను ఆలోచింపజేసే విధంగా ఉన్నవే ప్రజా కళలని పేర్కొన్నారు. ప్రజానాట్యమండలి లక్ష్యం కూడా అదేనని చెప్పారు. ప్రజలకు మరింతగా చేరువ కాకావాలన్నారు. తమ కళల ద్వారా వారిలో చైతన్యాన్ని నింపాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ప్రజా కళాకారులం అని చెప్పుకునే కొంత మంది పాలకుల, పెట్టుబడిదారుల ప్రలోభాలకు లొంగిపోయి వారికి అనుకూలంగా పనిచేసే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇటువంటి వాటి పట్ల జాగురూకతతో వ్యవహరించాలని సూచించారు. ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు జగ్గరాజు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ కళల భాండాగారమని పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టే రీతిలో కళారూపాలు రూపొందించడంలో ఈ రాష్ట్రం అగ్రభాగాన ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు బాషా, ప్రధాన కార్యదర్శి యాదగిరి తదితరులు పాల్గొన్నారు. గతంలో రాష్ట్రంలో చేపట్టినకార్యక్రమాలపై సమీక్షించారు.

ఆలోచింపజేసిన ప్రదర్శనలు

ప్రజానాట్యమండలి తొమ్మిదవ రాష్ట్ర మహాసభలు రెండవ రోజు ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రతినిధుల సభ అనంతరం సాయంత్రం కళకారుల ప్రదర్శన నగరంలో సాగింది. లలిత కళా పరిషత్ నుంచి టవర్‌క్లాక్ మీదుగా ఆర్ట్స్ కళాశాల మైదానం వరకు సాగింది. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ప్రదర్శనలు సాగాయి.

రెండో రోజూ నిరసన సెగలు

రాష్ట్ర వ్యాప్తంగా జన్మభూమి సభల్లో నిలదీతలు

ప్రజాశక్తి- యంత్రాంగం

జన్మభూమి కార్యక్రమానికి రెండో రోజూ ప్రజల నిరసన సెగలు తగిలాయి. సమస్యలపై బుధవారం కూడా ప్రజాప్రతినిధులను, అధికారులను నిలదీశారు. తద్వారా ప్రభుత్వ తీరుపై తమ వ్యతిరేకతను తెలియజేశారు. గత జన్మభూమిల్లో ఇచ్చిన వినతులు పరిష్కారం కాకపోవడంపై విశాఖ జిల్లా ఏజెన్సీ జి.మాడుగుల మండలంలోని సొలభం, గడుతూరు, వంతాల, పెదలోచలి పంచాయతీ కేంద్రాల్లో అధికారులను గిరిజనులు అడ్డుకున్నారు. అనంతగిరి మండలం టోకూరు, గరుగుబిల్లిల్లో రేషన్ కార్డులు, పింఛన్లు, ఎన్‌టిఆర్ గృహాలు, ఇళ్ల బిల్లుల కోసం నిలదీశారు. పాడేరు మండలం పనుగుపల్లిలో గ్రామసభ నిర్వహణకు వచ్చిన ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరితో పాటు అధికారులను కందిమామిడి వద్ద గిరిజనులు రోడ్డుపై బైటాయించి ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ అడ్డుకున్నారు. ఎమ్మెల్యే హామీతో ఆందోళన విరమించారు. విశాఖ నగర పరిధి జోగవానిపాలెంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును మాజీ కౌన్సిలర్ పల్లా చినతల్లి ప్రశ్నించారు. విజయవాడ 24వ డివిజన్ పరిధి భ్రమరాంభపురంలోని వందలాది గృహాల రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించాలంటూ జన్మభూమి సభలో సిపిఎం నాయకులు బైటాయించారు. 15 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 45వ డివిజన్ మధురానగర్ ప్రాంతవాసులకు ఇంటి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ జన్మభూమి సభా వేదిక వద్ద సిపిఎం నాయకులు ధర్నా చేశారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, సిపిఎం నాయకులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం చినకాకానిలో స్థానిక సమస్యలపై, ఈపూరు మండలంలో మరుగుదొడ్ల బిల్లుల మంజూరులో జాప్యంపై ప్రజలు నిలదీశారు.



విశాఖ జిల్లా జి.మాడుగుల మండలంలో అధికారులను అడ్డుకుని, రోడ్డుపై నిర్బంధించిన గిరిజనులు

సమస్యలు పరిష్కారం కాని జన్మభూమి ఎందుకంటూ, గిరిజన మహిళా సర్పంచ్‌ను సభకు ఆహ్వానించకుండా కించపర్చారంటూ శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం మండలంలోని వండువ గ్రామంలో జన్మభూమి కార్యక్రమాన్ని పాలకొండ వైసిపి ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతితో పాటు గ్రామస్తులు బహిష్కరించారు. టిడిపి వారికే సంక్షేమ పథకాలు ఇస్తున్నారంటూ విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం గుంపాం జన్మభూమి సభలో అధికార్లపైనా, స్థానిక ఎంపిపి, టిడిపి జిల్లా అధ్యక్షులు మహంతి చిన్నంనాయుడుపైనా గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా పాములపాడు మండలం లింగాల గ్రామంలో సమస్యలపై అధికారులను సిపిఎం ఆధ్వర్యాన ప్రజలు నిర్బంధించారు. అనంతపురం జిల్లా సోమందేపల్లి మండలం తుంగోదు గ్రామంలో భూసమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు జన్మభూమిని అడ్డుకున్నారు. రాప్తాడు మండలం జి.కొత్తపల్లి గ్రామంలో పింఛన్ల కోసం జన్మభూమి సభలో గ్రామస్తులు బైటాయించారు. ప్రకాశం జిల్లా కనిగిరి నగర పంచాయతీ శంఖవరంలో తాగునీటి సమస్యపై మహిళలు ఖాళీ బిందె లతో జన్మభూమి సభా ప్రాంగణంలో నిరసన తెలిపారు. పింఛన్ల మంజూరులో రాజకీయ వివక్షపై నిలదీశారు. ఐఐటి, ఐసర్ కోసం భూములిచ్చిన రైతులకు న్యాయం చేయకపోవడంపై చిత్తూరు జిల్లా ఏర్పేడు మండలం జంగాలపల్లిలో సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి అంగేరి పుల్లయ్య అధికారులను ప్రశ్నించారు. తూర్పుగోదావరి జిల్లా కూనవరం మండలం పోచవరం కాలనీ స్కూల్లో తాగునీటి సమస్యపైనా, పింఛన్ల పంపిణీలో అవకతవకలపైనా అధికారులను గిరిజనులు నిలదీశారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం ఆరో వార్డులో పింఛన్లపై మంత్రి మాణిక్యాలరావును మహిళలు ప్రశ్నించారు.

గిరిజన బాలిక అత్యాచార ఘటనపై ప్రజా సంఘాల ఆందోళన

ప్రజాశక్తి - కూర్మన్నపాలెం, విశాఖ

దువ్వాడ సెజ్‌లో గిరిజన మూగ బాలికపై జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తూ సెజ్ గేటు వద్ద వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి), గిరిజన సంఘం, ఐద్వా ఆధ్వర్యాన బుధవారం ఆందోళన జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సెజ్‌లో హెచ్‌బిఎల్ కంపెనీలో పని చేస్తున్న బాలికపై అదే కంపెనీ బస్సు డ్రైవర్ వాహనంలోనే అత్యాచారం చేసి దారుణంగా హింసించాడన్నారు. కేసును పక్కదారి పట్టించేందుకు కంపెనీ యాజమాన్యం అన్ని విధాలా ప్రయత్నిస్తోందని తెలిపారు. అత్యాచార నిందితునిపై నిర్భయ చట్టాన్ని అనుసరించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధితురాలికి ప్రభుత్వ ఉద్యోగం, ఇల్లు, భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియోను ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు, గిరిజన సంఘం జిల్లా నాయకులు పృధ్వీరాజ్, వరలక్ష్మి, ఐద్వా నాయకులు వేణు, ఎంబి.సత్యవతి, మంగవేణి తదితరులు పాల్గొన్నారు. ప్రజా సంఘాల ఆందోళనకు మాజీ గిరిజన శాఖ మంత్రి పసుపులేటి బాలరాజు, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ సభ్యులు సివేరి సోమ తదితరులు మద్దతు తెలిపారు. బాలికకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామన్నారు.

నిందితుల అరెస్టు

దువ్వాడ విఎస్‌ఇజెడ్‌లోని బస్సులో గిరిజన బాలికను చెరిసిన కేసులో పోలీసులు బుధవారం ముగ్గురిని అరెస్టుచేశారు. మానభంగంచేసిన చింతాడ విశ్వనాధంతోపాటు డబ్బుతో వెలకట్టి రాజీ చేసేందుకు యత్నించిన హెచ్‌బిఎల్ పవర్ సిస్టమ్ కంపెనీ అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ సూర్యప్రకాశరావు, బస్ ఓనర్ ఎం.అప్పలరాజును దువ్వాడ విఎస్‌ఇజెడ్ గేటు వద్ద అరెస్టు చేశారు. ఈ మేరకు దువ్వాడ పోలీసుస్టేషన్లో సౌత్ ఎసిపి రామ్మోహనరావు, ఎస్‌సి, ఎస్‌టి సెల్-2 ఎసిపి కె.ప్రవీణ్‌కుమార్ వివరాలను వెల్లడించారు.

విలేజ్ మాల్స్‌ను ఉపసంహరించుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

చంద్రన్న విలేజ్ మాల్స్‌ను పెట్టే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ న్యూ ప్రజా ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో న్యూ ప్రజా ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ కెపి సంజయ్ మాట్లాడుతూ పిడియస్‌ను కార్పొరేటీకరించడం వల్ల ఆర్థిక కేంద్రీకరణ, వ్యవసాయం ధరలు ఏకపక్షంగా ఉండటం, మార్కెటింగ్ , ట్రాన్స్‌పోర్టు రంగాలు దెబ్బతింటాయన్నారు. ఇన్ని విధానాలు నష్టం ఉన్న చంద్రన్న విలేజ్ మాల్స్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



సావిత్రి బాయి పూలే జయంతి సభలో మాట్లాడుతున్న స్వరూపారాణి

భారత చరిత్రలో ధృవతార సావిత్రిబాయి పూలే

జయంత్యోత్సవాల్లో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వరూపారాణి

ప్రజాశక్తి-యంత్రాంగం

కుల వ్యవస్థ నిర్మూలనకు పాటు పడిన ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే ఆధునిక భారతదేశ చరిత్రలో ధృవతారగా వెలుగొందుతోందని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.స్వరూపారాణి అన్నారు. దేశంలో తొలి ఆదర్శ ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బుధవారం ఐద్వా, తదితర సంఘాలు, విద్యా సంస్థలలో సభలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. కృష్ణాజిల్లా బుద్ధవరం వికెఆర్ కళాశాలలో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో స్వరూపారాణి మాట్లాడారు. మహిళా సమాజానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. పమిడిముక్కలలో ఐద్వా ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. 498ఎ సెక్షన్‌పై రౌండ్‌టేబుల్ నిర్వహించారు.

విజయనగరం జిల్లా కేంద్రంలో రామకృష్ణా నగర్‌లో ఐద్వా ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి పి.రమణమ్మ మాట్లాడుతూ.. సావిత్రీబాయి ఆదర్శ మహిళ అని కొనియాడారు. విశాఖపట్నం జిల్లా ఎయులోని కాన్వోకేషన్ హాల్‌లో జయంతి ఉత్సవాలు నిర్వహించారు. పూలే చిత్రపటానికి రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ.. విశాఖ ఎడ్యుకేషన్ హబ్ రూపాంతరం చెందుతుందని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో సావిత్రి బాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమవరంలో సిఐటియు, కెవిపిఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతపురం జిల్లా కేంద్రంలో నీలం సంజీవరెడ్డి భవనంలో ఎపి మహిళా సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో సావిత్రి బాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం కేక్‌ను కట్‌చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో కర్నూలు ఆర్‌సిరెడ్డి కళాశాలలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు నిర్మలమ్మ, ఆశీర్వాదమ్మ, కర్నూలు జిల్లా కార్యదర్శి అలివేలమ్మ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు సుబ్బారావు

సంస్మరణ సభలో నర్సింగరావు

ప్రజాశక్తి- మద్దిలపాలెం,విశాఖ

సిపిఎం కార్యకర్త కుంచం సుబ్బారావు ఆదర్శ ప్రాయుడని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.నర్సింగరావు పేర్కొన్నారు. నగరంలోని శివాజీపాలెంలో బుధవారం సిపిఎం అధ్వర్యాన కుంచం సుబ్బారావు సంస్మరణ సభ జరిగింది. ముందుగా సుబ్బారావు చిత్రపటానికి సిపిఎం, సిఐటియు నాయకులు, యూనివర్సిటీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. తన కుటుంబాన్నంతటినీ పార్టీకే అంకితం చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. కుటుంబ సభ్యులందరికీ కులాంతర వివాహాలు జరిపిన గొప్ప హేతువాదని పేర్కొన్నారు. సిపిఎం నగర కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ.. ఆంధ్ర యూనివర్సిటీలో పని చేస్తూ ఉద్యోగ సంఘాలు, సిఐటియు ఉద్యమాలు, ప్రజానాట్య మండలి, పార్టీ కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ అంకిత భావంతో పనిచేసిన గొప్పవ్యక్తని కొనియాడారు. పెట్రోలియం యూనివర్సిటీ డైరెక్టర్ ఆచార్య వివిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ.. సుబ్బారావు భావాలను సున్నితంగా చెప్పే వ్యక్తని, అందరికీ ఆదర్శంగా ఉండేవారని పేర్కొన్నారు. ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ మేనేజర్ ఎస్.సుధాకర్, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి జగ్గునాయుడు తదితరులు ప్రసంగించారు.

ప్రత్యేకం

ప్రచార వేదికగా జన్మభూమి

సంక్షేమంపై చంద్రబాబు సుదీర్ఘ ప్రసంగం

ప్రజాశక్తి-ఒంగోలు ప్రతినిధి

పథకాలపై పెద్ద ఎత్తున ప్రచారం.. లబ్ధిదారులకు సహాయాలు.. నేతల సుదీర్ఘ ప్రసంగాలు.. ఇదే జన్మభూమి పరమార్థంగా కనిపిస్తోంది. ప్రభుత్వ పథకాల ప్రచారానికి వేదికగా ఈ కార్యక్రమం మారిందనే చర్చ సాగుతోంది. సాధారణ రోజుల్లో లబ్ధిదారులకు ఎటువంటి సహాయాలూ కనిపించడంలేదు. జనానికి పింఛను ఇచ్చినా రేషన్ కార్డు ఇచ్చినా అది జన్మభూమిలోనే. అధికారులు పిలిస్తే సభలకు వెళ్లాలి. సిఎం సభకైతే ఊరంతా కదలాలి. లేకుంటే రేషను కార్డు లేదా పింఛను ఆగిపోతుందనే భయం. మహిళల్లోనైతే రుణాలు ఇవ్వరనే ఆందోళన. గుర్తు పెట్టుకుని ఆపేస్తారనే ప్రచారం కూడా డ్వాక్రా మహిళల్లో కలవరం రేపుతోంది.

సిఎం చంద్రబాబు ఐదో విడత జన్మభూమి కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లా దర్శిలో ప్రారంభించారు. తొలి రోజున సభలో గంటన్నర పాటు ప్రసంగించారు. సుదీర్ఘ ప్రసంగం వేదికపై నేతలను విసుగుపుట్టించింది. అంతా సంక్షేమం పైనే. రాజకీయంగానూ విమర్శల జోలికి వెళ్ల లేదు. రాష్ట్ర ప్రభుత్వం మూడున్నరేళ్లలో చేపట్టిన పథకాలను మరోసారి ఏకరువు పెట్టారు. రాష్ట్ర విభజన వల్ల వచ్చిన కష్టాలు మొదలుపెట్టి తాను చేసిన కృషి వల్లే రెండంకెల అభివృద్ధి సాధ్యమైందని చెప్పుకొచ్చారు. ప్రధానంగా సంక్షేమ పథకాలు అమలు తీరును పదేపదే చెప్పారు. వ్యక్తిగతంగా జనాన్ని ప్రభుత్వం వైపు ఆలోచించేలా ప్రయత్నం చేశారు. ఫైబర్ గ్రిడ్ వల్ల వైఫై, టీవీ, ఫోను ఇలా తక్కువ ఛార్జీకి అందజేస్తున్నామన్నారు. ఇదే సమయంలో చంద్రబాబు సభ, జన్మభూమి కార్యక్రమాన్ని కూడా ఏపీ ఫైబర్‌లో ప్రత్యక్ష ప్రసారం ఇచ్చారు. మహిళలను సభకు భారీగా సమీకరించారు. రానున్న కాలంలో మహిళలకు భారీగా రుణాలు ఆశ చూపారు. ప్రస్తుతం 46 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామన్నారు. నాలుగు నుంచి 5 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేస్తున్నామన్నారు. అంటే పింఛన్ల ద్వారా ఆయన ఏమి ఆశిస్తున్నారన్నది స్పష్టమవుతోంది. ఇంకా 19 లక్షల గృహాలు మంజూరు చేశామని, సంక్రాంతికి వీటిని ప్రారంభిస్తామన్నారు. మరుగుదొడ్లపై మాట్లాడుతూ ఆడబిడ్డల కోసమే మరుగుదొడ్డికి ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు.

ఇచ్చిన హామీలపై ఊసేలేని ప్రసంగం

సిఎం గతంలో ఇచ్చిన హామీలు ప్రస్తావించలేదు. జిల్లాకు ఇచ్చిన పది హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకపోయినా వాటి ప్రస్తావన లేదు. పైగా వైఫల్యాలకు ప్రజలే బాధ్యులన్నట్లుగా దొనకొండ పారిశ్రామికవాడకు రైతులు సహకరించడంలేదన్నారు. రైతులుగానీ, జనంగానీ అడగని అనంతపురం అమరావతి రహదారికి ఆగమేఘాలపై భూసేకరణకు దిగారు. తర్వాత ఆపేశారు. ఇలా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత తీసుకునే వాటికి మాత్రం ఎవరూ సహకరించకపోయినా ముందుకుపోతున్న విషయాన్ని మరిచిపోయారు.

వెలుగొండపై పాత పాటే..

వెలుగొండపై మళ్లీ అదే మాట చెప్పారు. గతంలో పలు తేదీలు చెప్పి వాయిదా వేశారు. ఈసారి ఎన్నికలేడాది కావడంతో ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. ఇది ఏ మేరకు సాధ్యం అన్నదే అంతుచిక్కని వ్యవహారంగా మారింది. జన్మభూమి మొత్తం ప్రచార కార్యక్రమంగానే సాగుతోంది. చంద్రబాబు మొదలు మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ ప్రభుత్వ పథకాలపైనే ప్రసంగాలు చేస్తున్నారు. పథకాల లబ్దిదారులకు ఈ సభల్లోనే పంపిణీలు చేస్తున్నారు. వాస్తవానికి గ్రామాల్లో జన్మభూమి కమిటీలు ఎంపిక చేస్తేనే పేదలకు పథకాలు అమలు అవుతున్నాయి. ఓటేయలేదని వృద్ధులకు, వితంతులకు పింఛన్లు ఆపేశారు. ఈ ప్రచార పర్వం కూడా ఎన్నికల్లో ఓట్లు కోసం సాగుతోంది. ఏదేమైనా ప్రభుత్వం తరుపున చేపట్టిన ఈ కార్యక్రమం తెలుగుదేశానికి ఓట్ల కోసం చేపట్టిన కార్యక్రమంగా మారుతోంది.

సంక్షిప్తం

ఎంఇవో, హెచ్‌ఎమ్‌ల సీనియారిటీ లిస్ట్ పంపండి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిల్లా డిప్యూటీ విద్యాధికారుల పోస్టులను భర్తీ చేసేందుకు ఆ శాఖ కసరత్తు చేస్తోంది. మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుల(హెచ్‌ఎంల) సీనియారిటీ జాబితాలను సిద్ధం చేసి ఈనెల 8లోగా పంపాలని ఆర్‌జెడిలను, డిఇఒలను విద్యాశాఖ ఆదేశించింది. విద్యాశాఖ కమిషనర్‌కు వాటిని సమర్పించాలని డిఇఒలకు మెమో జారీ అయింది. జాబితాల్లో వ్యత్యాసాలుంటే డిఇఒలే బాధ్యులవుతారని హెచ్చరించింది. ఖాళీగా ఉన్న పోస్టులను ప్రమోషన్స్ ద్వారా గానీ, పూర్తి స్థాయి అదనపు బాధ్యతల్లో (ఎఫ్‌ఏసి)గాని నియమించేటప్పుడు సీనియార్టీ ప్రకారం అవకాశం ఇవ్వాలని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి బాబురెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

మౌజన్ హత్యకు నిరసనగా ర్యాలీలు

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ

రాజమహేంద్రవరం మసీదులోని మౌజన్ ఫరూక్ దారుణ హత్యకు నిరసనగా ఆవాజ్ నగర, రూరల్ కమిటీల ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరులో నిరసన ర్యాలీలు నిర్వహించారు. రూరల్ కమిటీ ఆధ్వర్యంలో గాంధీనగర్ సిపిఎం ఆఫీస్ సెంటర్ నుంచి డైకస్ రోడ్డు వరకు భారీ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్.ఎం బాషా మాట్లాడుతూ మసీదులో మౌజన్‌ను హత్య చేసి, పవిత్రమైన ఖురాన్‌ను తగులబెట్టడం దారుణమన్నారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హత్య చేసిన వారు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నగర కమిటీ ఆధ్వర్యంలో కొటమిట్ట షాదీ మంజిల్ నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం, వైసిపి, కాంగ్రెస్, జమైతే ఇస్లామి హింద్ మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ఎస్‌కె రియాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరపకుండా మణి అనే వ్యక్తిని ప్రవేశపెట్టి నేరస్తుడని చూపడం దారుణమన్నారు. మౌజన్ కుటుంబానికి రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు

ఇజ్రాయిల్ క్షిపణుల కొనుగోలు ఒప్పందం రద్దు

న్యూఢిల్లీ : ఇజ్రాయిల్ నుండి స్పైక్ క్షిపణులను కొనుగోలు ఒప్పందాన్ని భారత్ రద్దు రాఫెల్ సంస్థ బుధవారం ప్రకటించింది. 50కోట్ల డాలర్ల విలువైన ఈ ఒప్పందం కింద యుద్ధ ట్యాంక్ విధ్వంసక క్షిపణులైన 1600 స్పైక్ క్షిపణులను కొనుగోలు చేయడానికి గతంలో ఒప్పందం కుదిరింది. ఈ నిర్ణయాన్ని రక్షణ మంత్రిత్వ శాఖ ఇంతకుముందే తీసుకున్నప్పటికీ గత వారంలోనే కంపెనీకి లాంఛనంగా తెలియచేశారు. కాగా మరోవైపు ఉపరితలం నుండి గగనతలంలోకి ప్రయోగించి గల 131 బరాక్ క్షిపణులను ఇజ్రాయిల్ సంస్థ నుండి కొనుగోలు చేయడానికి 7కోట్ల డాలర్లతో భారత్ ఒప్పందాన్ని ఖరారు చేసింది. కాగా ఈ నిర్ణయం పట్ల రాఫెల్ విచారం వ్యక్తం చేసింది.

దళితాగ్రహం

మహారాష్ట్ర బంద్ సందర్భంగా థానే రైల్వే స్టేషన్‌లో రైళ్లను ఆపేసిన నిరసనకారులు



మీకు నూతన సంవత్సర వేడుకలేంటి?

తమిళనాడులో దళితులపై పెత్తందార్ల దాడి

చెన్నై : దళితులపై దాడికి నిరసనగా ఒకపక్క మహారాష్ట్ర మండుతోంది. మరోవైపు తమిళనాడులో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నందుకు దళితులపై పెత్తందార్లు దాడికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. దళితుల ఇళ్లను ధ్వంసం చేయడంతో పాటు, పలువురిని తీవ్రంగా కొట్టారు. తంజావూర్ జిల్లా కుడికాడులో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా భారీగా పోలీసులను మోహరించారు.

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని అంబాలపట్టు దక్షిణ గ్రామంలో దళిత యువకులు కొందరు మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేసుకున్నారు. లైట్లతో ఆ ప్రాంతాన్ని అలంకరించుకున్నారు. వారి ఉత్సవాలకు గుర్తుగా గ్రామ ప్రవేశద్వారానికి బెలూన్లు, రంగు కాగితాలు కట్టారు. వారి ఆనందం హద్దులు దాటింది. ఒంటి గంట సమయంలో ఈ వేడుకలు తారా స్థాయికి చేరాయి. ఆ సమయంలో అంబలపట్టు ఉత్తర గ్రామానికి చెందిన అగ్రకులాలవారు దాడికి దిగారు. గ్రామ ప్రవేశద్వారం దళితుల అలంకరణలను చిందరవందర చేశారు. దీనిని దళిత యువకులు ప్రశ్నించగా, వారిపై దాడికి తెగబడ్డారు. వారిని తీవ్రంగా కొట్టడం ప్రారంభించారు. భయంతో వారంతా ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పరుగులు పెట్టారు. వారంతా పారిపోవడంతో దళితుల ఇండ్లపై దాడి చేశారు. దాదాపు 15 ఇండ్లను ధ్వంసం చేశారు. ఈ దాడిలో ఎనిమిదిమందికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదుమేరకు తంజావూర్ పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

'మహో'బంద్ సంపూర్ణం

- దళితాగ్రహంతో స్థంభించిన మహారాష్ట్ర

దళితుల ఆగ్రహిస్తే ఎలా ఉంటుందో.. బిజెపి పాలిత మహారాష్ట్ర కళ్లారా చూసింది. భీమా కోరేగావ్‌లో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వ నీడన పెట్టిన చిచ్చుకు వ్యతిరేకంగా దళితులంతా ఏకమవ్వటంతో నిరసన జ్వాల ఉవ్వెత్తున ఎగిసిపడింది. చిన్నా, పెద్దా అనే తేడాలేకుండా దళిత యువకులంతా రోడ్డుకెక్కారు. గల్లీ నుంచి మొదలుకుని ముంబయి మహానగరం సైతం నిలిచిపోయింది. ఔరంగాబాద్‌లో ఇంటర్నెట్ సేవల్ని ప్రభుత్వం నిలిపివేసింది. గతంలో ఎన్నడూలేని విధంగా శాంతి భద్రతలకోసం భారీ సంఖ్యలో బలగాలను మోహరించారు. బుధవారం తామిచ్చిన బంద్ విజయవంతమైందని అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ ప్రకటించారు.

ముంబయి : ఉరుకులు, పరుగులతో రద్దీగా ఉండే మహారాష్ట్ర ఒక్కసారిగా స్థంభించిపోయింది. భీమా కోరేగావ్ పోరాటానికి 200 ఏండ్లు పూర్తయిన సందర్భంగా దళితులు నిర్వహించిన కార్యక్రమంపై బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకగణం వెనకుండి నడిపిన హింసకు నిరసనగా బిఆర్ అంబేద్కర్ మనవడు, భరిప బహుజన్ మహాసంగ్ నాయకుడు ప్రకాశ్ అంబేద్కర్, పలు దళిత సంఘాలు బుధవారం బంద్‌కు పిలుపునిచ్చాయి. మహారాష్ట్ర డెమోక్రటిక్ ఫ్రంట్, మహారాష్ట్ర లెఫ్ట్ ఫ్రంట్, దాదాపు 250 ప్రజా సంఘాలు సమ్మెకు మద్దతు తెలిపాయి. మహారాష్ట్ర సర్కారు ముందస్తుగా 144 సెక్షన్ విధించినా దళితాగ్రహం ముందు అవేమీ కనిపించలేదు. థానేలో ఈస్టర్న్ ఎక్స్‌ప్రెస్ వే వద్ద పోలీసు భారీగా రంగంలోకి దిగారు. రైళ్లను ఆపకుండా నడపాలని రైల్వే అధికారులు ఎంతగా ప్రయత్నిం చినా.. సాధ్యం కాలేదు. రైల్వేట్రాక్‌లపై దళిత యువకులంతా జెండాలు పట్టుకుని, నినాదాలు చేస్తూ రైళ్లను కదలనీయలేదు. ముంబయిలోని ఛత్రపతి శివాజీ టెర్మినల్ ద్వారా రోజూ భారీ సంఖ్యలో ప్రయాణికులు ఉపాధిబాట పడతారు. కానీ బంద్‌తో ఒక్క రైలూ బయటకు రాలేదు. అలానే ముంబయితో సహా మహారాష్ట్రలోని మహాదారులన్నీ బోసిపోయాయి. ప్రభుత్వం స్కూళ్లు, కాలేజీలు మూసేశారు. ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలన్నీ మూతపడ్డాయి. అప్రమత్తమైన ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి అధికారులు పలుచోట్ల నిరసనకారులను చెదరగొట్టారు. చిత్ర, బుల్లితెర పరిశ్రమ సైతం నిలిచిపోయింది. అన్ని షూటింగ్‌లను నిలిపివేశారు. ముంబయిలో తొమ్మిదిమందిపై కేసులు నమోదుకాగా, దాదాపు 100 మంది నిరసన కారులను పోలీసులు అరెస్టు చేశారు.

నాసిక్‌లో బంద్ సంపూర్ణంగా స్వచ్ఛందంగా జరిగింది. నగరంలో వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు మూతపడ్డాయి. బస్సులు, ఆటోలు నిలిచిపోయాయి. దళితులు బలంగా ఉన్న బీడ్, లాతూర్, షోలాపూర్, అహ్మద్ నగర్, నాసిక్ ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగాయి. ఔరంగాబాద్‌లో మంగళవారం పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టిన ఘటనలు చోటుచేసుకోగా.. బుధవారం ఇక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇంటర్నెట్ సేవల్ని ప్రభుత్వం పూర్తిగా నిలిపేసింది. పోలీసులు రెచ్చగొట్టడంతో..పలు ప్రాంతాల్లో ఆగ్రహానికి గురైన నిరసనకారులు బస్సులపై రాళ్లు విసిరారు.

హింసకు పాల్పడింది సంఘ్ పరివారమే : జిగ్నేశ్

పూణె జిల్లాలో దళితులపై దాడులకు పాల్పడింది ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ మద్దతుదారులేనని గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మెవానీ ఆరోపించారు. 'బ్రాహ్మనిజం అత్యంత తీవ్రరూపంలో ఉన్న ఆధునిక పేష్వాలు ఈ సంస్థలు. మా పూర్వీకులు 200 ఏండ్ల క్రితం పేష్వాలకు వ్యతిరేకంగా పోరాడారు. ఈ తరం దళితులు ఇప్పుడు ఆధునిక పేష్వాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. దళిత వాదానికి భయపడే పెత్తందార్లే దాడులకు తెగబడుతున్నారు' అని జిగ్నేశ్ మెవానీ ఆరోపించారు.

ఢిల్లీని తాకిన మహా సెగలు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

మహారాష్ట్రలో దళితుల నిరసన సెగ దేశ రాజధానిని తాకింది. దళిత్ సోషణ్ ముక్తి మంచ్ (డిఎస్‌ఎంఎం) బహుజన్ కమ్యూనిస్టు పార్టీతో పాటు ఇతర దళిత సంఘాల ఆధ్వర్యంలో వందలాది మంది ఢిల్లీలో కస్తూరిబాగాంధీ మార్గ్‌లోని మహారాష్ట్ర భవన్ వద్ద నిరసన ప్రదర్శన చేశారు. పూణెలో దళితుల ప్రదర్శనపై దాడికి తెగబడిన కాషాయ కూటమికి వ్యతిరేకంగా నిరసనకారులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు, పూణె జిల్లా అధికారులకు మితవాద శక్తులకు కొమ్ముకాస్తున్నారంటూ ఆరోపించారు. దళితులపై దాడి ముందస్తు ప్రణాళిక ప్రకారం జరిగిందేనని విమర్శించారు. మహారాష్ట్ర భవన్ వద్ద జరిగిన సభలో దళిత్ సోషణ్ ముక్తి మంచ్ నేత రాంపాల్, బహుజన్ కమ్యూనిస్టు పార్టీ నేత నియోగి ప్రసంగించారు. హింసాత్మక చర్యలకు కారకులైన కాషాయ మూకలను అరెస్టు చేయాలని, ఎస్సీ, ఎస్టీ చట్టం 2015కింద నిందితులపై కేసు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అరెస్టు చేసిన అమాయక దళితులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

కోరేగావ్ ప్రకంపనలు

మొదటి పేజీ తరువాయి

జరిగిన దాడిని ఖండిస్తూ ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. లోక్‌సభలో ఈ అంశంపై చర్చ జరగాలని పట్టుపట్టినా... ప్రభుత్వం అంగీకరించక పోవడంతో ప్రతిపక్ష సభ్యులు ఒక్కసారిగా లేచి నినాదాలు చేశారు. ప్రశ్నోత్తరాలు ముగిసిన తరువాత చర్చకు అవకాశమిస్తానని స్పీకర్ సుమిత్రా మహాజన్ హామీయివ్వడంతో ప్రతిపక్ష సభ్యులు ఆందోళన విరమించారు. ప్రశ్నోత్తరాలు ముగిసిన అనంతరం భీమ్-కోరేగావ్ ఘటనపై కాంగ్రెస్, సిపిఎం, తదితర ప్రతిపక్ష పార్టీలు ఇచ్చిన వాయిదా తీర్మానాలను తిరస్కరిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. స్పీకర్ తీరుపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దేశంలో దళితులపై దాడులు జరుగుతుంటే చలనం లేదని, దళితుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ప్రతిపక్ష సభ్యులు తమ స్థానాల నుండి నిరసన తెలపడంతో లోక్‌సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడేందుకు స్పీకర్ అవకాశమిచ్చారు.


మోడీ మౌనం వీడాలి : ఖర్గే



తొలుత కాంగ్రెస్ పక్షనేత మల్లికార్జున ఖర్గే ఈ అంశాన్నిలేవనెత్తుతూ.. మహారాష్ట్రలో హింస ప్రజ్వరిల్లినా ప్రధాని మౌనంగా ఉండటం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. ఈ అల్లర్ల వెనుక ఆరె స్సెస్, హిందుత్వ శక్తులున్నాయని, మహారాష్ట్రలో దళితులు, మరాఠాల మధ్య చిచ్చు పెట్టేందుకు వారు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈవ్యాఖ్యలపై బిజెపి సభ్యులు అభ్యంతరం చెబుతుండటంతో ఆగ్రహించిన ఖర్గే తన చేతిలోని పత్రాలను చించివేశారు. దళితులకు సంబంధించిన అంశాలపై ప్రధాని మోడీ నిత్యం మౌనం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. బిజెపి అధికారంలో ఉన్న గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో దళితులపై హింసా కాండ సాగిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తినప్పుడల్లా ప్రధాని మోడీ ఎందుకు మౌనం వహిస్తున్నా రని ప్రశ్నించారు. మోడీని "మౌని బాబా"గా అభివర్ణించిన ఖర్గే, మహారాష్ట్ర హింసపై ఇకనైనా ప్రధాని నోరు విప్పాలని డిమాండ్ చేశారు.

కాగా, రాజ్యసభలోనూ భీమ్-కోరేగావ్ ఘటనపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్రస్థాయిలో మాటల జరిగింది. దీంతో సభ వరుసగా వాయిదా పడుతూ వచ్చింది. సభ ప్రారంభం నుండి ఆందోళనలతో అట్టుడుకింది. జీరో అవర్‌లోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. సభలో పరిస్థితి ఇలాగే ఉండడంతో ఛైర్మన్ వెంకయ్యనాయుడు రాజ్యసభ ప్రసారాలను నిలిపేశారు.

బ్రిటీష్ అడుగుజాడల్లో బిజెపి : గులాం నబీ ఆజాద్



విభజించి పాలించడమనే బ్రిటిష్ పాలకులు విధానాన్ని బిజెపి తూచా తప్పకుండా పాటిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ ఎద్దేవా చేశారు. బ్రిటిష్ పాలకుల ఏకలవ్య శిష్యరికం బిజెపి దేనంటూ తప్పుపట్టారు. విభజించి పాలించడమే భారతీయ జనతా పార్టీ నిరంతర ఎజెండా అని అన్నారు. "బిజెపి ప్రతిపక్షంలో ఉన్నా కుల, మతాలను రెచ్చగొడుతుంటుంది. అధికారంలోకి వచ్చినా దేశాన్ని కుల, మత ప్రాతిపదికగా విభజిస్తుంటుంది. బ్రిటీష్ పాలకుల నుంచి విభజించు-పాలించు అనే సిద్ధాంతాన్ని బిజెపి ఒంటపట్టించుకుంది" అని ధ్వజమెత్తారు. మోడీ సారథ్యంలోని బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై అకత్యాలు పెరిగిపోయాయని ఆయన ఆరోపించారు. "గత మూడున్నరేళ్ళుగా దళితులపై అఘాయిత్యాలు పెరిగిపోయాయి. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఈ ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. అక్కడ దళితుల అణిచివేత, హత్యలు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి" అని ఆయన అన్నారు.

వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో 10 శాతం పెట్టుబడులు ఉపసంహారణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో 10శాతం పెట్టుబడులు ఉపసంహారణ ప్రతిపాదనకు ఆర్థిక వ్యవహారాల కేబినేట్ కమిటీ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి విష్ణు దేవ సాయి వెల్లడించారు. బుధవారం రాజ్యసభలో వైసిపి సభ్యుడు వి.విజయసాయి రెడ్డి వేసిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహారణ విధానాన్ని అనుసరించి రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్‌లో ప్రభుత్వానికి ఉన్న 100శాతం వాటాలో 10శాతాన్ని పబ్లిక్ ఇష్యూ (ఐపిఓ) ద్వారా విక్రయించడం జరుగుతుందన్నారు. విశాఖ ఉక్కు నష్టాలకు ప్రతికూల మార్కెట్ పరిస్థితులు, ఉక్కు ఉత్పాదనలు అమ్మకాల్లో క్షీణత, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన బొగ్గు ధరలు, అంతర్జాతీయంగా ఉక్కు పరిశ్రమలో ఏర్పడిన మాంద్యం ప్రధాన కారణాలని మంత్రి వివరించారు. నియంత్రణ ఎత్తి వేసిన రంగాలలో ఉక్కు ఉత్పాదనా రంగం ఒకటని, అందువల్ల ఇందులో ప్రభుత్వం పాత్ర సంధాన కర్తకే పరిమితం అయ్యిందని అన్నారు. ఈ నేపథ్యంలో దేశీయ ఉక్కు పరిశ్రమను పరిరక్షించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. ఉక్కు దిగుమతులపై యాంటీ డంపింగ్ డ్యూటీ విధించడం, ఉక్కు దిగుమతులకు కనీస ధరను నిర్ణయించడం, క్వాలిటీ కంట్రోల్ చర్యల ద్వారా ఉక్కు ఉత్పాదనలు, దిగుమతులు బిఐఎస్ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా నిబంధనలు విధించడం, ప్రభుత్వం వినియోగం కోసం కొనుగోలు చేసే ఉక్కు ఉత్పాదనలన్నింటిని తప్పని సరిగా దేశీయ ఉక్కు పరిశ్రమల నుంచి మాత్రమే సేకరించే విధానాన్ని ప్రకటించడం వంటి పలు చర్యలను ప్రభుత్వం చేపట్టిందని మంత్రి వివరించారు.

'తాజ్' సందర్శనపై ఆంక్షలు

న్యూఢిల్లీ: ప్రపంచంలోని ఏడు వింతల్లో ఒకటైన తాజ్‌మహల్ సందర్శనపై ఆంక్షలు విధించారు. ఇక నుంచి రోజుకు 40 వేల మంది స్వదేశీయులను మాత్రమే అనుమతించనున్నారు. విదేశీ యాత్రికుల విషయంలో ఎలాంటి ఆంక్షలూ లేవు. ఈ మేరకు ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ), పార్లమెంటరీ, ఇతర ఉన్నతాధికారులు మంగళవారం సమావేశమై నిర్ణయం తీసుకున్నారు. అధికారులు తీసుకున్న ఈ నిర్ణయాన్ని సమావేశం ముగిసిన తర్వాత కేంద్ర పర్యాటక శాఖ మంత్రి మహేశ్ శర్మకు తెలియజేశారు.

హిందూ పండుగలకూ మూసేయాలి

మదర్సాలకు యూపీ ప్రభుత్వం ఆదేశాలు

రంజాన్ సెలవుల్లో కోత పెట్టిన వైనం

లక్నో: హిందూ పండుగల రోజున మదర్సాలను మూసేయాల్సిందేనని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అంతేకాక.. రంజాన్, ఈదుల్ జుహాలాంటి ముస్లిం పర్వదినాలకు ఇస్తున్న ఐచ్ఛిక సెలవుల్లో కోత పెట్టడం గమనార్హం. ఇప్పటివరకు మదర్సాలు అన్ని ముస్లిం పండుగులకు, హోళి, అంబేద్కర్ జయంతికి సెలవులు ఇస్తున్నాయి. కాగా.. వీటికి అదనంగా ఏడు పండుగలకు(బుద్ధపూర్ణిమ, రక్షాబంధన్, మహానవమి, మహవీర్ జయంతి, దీపావళి, దసరా, క్రిస్మస్) మదర్సాలు సెలవు దినాలుగా పాటించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. రంజాన్, ఈదుల్ జుహా, తదితర ముస్లిం పండుగలకు ఇస్తున్న 10 ఐచ్ఛిక సెలవులను నాలుగుకు కుదించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హిందూ పండుగల రోజున మదర్సాలు మూసివేయాలని చెప్పడంలో అభ్యంతరం లేదని, కానీ, ముస్లిం పర్వదినాల కోసం ఉద్దేశించిన సెలవుల్లో కోత పెట్టడం సరికాదని ఇస్లామిక్ మదర్సా మోడర్నైజేషన్ టీచర్స్ అసోసియేషన్ చీఫ్ ఈజాజ్ అహ్మద్ విమర్శించారు.

రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదాలు


19 మంది మృతి, 18 మందికి గాయాలు

జైపూర్: రాజస్థాన్‌లో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 19 మంది మృతిచెందారు. కాగా మరో 18 మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..11వ నెంబర్ జాతీయ రహదారిపై రాజస్థాన్ పబ్లిక్ ట్రాన్స్‌ఫోర్ట్ సర్వీస్ (ఆర్‌పిటీఎస్) బస్సు డ్రైవర్ మరో బస్సును ఓవర్‌టెక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొన్న ఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 11 మంది మృతిచెందారు. మరో 12 మంది గాయపడ్డారు. జైపూర్ జిల్లా రెన్వాల్‌లో జరిగిన మరో ప్రాంతంలో టెంపో, ట్రక్కు ఢీకొన్న ఘటనలో 8 మంది చనిపోయారు.

దళితులపై దాడులకు వ్యతిరేకంగా దేశవ్యాపిత ప్రదర్శనలు

- ప్రజాసంఘాల పిలుపు





ఇండియా న్యూస్‌నెట్‌వర్క్, న్యూఢిల్లీ:

మహారాష్ట్రలోని పుణేలో చారిత్రాత్మక భీమా-కొరేగావ్ పోరాటం ద్విశత వార్షికోత్సవ సందర్భంగా మతోన్మాద శక్తులు దళితులపై దాడి చేసి ఒక యువకుడిని హత్య చేయటాన్ని ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. దళితులపై జరుగుతున్న ఈ దాడులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం), తదితర సంఘాలు నేతలు సంయుక్త ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలందరూ తమ పిలుపునకు మద్దతునివ్వాలని విజ్ఞప్తి చేశారు. ముందస్తు ప్రణాళిక ప్రకారమే కోరేగావ్‌లో దళితులపై దాడి చేశారని అని విమర్శించారు. ఈ దాడికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు కొద్ది రోజుల ముందు నుండే కొంతమంది మరాఠా నేతలు ఈ ప్రాంతంలో విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారని వారు ఆరోపిం చారు. ఈ నేపథ్యంలో ఈ దాడికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించటంతో పాటు ఈ ప్రాంతంలో దళతులకు తగిన భద్రత కల్పించాలని తాము కోరుతున్నామన్నారు. మహారాష్ట్రతో సహా బిజెపి పాలిత అనేక రాష్ట్రాలలో కుల దురహంకారం, సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం ఇటీవలి కాలంలో దళితులపై దాడులు పెరిగిపోవటం ఆందోళనకరమని వారు పేర్కొన్నారు. దళితులపై జరిగిన ఈ హింసాకాండను ఖండిస్తూ దేశంలోని అన్ని ప్రాంతాలలో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని ప్రగతిశీల, ప్రజాతంత్ర శక్తులను కోరుతున్నామన్నారు. ఈ ప్రకటనపై భారిపా బహుజన్ మహాసంఘర్ష్ అధ్యక్షుడు ప్రకాశ్ అంబేద్కర్, దళిత శోషన్ ముక్తి మంచ్ కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితర నేతలు సంతకాలు చేశారు.

ఉద్యోగం ఉండేనా..? ఊడేనా ?

- అగమ్యగోచరంగా ప్రవాస భారతీయుల భవిత
- అమెరికా వర్క్ వీసా సవరణలతో ఆందోళన

వాషింగ్టన్ : భారత ప్రధాని మోడీ చేసిన అమెరికా పర్యటనలు, ట్రంప్ సార్‌తో దోస్తానా...ఇవేమీ అక్కడి మనవాళ్ల ఉద్యోగాల్ని కాపాడలేకపోతున్నాయి. వర్క్ వీసా నిబంధనల్లో మార్పుపై భారత ప్రభుత్వం వ్యక్తం చేసిన ఆందోళనను ట్రంప్ సర్కార్ ఏమాత్రమూ పట్టించుకున్నట్టు లేదు. వర్క్ వీసా చట్టాన్ని సవరించే పనిని వేగిరం చేయాలని ట్రంప్ సర్కార్ తాజాగా ఆదేశించింది. దీంతో ఆయన చేసిన సూచనలను పరిగణలోకి తీసుకొని, చట్టాన్ని సవరిస్తూ 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్' (డీహెచ్ఎస్) ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కొత్త చట్టాన్ని తీసుకురావటం కోసం డీహెచ్ఎస్ విభాగం అధిపతులు కసరత్తు చేస్తున్నారు. ఈ నిర్ణయం అమెరికా ఐటీ రంగంలో పనిచేస్తున్న దాదాపు 5 లక్షలకు పైగా భారతీయ ఉద్యోగస్తులకు శరాఘాతంగా మారింది. వర్క్ వీసా నిబంధనల్లో మార్పు అమెరికాలోని భారతీయ ఉద్యోగస్తుల్ని తీవ్రంగా ఆందోళనకు గురిచేస్తున్నది. అధ్యక్ష పదవిలోకి డొనాల్డ్ ట్రంప్ రాకతోనే భారతీయ యువతలో అమెరికా ఉద్యోగాలపై ఆశలు పోయాయి. ఇప్పుడు అక్కడున్న ఉద్యోగాలు సైతం ఊడగొట్టే పనిని అమెరికా అధ్యక్షుడు చేపట్టడం, సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్న దాదాపు లక్షలాది మంది భారతీయు ఉద్యోగుల ఆశలపై ట్రంప్ నీళ్లుజల్లారు.

నేడు లాలూకు శిక్ష ఖరారు



రాంచి : పశుదాణా కుంభకోణం కేసులో దోషిగా తేలిన బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ శిక్ష ఖరారు గురువారానికి వాయిదా పడింది. లాలూతో పాటు ఈ కుంభకోణంలో దోషిగా తేలిన 15 మందికి కూడా గురువారం శిక్ష ఖరారు చేయనున్నట్టు సీబీఐ ప్రత్యేక కోర్టు పేర్కొంది. దాణా కుంభకోణం రెండో కేసులో వీరందరినిడిసెంబర్ 23న దోషులుగా తేలుస్తూ సీబీఐ స్పెషల్ కోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. దోషిగా తేలిన తర్వాత లాలూ ప్రసాద్‌ను అరెస్టుచేసిన పోలీసులు రాంచిలోని బిర్సాముండ్రా సెంట్రల్ జైలులో ఉంచారు.

పెరూలో బస్సు ప్రమాదం : 48మంది మృతి

లిమా: పెరూలో ఘోర బస్సు ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 48 మంది మృతి చెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... పెరూ రాజధాని లిమాకు 57 మందితో ప్రయాణిస్తున్న బస్సు, ఎదురుగా వచ్చిన లారీ ఢీకొన్నాయి. దీంతో, బస్సు ఒక్కసారిగా 100 మీటర్ల లోతులో ఉన్న లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 48 మంది మృతి చెందారు. ప్రమాదం జరిగిన పసమాయో ప్రాంతం చాలా ప్రమాదకరమైన కొండ అంచు ఇరుకైన రోడ్డు కావడంతో ఈ హైవేను డెవిల్ కర్వ్ అని పిలుస్తారు. మృతదేహాలను బయటకు తీసేందుకు సహాయక సిబ్బంది తీవ్రంగా శ్రమించారని అధికారులు వెల్లడించారు.

రాజ్యసభలో 'ట్రిపుల్ తలాక్'

- సెలెక్ట్ కమిటీ పంపాలి: ప్రతిపక్షం పట్టు
- తిరస్కరించిన అధికార పక్షం
- నేడు మళ్లీ చర్చ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మూడుసార్లు తలాక్ చెప్పి భార్యకు విడాకులు ఇవ్వడాన్ని నేరంగా పరిగణించే బిల్లు బుధవారం రాజ్యసభ ముందుకు వచ్చింది. ఈ బిల్లును కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సభలో ప్రవేశపెట్టారు. దీనిపై చర్చ సందర్భంగా సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. అయితే ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించలేమని అధికార పక్షం తేల్చి చెప్పింది. దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరగడంతో డిప్యూటీ ఛైర్మన్ కురియన్ సభను రేపటికి వాయిదా వేశారు. గురువారం మళ్లీ ట్రిపుల్ తలాక్ బిల్లుపై చర్చ జరగనుంది.

ట్రిపుల్ తలాక్ బిల్లుకు తాము వ్యతిరేకం కాదని కాంగ్రెస్, తణమూల్ కాంగ్రెస్, సిపిఎం, ఇతర ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. అయితే దీన్ని మరింత బలోపేతం చేసేందుకు, కొన్ని ప్రతికూలాంశాలను తొలగించేందుకు సెలెక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేస్తున్నట్లు ప్రతిపక్ష నేతలు తెలిపారు. మహిళల హక్కులకు సభ కట్టుబడి ఉందని కాంగ్రెస్ నేత ఆనంద్ శర్మ అన్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లుకు తాము వ్యతిరేకం కాదన్న ఆయన దీన్ని సెలెక్ట్ కమిటీకి పంపాలని కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టారు. 14 పార్టీలు నుంచి 16 మంది ఎంపిలు, ఒక నామినేటేడ్ ఎంపితో కలిసి 17 మంది సెలెక్ట్ కమిటీ సభ్యుల పేర్లను ఆయన చదివి విన్పించడంపై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తీవ్ర అభ్యంతరం తెలిపారు. ప్రతిపక్షం నిబంధనల్ని పాటించడం లేదని మండిపడ్డారు. తీర్మానం ప్రవేశపెట్టాలంటే కనీసం 24 గంటల ముందు నోటీసు ఇవ్వాలన్నారు. ఈ బిల్లు పట్ల కాంగ్రెస్ లోక్‌సభలో ఒకలా, రాజ్యసభలో మరోలా వ్యవహరిస్తున్న తీరును దేశం గమనిస్తోందన్నారు. ట్రిపుల్ తలాక్ అంశంపై న్యాయ స్థానంలో ముస్లిం పర్సనల్ లా బోర్డు తరపున న్యాయవాదిగా ఉన్న కపిల్ సిబల్‌కు రాజ్యసభలో మాట్లాడే నైతిక హక్కు లేదని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు.

ప్రత్యేకం

ప్రజల తీర్పును వమ్ముచేశారు

- వ్య. సంక్షోభం, నిరుద్యోగం పరిష్కారం కాలేదు
- కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా



న్యూఢిల్లీ: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో 2014లో దేశంలోమార్పు కోరుతూ ప్రజలిచ్చిన తీర్పు వమ్ము అయిందన్న భావన కలుగుతోందని కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా నిర్వేదం వ్యక్తం చేశారు. దేశం ఎదుర్కొంటున్న వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగ సమస్యలు రానున్న ఒక్క బడ్జెట్‌లో పరిష్కరించలేరని ఆయన ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. మరో నెలరోజుల్లో మోడీ సర్కారు పూర్తి స్థాయి బడ్జెట్ సమర్పించనున్న నేపథ్యంలో గతంలో రెండు సార్లు ఆర్థిక శాఖ బాధ్యతలు నిర్వహించిన యశ్వంత్ సిన్హా వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకు న్నాయి. గత ఎన్నికల్లో భారీ వాగ్దానాలతో అధికారం చేపట్టిన ప్రస్తుత ప్రభుత్వానికి కేవలం కొద్దిపాటి గడువు మాత్రమే వుందన్నారు. మోడీ ప్రభుత్వం ఆర్థిక రంగంలో పూర్తిగా విఫలమైందని ఆయన ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు. వ్యవసాయ రంగం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలకు సంబంధించి ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రావటానికి ముందు అనేక హామీలిచ్చిందని, వాటి అమలుకు లక్ష్యాలను కూడా నిర్దేశించుకున్నదని గుర్తు చేశారు. ఈ లక్ష్య సాధనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నది తన నిశ్చితాభిప్రాయమన్నారు. వాస్తవానికి మన దేశ ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలో వుందని ఆయన చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన విధానాలతో ఉద్యోగావకాశాలకు గండిపడిందన్నారు. వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి), దానికి ముందు చేపట్టిన పెద్ద నోట్ల రద్దు వంటి అంశాలను పరిశీలిస్తే ప్రభుత్వం చెబుతున్న గణాంకాలకు వాస్తవ ఫలితా లకు సంబంధం లేదన్న విషయం అర్థమవు తుందన్నారు. కేవలం సంఘటిత రంగంలో మాత్రమే కాక అసంఘటిత రంగంలో కూడా ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని యశ్వంత్ సిన్హా చెప్పారు. ఈ రెండు రంగాల వైఫల్య ప్రభావం మధ్య, చిన్నతరహా పరిశ్రమల రంగం (ఎంఎస్ఎంఇ)పై తీవ్రంగా పడిందన్నారు. తన పాలనలో అద్భుత ప్రగతి సాధించామంటూ గుజరాత్ గురించి చెప్పే విషయాలను ఆయన ప్రస్తావిస్తూ మోడీ ప్రభుత్వ విధానాలతో ఏర్పడిన నష్టం భర్తీ చేయలేనిదన్నారు. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలుతో రైతాంగానికి ఏర్పడిన నష్టం ఎవరూ తీర్చలేనిదన్నారు. తమ వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు లభించని దుర్భర పరిస్థితుల్లో రైతులు వాటిని అయినకాడికి తెగనమ్ముకుంటూ నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారన్నారు. కొన్ని ప్రాంతాలలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు 30 నుండి 35 శాతం మేర పడిపోయాయని ఆయన చెప్పారు. కార్చిచ్చులా విస్తరించిన ఈ వ్యవసాయ సంక్షోభం దెబ్బతోనే ఇటీవలి గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో సౌరాష్ట్ర ప్రాంతంలో బిజెపి తుడిచిపెట్టుకుపోయిం దని తాను భావిస్తున్నానన్నారు. వ్యవసాయ సంక్షోభం ఇప్పుడు దేశం మొత్తాన్ని చుట్టుముట్టిందని అందువల్లే రాజస్తాన్, మధ్యప్రదేశ్, తదితర రాష్ట్రాల్లో రైతులు ఆందోళన బాట పట్టారని వివరించారు. ప్రధాని తమ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను ఆయన ప్రస్తావిస్తూ రైతులకు ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి ధరలు నిర్ణయిస్తామని మోడీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం రైతులు డిమాండ్ చేస్తున్నది కూడా ఇదేనన్నారు. ప్రస్తుతం రైతు గాలి పీలుస్తూ బతుకునీడుస్తున్నాడని, వాస్తవానికి వ్యవసాయం గుదిబండలా మారుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార పంటలు మాత్రమే కాక వాణిజ్య పంటల పరిస్థితి కూడా నానాటికీ దిగజారుతోందని, ఖర్చు పెరిగి రాబడి తగ్గుతోందని ఆయన వివరించారు. వ్యవసాయంపై పెట్టుబడి కోసం అప్పులు చేస్తున్న రైతు రుణభారంతో చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడన్నారు. పదేళ్ల క్రితం పరిస్థితి ఇంత తీవ్రంగా లేదని, గత మూడు, నాలుగేళ్ల నుండి ఇది మరింత పెరిగిందని ఆయన చెప్పారు.

సంక్షిప్తం

రాజ్యసభకు సంజయ్, సుశీల్, ఎన్‌డి గుప్తా : ఆప్

న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) బుధవారం రాజ్యసభకు ముగ్గురు సభ్యులను నామినేట్ చేశారు. సంజయ్ సింగ్, సుశీల్ గుప్తా, ఎన్‌డి గుప్తాలను తమ రాజ్యసభ నామినీలుగా ఆప్ ప్రకటించింది. రాజ్యసభకు ఈ నెల 16న ఎన్నికలు జరగనున్నాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రివాల్ నివాసంలో జరిగిన ఒక సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి పార్టీకి చెందిన 56 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సమావేశం ముగిసిన వెంటనే పార్టీ అత్యున్నత నిర్ణయాక రాజకీయ వ్యవహారాల కమిటి (పిఎసి) సమావేశమై ముగ్గురు సభ్యుల నామినేట్ నిర్ణయాన్ని అధికారికంగా ఆమోదించింది.

కాశ్మీర్‌లో 10 వేల మంది ఎస్‌పిఓస్‌ల నియామకం

శ్రీనగర్ : జమ్ము కశ్మీర్‌లో గత రెండు సంవత్సరాల్లో 10,758 ప్రత్యేక పోలీస్ అధికారుల(ఎస్‌పిఓస్)ను నియమించినట్లు ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ బుధవారం పేర్కొన్నారు. లోయలోని ఉగ్రవాద ప్రభావిత జిల్లాల నుండి సుమారు 83 శాతం నియామకాలను చేసినట్లు తెలిపారు. వీరిలో 8,992 మందిని కశ్మీర్ జోన్, 1,457 మందిని జమ్ము జోన్‌లో నియమించినట్లు ఆమె అసెంబ్లీలో పేర్కొన్నారు.

ఆరేళ్లుగా రిటర్న్ దాఖలు చేయని ఎన్జీవోలు 10 వేలు

న్యూఢిల్లీ : సుమారు 10 వేలకు పైగా ప్రభుత్వేతర సంస్థలు(ఎన్జీవోలు) గత ఆరు సంవత్సరాల నుండి వాటి వార్షిక ఆదాయ, వ్యయాల అంచనాలను దాఖలు చేయలేదని కేంద్ర సహాయక మంత్రి కిరణ్ రిజిజు బుధవారం రాజ్యసభలో వెల్లడించారు. 2010-11నుండి 2015-16 వరకు వరుసగా ఆరుసంవత్సరాల పాటు అవి వార్షిక ఆదాయం వివరలు వెల్లడించలేదని ఓ ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానంగా తెలియజేశారు. విదేశీ కాంట్రీబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ 2010 ప్రకారం, ఖచ్చితంగా ఎన్జీవోలు వార్షిక ఆదాయ వివరాలను దాఖలు చేయడం తప్పని సరి.

క్యూబాలో కనిష్ట స్థాయికి చేరిన శిశుమరణాలు

హవానా : క్యూబా తన వైద్య చరిత్రలో తొలిసారిగా నవజాత శిశుమరణాలను అత్యంత కనిష్ట స్థాయికి చేర్చి రికార్డులకెక్కింది. క్యూబాలో నవజాత శిశుమరణాలు గత పదేళ్లుగా ఇదే స్థాయిలో కొనసాగుతుండటం గమ నార్హం. ఈ ఏడాది ఈ సంఖ్య మరింత కనిష్ట స్థాయికి చేరి వెయ్యి మంది నవజాత శిశువుల్లో నలుగురు మా త్రమే మరణించారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 1970లో ఈ దేశంలో నవజాత శిశుమరణాల రేటు వెయ్యికి 38.7 వంతున నమోదయింది. మెడికల్ రికార్డ్స్ అండ్ హెల్త్ స్టాటిస్టిక్స్ విడుదల చేసిన గణాం కాల ప్రకారం 2017లో దేశంలో 1,14,980 మంది జన్మించగా వారిలో 465 మంది మాత్రమే మరణిం చారు. ఇది అంతకు ముందు సంవత్సరం కన్నా 32 తక్కువ.

తుఫాన్ బీభత్సం



బ్రిటన్‌లోని అనేకప్రాంతాలలో తీవ్ర బీభత్సం సృష్టిస్తూ, ప్రజా జీవనాన్ని కల్లోలపరుస్తున్న ఎలినార్ తుఫాన్

బ్రిటన్‌ను కుదిపేస్తున్న ఎలీనార్ తుపాన్

స్కాట్లండ్ : వేల్స్, ఇంగ్లాండ్, ఉత్తర ఐర్లండ్, దక్షిణ స్కాట్లండ్‌లోని కొన్ని ప్రాంతాలలో కొనసాగుతున్న ఎలీనార్ తుపాను ఆ ప్రాంతాలలో తీవ్ర విధ్వంసం సృష్టించింది. గంటకు దాదాపు 100 మైళ్ల వేగంతో వీచిన గాలుల ధాటికి విద్యుత్ వ్యవస్థ కుప్పకూలిపోవటంతో అనేక ఇళ్లు, భవనాలు చీకట్లో మగ్గుతున్నాయి. వేల్స్‌లోని గ్లామర్గాన్‌లో ఒక కారుపై చెట్టు కూలిన ఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రైళ్లు, బస్సులతో పాటు ప్రతికూల వాతావరణం కారణంగా విమానాల రాకపోకల్లో సైతం తీవ్రమైన జాప్యం కొనసాగుతోంది. ఉత్తర ఐర్లండ్‌లో దాదాపు 3 వేల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అధికారులు చెప్పారు. ఇంగ్లండ్‌లో 2,700 ఇళ్లకు, వేల్స్‌లో 460 ఇళ్లకు కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అట్లాంటిక్ సముద్రం నుండి తీర ప్రాంతానికి దూసుకొస్తున్న ఈ తుపాను కారణంగా వీచే పెనుగాలులకు ఎగిరి వచ్చే వస్తువులతో వ్యక్తులు గాయపడే ప్రమాదం వుందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఉత్తర ఐర్లండ్‌తో పాటు బ్రిటన్ ప్రధాన భూభాగం, దక్షిణ స్కాట్లండ్ తదితర ప్రాంతాల్లో పెనుగాలులు వీస్తుండటంతో వాతావరణం బీభత్సంగా మారింది. తుపాను కారణంగా రవాణా సౌకర్యాలు నిలిచిపోవటంతో పర్యాటకులు ఎక్కడికక్కడే చిక్కుకుపోయారని అధికారులు చెప్పారు.

రాజకీయ ఖైదీలందరికీ విముక్తి

- ఇథియోపియా ప్రకటన

అడిస్ అబాబా : రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేసి, డిటెన్షన్ కేంద్రాన్ని మూసివేయనున్నట్లు ఇథియోపియా ప్రధాని ప్రకటించారు. నేరస్తులు తమ నేరం అంగీకరించేలా చేసేందుకు అంతులేని చిత్రవధలకు పాల్పడతారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ డిటెన్షన్ కేంద్రంలో విచారణ ఎదుర్కొనాల్సినవారిపై అభియోగాలను కూడా ఉపసంహరించనున్నట్లు ప్రధాని హేలిమారియమ్ దెసలెన్ విలేకర్లకు తెలిపారు. రాజకీయ చర్చలు ప్రారంభించే లక్ష్యంతోనే ఈ చర్య తీసుకున్నట్లు ప్రధాని తెలిపారు.

జాంబియా విదేశాంగ మంత్రి రాజీనామా

లుసాకా : జాంబియా విదేశాంగ మంత్రి హెన్రీ కలాబా రాజీనామా చేశారు. అవినీతిని అంతమొందిస్తారని భావించే వారే అంతులేని రీతిలో అవినీతికి పాల్పడడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టారు. ఉన్నత స్థాయిలో అవినీతి పెరిగిపోతుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. తన దేశానికి, ప్రజలకు సేవ చేయాలనుకుంటున్నానని, అందుకే ఈ పదవి నుండి వైదొలగుతున్నానని చెప్పారు. మూడవసారి అధ్యక్షుడు కావాలని భావిస్తున్న అధ్యక్షుడు ఎడ్గర్ లుంగుపై ఒత్తిడి పెంచే ప్రయత్నంలో భాగమే ఈ చర్య అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అంతులేని దురాశతో, సిగ్గుపడే రీతిలో దేశం పయనిస్తోందని కలాబా విమర్శించారు. జాంబియా రాజ్యాంగం ప్రకారం ఒక వ్యక్తి రెండుసార్లు మాత్రమే అధ్యక్షుడు కాగలరు. అయితే లుంగు మూడవసారి కూడా తానే అధికారం చేపట్టాలని ఆశిస్తున్నారు.

చర్చలతోనే పరిష్కారం

- అమెరికా, ఉత్తర కొరియాలకు చైనా సూచన



వాషింగ్టన్ : చర్చలు, సంప్రదింపుల క్రమంతోనే ఉత్తర కొరియా అణు సమస్యను పరిష్కరించుకోగలమని చైనా పేర్కొంది. అమెరికా, ఉత్తర కొరియాలు పరస్పరం కవ్వింపు చర్యలకు పాల్పడడం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడానికి బదులుగా సామరస్య ధోరణితో చర్చలు జరపాలని, పరస్పర విశ్వాస పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ పిలుపిచ్చింది. అణు బటన్‌పై పరస్పరం బెదిరింపులకు దిగడం వల్ల ప్రయోజనమేమీ లేదని పేర్కొంది. ఉత్తర కొరియా అణు సమస్యను శాంతియుతంగా చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని కోరింది. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఇరు పక్షాలను తాము కోరుతున్నామని తెలిపింది. చర్చలను పునరుద్ధరించి, పరస్పర విశ్వాస పునరుద్ధరణ చర్యలు తీసుకునేందుకు కృషి చేయాలని కోరింది. 'మిమ్మల్ని పూర్తిగా నాశనం చేస్తాం. "మీ అణు బటన్ కన్నా మాది మరింత శక్తివంతమైనది" ఇలాంటి వ్యాఖ్యలు, బెదిరింపులు సరైనవి కావు, సంక్లిష్టమైన సమస్యను పరిష్కరించడానికి అవసరమైన విశ్వాసాన్ని కల్పించలేవని అమెరికాలో చైనా రాయబారి సుయి తియాన్‌కి పేర్కొన్నారు. బెదిరింపులు, రెచ్చగొట్టే చర్యలు మాని సంయమనం పాటించాలని, చర్చల పునరుద్ధరణకు సమర్ధవంతమైన మార్గాలను అన్వేషించాలని కోరారు. జాన్ హాప్కిన్స్ యూనివర్శిటీలో అంతర్జాతీయ అధ్యయనాల కేంద్రంలో ప్రొఫెసర్ అయిన ఎలియట్ కొహెన్ స్పందిస్తూ అణు బటన్ల గురించి మాట్లాడుకోవడం వల్ల ప్రయోజనమేమీ లేదని అన్నారు. ప్రపంచంలోకెల్లా అత్యంత శక్తివంతమైన దేశాల్లో ఒకటైన అమెరికా శాంతి భద్రతలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించాల్సిన అవసరముందని అన్నారు.

కోక్ కోసం రెడ్ బటన్

ఉత్తర కొరియా అణ్వస్త్ర దేశమని, ఏ శక్తి కూడా తమనేమీ చేయలేదని, తమ దేశంపై యుద్ధం ప్రకటించే ధైర్యం అమెరికా చేయలేదంటూ కొత్త సంవత్సరం ప్రారంభం రోజున ఉత్తర కొరియా నేత కిమ్ వ్యాఖ్యానించారు. తన డస్క్ పక్కనే అణు బటన్ వుంటుందని కిమ్ వ్యాఖ్యానించడంపై ట్రంప్ స్పందిస్తూ వారి బటన్ కన్నా అత్యంత శక్తివంతమైనది, పెద్దదైన అణు బటన్ తన దగ్గర వుంటుందని ఉత్తర కొరియాకు తెలియచేయాలని ట్రంప్ పేర్కొన్నారు. వాస్తవానికి ట్రంప్ డస్క్‌పై రెడ్ బటన్ వుంటుంది. కానీ కోక్‌ను తెప్పించుకోవడానికి ట్రంప్ ఆ బటన్ ఉపయోగిస్తారు. అసోసియేటెడ్ ప్రెస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ విషయం వెల్లడించారు. దశాబ్దాల తరబడి అమెరికా అధ్యక్షులు ఆ బటన్‌ను ఉపయోగిస్తున్నారు. వైట్‌హౌస్ బట్లర్ వచ్చి అధ్యక్షుడికి కోక్ అందచేస్తారని అసోసియేటెడ్ ప్రెస్ తెలిపింది. దానిపై సోషల్ మీడియాలో వ్యంగ్యంగా, హాస్యంగా అనేక వ్యాఖ్యలు వెల్లువెత్తాయి.

పాలస్తీనాకు సాయం నిలిపివేస్తాం : ట్రంప్

వాషింగ్టన్ : జెరూసలేం వివాదం నేపథ్యంలో శాంతి చర్చలు జరిపేందుకు తిరస్కరిస్తున్న పాలస్తీనియ న్లకు సహాయాన్ని నిలిపివేస్తామని అమెరికా అధ్య క్షుడు ట్రంప్ బెదిరించారు. తాము సాయం అంది స్తున్నా అందుకు ప్రతిగా పాలస్తీనా నుండి ఇంతవ రకు ఎలాంటి అభినందన లేదా గౌరవ సూచకమైన వ్యాఖ్యలు రాలేదని ట్విట్టర్‌లో ట్రంప్ వ్యాఖ్యానించారు. జెరూసలేంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తి స్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన నేపథ్యం లో కొత్తగా శాంతి చర్చలు జరిపేందుకు ఇదొక అవరోధంగా తయారైంది. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం చూస్తుంటే తటస్థంగా వ్యవహరించలేదని అర్ధమవు తోందని పాలస్తీనా పేర్కొంటోంది. డిసెంబరులో ట్రంప్ ప్రకటన వెలువడిన వెంటనే పాలస్తీనా అధ్య క్షుడు మహ్మద్ అబ్బాస్ స్పందిస్తూ పశ్చిమాసియాలో అమెరికా శాంతి ప్రణాళిక దేన్నీ కూడా ఆమోదించబోమని స్పష్టం చేశారు. ట్రంప్ నిర్ణ యాన్ని ఐక్య రాజ్య సమితి సభ్య దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు 128దేశాలు ఓటు వేశాయి. పాకిస్తాన్‌కు సాయం విషయంలో కూడా ట్రంప్ ఇదే రకమైన వ్యాఖ్య లు చేశారు. తాము సాయ మందిస్తే పాకిస్తాన్ తమను వంచించిందని, మోసం చేసిందని వ్యాఖ్యానించారు.

బెదిరింపులకు లొంగం : పాలస్తీనా

జెరూసలేం : 'జెరూసలేం అమ్మకానికి లేదు.' అని పాలస్తీనా వ్యాఖ్యానించింది. తాము సాయం చేస్తున్నప్పటికీ తమ పట్ల గౌరవం కానీ కనీసం అభినందించడం కూడా లేదని ట్రంప్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో పాలస్తీనా విమోచన సంస్థ నేత హనన్ అష్రావి బుధవారం స్పందిం చారు. శాంతి పట్ల వాటి ప్రయోజనాల పట్ల అమెరికాకు నిజంగా ఆసక్తి వుంటే ముందు వాటికి కట్టుబడాలని కోరారు. పాలస్తీనియన్లను ఎన్నటికీ బ్లాక్ మెయిల్ చేయలేరని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం ట్రంప్ ట్విట్టర్ లో చేసిన వ్యాఖ్యలను పాలస్తీనా తీవ్రంగా ఖండించింది. కాగా, ట్రంప్ ప్రకటనను ఇజ్రాయిల్ అధికారులు స్వాగతించారు. తాము కూడా పాలస్తీనియన్లపై ఒత్తిడి పెంచు తామని తెలిపారు. అయితే ఈ చర్య వల్ల గాజాలో మానవతా సంక్షోభం నెలకొనే ప్రమాదముందని ప్రతిపక్ష నేత ట్జిపి లివిని హెచ్చరించారు.

మేమే 'పవర్‌ఫుల్': ట్రంప్

వాషింగ్టన్: ప్రపంచంలో ఎప్పటికైనా అమెరికాయే అత్యంత శక్తివంతమైన (పవర్‌ఫుల్) దేశమని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. అమె రికాపై దాడి చేసే శక్తివంతమైన దేశంగా తాము ఎదుగుతున్నా మంటూ ఉ.కొరియా నేత కిమ్‌జోంగ్ ఉన్ చేస్తున్న ప్రకటనలపై స్పందించిన ట్రంప్ తమ వద్ద అంతకంటె శక్తివంతమైన అణ్వాయుధా లున్నాయని ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. కిమ్ తన నూతన సంవత్సర సందేశంలో మాట్లా డుతూ మొత్తం అమెరికా అంతా తమ అణ్వాయుధాల పరిధిలో వుందని, ఇందుకు సంబంధించిన బటన్ ఒకటి ఎప్పుడు తన డెస్క్‌పై వుంటుందని ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై స్పం దించిన ట్రంప్ తన డెస్క్‌పై అణ్వాయుధ బటన్ ఒకటి మాత్రమే కాదని, అంతకంటె శక్తివంతమైన ఆయుధ ప్రయో గాలకు సంబంధించిన పరికరా లున్నాయని తన ట్వీట్‌లో పేర్కొన్నారు. కొందరు తమ దేశంలో ప్రజలు ఆకలితో మలమలా మాడు తుంటే అణ్వా యుధాలు, క్షిపణులంటూ హడావుడి చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

ఉభయ కొరియాల మధ్య హాట్‌లైన్ పునఃప్రారంభం



సియోల్ : ఉభయ కొరియాల మధ్య దీర్ఘకాలంగా నిలిచిపోయిన హాట్‌లైన్ సౌకర్యం బుధవారం నుండి పునఃప్రారంభమైంది. ఈ లైన్ ద్వారా తాము ఉ.కొరియా ప్రభుత్వం నుండి కాల్ అందుకున్నట్లు ద.కొరియా ప్రభుత్వ వర్గాలు ధృవీకరించాయి. వచ్చే నెలలో ద.కొరియాలో నిర్వహించనున్న శీతాకాలం ఒలింపిక్స్‌కు క్రీడాకారుల బృందాన్ని పంపే అంశంపై ద.కొరియాతో చర్చించేందుకు తాము సిద్ధంగా వున్నట్లు ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఉభయ దేశాల మధ్య ఉన్నత స్థాయి సంప్రదింపులు 2015 డిసెంబర్ నుండి నిలిచిపోయాయి. ఈ హాట్‌లైన్ సౌకర్యాన్ని పునఃప్రారంభించినట్లు ఉ.కొరియా నేత ఒకరు టెలివిజన్ ప్రకటనలో వెల్లడించారు. శీతాకాలం ఒలింపిక్ క్రీడలకు ప్రతినిధి బృందాన్ని పంపటంతో పాటు ఇతర అంశాలను కూడా ఈ హాట్‌లైన్ ద్వారా చర్చిస్తామని ఆయన చెప్పారు. తాము నిజాయితీతో, విశ్వసనీయ పద్ధతిలో ద.కొరియాతో సంప్రదిస్తామన్నారు. క్రీడాకారుల ప్రతినిధి బృందాన్ని పంపే అంశంపై ఆచరణలో ఎదురయ్యే సమస్యలపై ఇరుదేశాలు చర్చిస్తాయన్నారు. ఇరుదేశాల మధ్య హాట్‌లైన్ సౌకర్యం పునఃప్రారంభం కావటం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న అంశమని ద.కొరియా అధ్యక్షుడు మూన్-జే వ్యాఖ్యానించారు. ఇరుదేశాల మధ్య సంబంధాల మెరుగుదలలో ఇదో ముందడుగు అని ఆయన అభిప్రాయపడ్డారు.

మొదటి పేజీ తరువాయి

నదుల అనుసంధానమే శరణ్యం

రేటింగ్ వంటి తొమ్మిది రకాల అంశాలను వివరించారు. 2022 నాటికి దేశంలోని మూడు అగ్రగామి రాష్ట్రాల్లో ఎపి ఒకటి ఉంటుందని, 2029 నాటికి అభివృద్ధికి ఎపిని చిరునామాగా మారుస్తామని పేర్కొన్నారు. 2050 నాటికి ప్రపంచంలోనే పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా రాష్ట్రాన్ని నిలుపుతామని తెలిపారు. వ్యవసాయం నుంచి హార్టికల్చర్, డెయిరీ, పౌల్ట్రీ, గొర్రెల పెంపకం, చేపల పెంపకంతో అత్యధిక ఆదాయం లభించడాన్ని రైతులు గమనించాలన్నారు. రాయలసీమలో 122 టిఎంసిలను నిల్వ చేశామని తెలిపారు. దేశంలో గోదావరి-కృష్ణా నదుల అనుసంధానించిన ఘనత ఎపిదేనన్నారు. పోలవరం జాతికి జీవనాడిగా మారిందని, పూర్తి చేసి తీరుతామని, నదుల అనుసంధానంతో రాయలసీమకు కష్టాలు తీరుతాయని తెలిపారు. గోదావరి నీళ్లను గాలేరు-నగరి కాల్వకు తరలించే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో ఎన్నికల్లోపు 19 లక్షల పక్కా గృహాలను నిర్మిస్తామని తెలిపారు. సభకు వచ్చిన 74 మంది ట్రాన్స్‌జెండర్లకు ఇళ్లస్థలాల పట్టాలు, నెలకు రూ.1500 పింఛన్ ఇస్తామని సిఎం ప్రకటించారు. ఇళ్లస్థలాలు, ఉపాధి, ఇద్దరికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీనిచ్చారు.

వివాదమైన ఎంపీ ప్రసంగం

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రసంగం వివాదమైంది. సభలో ఆయన మాట్లాడుతూ చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రూ.1300 కోట్ల వ్యయంతో రూ.1100 కోట్లతో 85 శాతం నిర్మాణ పనులు పూర్తి చేశారని తెలిపారు. పులివెందులకు వైఎస్ చేసిన కృషి మరువరానిదన్నారు. ఎంపీ మాట్లాడుతుండగా ముఖ్యమంత్రి లేచి ఆగమ్మా, ఆగు, వినవమ్మా విను అంటూ దబాయిస్తూ మైక్‌ను కట్ చేయాలని సంకేతాలు అందిం చారు. అయినప్పటికీ ఎంపీ ప్రసగింస్తుండడంతో ఇది రాజకీయ వేదిక కాదని, నా మీటింగ్‌కు వచ్చి వక్రీకరించడం తగదని, హుందాగా ప్రవర్తించాలని, మీరు సమస్యలను రాసిస్తే నేను మాట్లాడతానని దబాయించారు. దీంతో ఎంపీ వేదిక దిగి వెళ్లిపోయారు. రాజకీయాలకతీతంగా వ్యవహరిస్తూ కుప్పం కంటే ముందు పులి వెందులకు నిళ్లిస్తామన్న హామీని నిలుపుకున్నానని సిఎం తెలిపారు. ఎవరో చెబితే చేయనని, ఎవరేమి చెప్పినా పాజిటివ్‌గా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటాన న్నారు.

ముఖ్యమంత్రికి చీనీ, దానిమ్మ కాయల దండలు

అనంతరం చీనీ రైతులు, దానిమ్మ రైతులు వేర్వేరుగా చీనీ, దానిమ్మకాయల దండలు వేసి ముఖ్యమంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, ఆదినారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమో హన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బిటెక్ రవి, సివిల్‌సప్లయ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ లింగారెడ్డి, శాసనమండలి మాజీ ఉపా ధ్యక్షులు ఎస్.వి సతీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బ్రహ్మయ్య, వరద రాజులరెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే జయరాములు, టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి, విశ్వనాధనాయుడు, రామ్‌గో పాల్‌రెడ్డి, పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

నేటికీ కాలి బాటలే..!

చొప్పున రోడ్లు నిర్మిస్తామన్నారు. కానీ చిత్రమల్లా.. మొత్తం సంకల్పించిన 2,871 కిలోమీటర్ల పొడవు రోడ్లతో ఇంతవరకు చేపట్టి పూర్తి చేసినవి కేవలం 15.75 కిలో మీటర్లేనని అధికారిక గణాంకాలు పేర్కొంటున్నాయి. పూర్తయిన వాటిలో విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో నాలుగేసి కిలోమీటర్ల, తూర్పుగోదావరి రంపచోడవరం పరిధిలో 1.25, చింతూరు పరిధిలో 3.5, పశ్చిమ గోదావరిలో 3 కిలోమీటర్ల పొడవున రోడ్లున్నాయి. ఈ నిర్మాణాల కోసం ఇంతవరకు రూ.1.90 కోట్లు ఖర్చయినట్లు అధికారులు తమ నివేదికల్లో పేర్కొంటున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గ్రామాలకు, వాటిలోని నివాసిత ప్రాంతాలకు వేసేవి తారు రోడ్లు కూడా కాదు. అవన్నీ గ్రావెల్ రోడ్లే. గిరిజనులు ఇప్పటికే కాలిబాటగా వినియోగిస్తున్న వాటినే కాస్త కాస్త వెడల్పు చేసి మట్టి, ఆపై రబ్బీసు వేసి రోలర్‌తో చదును చేయడమే. ఇలా వేసే రోడ్లకు కిలోమీటరుకు రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా. అయితే ఈ పనులు నేటికీ చాలా చోట్ల టెండర్ల దశలోనే ఉన్నట్లు సమాచారం. పూర్తి చేసిన రోడ్లు ఎక్కువ లేకున్నా, 1104 గిరిజన గ్రామాలకు 2,084 కిలో మీటర్ల పొడవున రోడ్ల పనులైతే కొనసాగుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

మినరల్ సెస్ విధింపుపై స్టే

ప్రజాశక్తి - హైదరాబాద్

మినరల్ సెస్ యాక్ట్ ప్రకారం పన్ను విధింపుపై హైకోర్టు న్యాయమూర్తి సీతారామ్మూర్తి స్టే ఉత్తర్వులు జారీ చేశారు. ఎపి మినరల్ బేరింగ్ ల్యాండ్స్ సెస్ యాక్ట్ 2005 మేరకు పన్ను విధించడాన్ని ఎపి, తెలంగాణలకు చెందిన ఖనిజ సంస్థలు సవాల్ చేసిన రిట్లను బుధవారం న్యాయమూర్తి విచారించారు. సుప్రీంకోర్టు స్టే విధించిన అంశాన్ని సంస్థల తరపు లాయర్లు న్యాయమూర్తి ద ష్టికి తెచ్చారు. దాంతో స్టే మంజూరు అయింది.

దుర్గగుడి ఘటనపై ఉన్నతస్థాయి విచారణ

(మొదటి పేజీ తరువాయి)

జరిగిందని నిర్ధరించారు. మంత్రి లోకేష్‌కు శాంతి జరగడం కోసం ఈ పూజలు నిర్వహించారనే ప్రచారం కూడా రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకున్నారు. కుటుంబ సభ్యులను వివాదాల్లోకి లాగడం ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావుతో సమావేశం నిర్వహించారు. ఉన్నతస్థాయి విచారణ జరపాలని మంత్రిని సిఎం ఆదేశించారు. దుర్గగుడిలో అపచారం జరిగిందని నిర్ధారించినట్లు మంత్రి తెలిపారు. బాధ్యులను ఏ మాత్రమూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తాత్కాలికంగా దుర్గగుడి ఇఒ సూర్యకుమారిని బాధ్యతల నుండి తప్పించినట్లు తెలిసింది. అయితే దీనికి సంబంధించిన ఉత్తర్వులు రాత్రి వరకూ రాలేదు. పూజలు నిర్వహించిన వారితోపాటు చేయించుకున్న వారిపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ వ్యవహారంపై పలువురు పీఠాధిపతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనకదుర్గమ్మ గర్భగుడిలో తాంత్రిక పూజలు చేయడం అరిష్టమని చెబుతున్నారు. సింహాచలం ఇఒ రామచంద్రకు అదనపు బాధ్యతలు అప్పగించారని ప్రచారం సాగుతోంది. ఈ పూజలను అర్ధరాత్రి సమయంలో నిర్వహించడాన్ని దేవస్థానం నిషేధించింది. ఇఓ సూర్యకుమారి సూచనల మేరకు ప్రధాన పూజారి ఆదేశాల మేరకు విశ్వనాథపల్లి శివాలయంలో పూజలు నిర్వహించే పూజారిని తీసుకొచ్చి పూజలు చేయించారు. దీనికోసం అమ్మవారి శాంతమూర్తి రూపాన్ని తొలగించి వారికి కావాల్సిన రూపాన్ని అలంకరించుకున్నారు. దీనికి అనుమతి లేదు. దీనిపై విభిన్న కథనాలు వినిపించాయి. రాష్ట్రపతి కుటుంబం వస్తుండటంతో అమ్మవారిని అలంకరించామని సూర్యకుమారి తెలిపారు. అనంతరం సిసి టివి కెమెరా వీడియోలు పరిశీలించిన తరువాత పూజలు జరిగినట్లు నిర్ధారించుకున్న పాలక మండలి సభ్యులు ఇఓను ప్రశ్నించారు. దీంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. విషయం బయటకు పొక్కడంతో ప్రధాన పూజారి నిర్వహించి ఉండొచ్చుని, తనకు తెలియదని పేర్కొన్నారు. ప్రధాన పూజారి కూడా తొలుత తనకు తెలియదని, అలంకారం మాత్రమే చేశామని తెలిపారు. పోలీసుల విచారణలో మహిషాసురమర్ధని పూజ నిర్వహించినట్లు అంగీకరించారు. దీంతో వ్యవహారం బయటకు వచ్చింది. ఈఓ, ప్రధాన పూజారి తొలుత అలంకారమని అబద్ధం చెప్పడంతో దీనిపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. పూజ నిర్వహించిన వారు ఎవరు, ఏమిటి విషయంపై పెద్దఎత్తున చర్చ జరిగింది. లోకేష్‌బాబుకు మంచి జరగాలనే అత్యంత బలమైన పూజలు నిర్వహించారని వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు అంబటి రాంబాబు విమర్శించారు. అలాగే శారదా పీఠాధిపతి స్వరూపానంద మీడియాతో మాట్లాడుతూ కనకదుర్గమ్మ దేవస్థానంలో, అదీ గర్భగుడిలో తాంత్రిక పూజలు నిర్వహించడం అరిష్టమని అన్నారు. దీనిపై విచారణ జరిపించాలని కోరారు. ముందుగా దేవస్థానంలో పీఠాధిపతులతో సంప్రోక్షణ చేయించాలని సూచించారు. పూజారి రాజా మాట్లాడుతూ దేవస్థానంలో పూజలు నిర్వహించామని తెలిపారు. దీనికోసం ఐదు చీరెలతో ప్రత్యేకంగా అలంకరించామని, అత్యంత విలువైన అమ్మవారి కవచాన్ని తొలగించామనీ తెలిపారు. అమ్మవారి దేవస్థానంలో పూజలు చేయాలని ముందు రోజు రాత్రి తనకు సమాచారం పంపించారని, తనతోపాటు మరో పూజారి కూడా ఉన్నారని తెలిపారు. రాత్రి దేవస్థానం డార్మెటరీలో బసచేసి ఉదయం వెళ్లిపోయామని ఆయన పోలీసుల విచారణలో తెలిపారు. ఈ విషయంలో ఇవో సూర్యకుమారి, వి.చక్రవర్తి, లింగంభట్ల భువన్, ఎస్.శివప్రసాద్, శంకర శాండిల్య, పార్ధసారధి, సుజన్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు వన్‌టౌన్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ నివేదికను బుధవారం రాత్రి సవాంగ్ సిఎంకు అంజేశారు.

పూజలు చేయించినవారు ఎవరు, వారికి కనకదుర్గమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించే స్థాయి ఉందా ? ఇంకా ఎవరైనా పెద్దలు దీని వెనుకున్నారా ? అనే పలురకాల ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యక్తులకు మాత్రం అర్ధరాత్రి సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించేంత స్థాయి లేదని పలువురు చెబుతున్నారు.

ఇంటర్ గ్రేడింగ్‌పై మళ్లీ చర్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్‌లో గ్రేడింగ్ విధానం అమలు చేయాలన్న బోర్డు నిర్ణయంపై మళ్లీ చర్చ మొదలైంది. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులపై భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు పలు రాష్ట్రాల ఇంటర్ బోర్డులు ఈ ఏడాది నుంచి గ్రేడింగ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించాయి. తెలుగు రాష్ట్రాల ఇంటర్ బోర్డులు గ్రేడింగ్ విధానం అమలుకు ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జెఇఇ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పర్సంటైల్ లేదా ఇంటర్ మార్కులనే పరిగణలోకి తీసుకుంటున్నాయి. మెయిన్, అడ్వాన్స్‌డ్‌లకు ఇంటర్ మార్కులకు ఇచ్చే వెయిటేజీ రద్దు చేసి దాని స్థానంలో ఇంటర్‌లో 75 మార్కులు లేదా టాప్ 20 పర్సంటైల్‌ను అర్హత నిర్ణయించారు. దీంతో జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు గ్రేడింగ్ ఇస్తే విద్యార్థులకు ఇబ్బందులు తప్పని పరిస్థితి ఏర్పడుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. సాధారణంగా గ్రేడ్‌లను 91 నుంచి 100 మార్కులు వస్తే ఏ-1 అని, 81 నుంచి 90 మార్కులు వస్తే ఏ-2 అని, 71 నుంచి 80 మార్కులు వస్తే బి-1 అని, మార్కులు తక్కువ అవుతున్న కొద్దీ ఇతర గ్రేడ్‌లు నిర్ణయించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో జెఇఇకి అవసరమైన 75 మార్కులను ఎలా నిర్ణయిస్తారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రేడ్‌లు నిర్ణయించడం వల్ల 75 మార్కులపై ఎంత మంది వచ్చారో ఎలా తెలుస్తుందని, మెరిట్‌కు అన్యాయం జరుగుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

పోటీ పరీక్షల్లో ఒక్క మార్కుతోనూ ర్యాంకులు తారుమారు అవుతాయి. అలాంటిది 91 నుంచి 100 మార్కులు వచ్చిన విద్యార్థులకు ఏ-1 గ్రేడ్ ఇవ్వడం వల్ల సీట్లు ఎలా కేటాయిస్తారని ప్రశ్నిస్తున్నారు. 98 మార్కులు తెచ్చుకున్న విద్యార్థికి 91 మార్కులు తెచ్చుకున్న విద్యార్థికి ఒకే గ్రేడ్ ఇవ్వడం ద్వారా మెరిట్ విద్యార్థికి నష్టమంటున్నారు. ఒక సారి గ్రేడ్ నిర్ణయించిన తరువాత వాటిని మళ్లీ మార్కుల్లోకి మార్చడం కష్టమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

మోటరు వాహన చట్ట సవరణ చేశాం

హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్

హైకోర్టు ఆగ్రహంతో ఎపి సర్కార్ దిగొచ్చి మోటారు వాహనాల చట్టంలోని కార్మిక సంక్షేమం కోసం నిర్దేశించిన అంశంపై చట్ట సవరణ చేసింది. గత ఏడాది ప్రారంభంలో కష్ణా జిల్లా మూలపాడు గ్రామంలో దివాకర్ ట్రావెల్స్ బస్సు అత్యంత వేగంగా ప్రయాణిస్తుండగా ఘోర ప్రమాద ఘటనపై దాఖలైన కేసు విచారణ సమయంలో రాష్ట్ర మోటార్ ట్రాన్స్‌పోర్ట్ లేబర్ యాక్ట్-1961 ప్రకారం మోటార్ వాహనాల్ని విధిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చట్టంలో లేకపోవడం హైకోర్టు దష్టికి వచ్చింది. హైకోర్టు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేయడంతో ఆ చట్ట ప్రకారం మోటారు వాహనాల్ని విధిగా రిజిస్ట్రేషన్ చేసే విధంగా ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. ఈ విషయాన్ని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ దష్టికి ప్రభుత్వ లాయర్ తెలిపారు. చట్ట సవరణ మేరకు జారీ చేసిన జీవో ప్రతిని బెంచ్‌కి అందజేశారు. ఈ విషయాన్ని నమోదు చేసుకున్న హైకోర్టు విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

గజల్ శ్రీనివాస్‌కు బెయిలిస్తే ప్రమాదం

కోర్టుకు తెలిపిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్‌కు బెయిల్ మంజూరు చేస్తే ప్రమాదకర ఘటనలు చోటు చేసుకునే అవకాశం ఉందని పోలీసులు కోర్టుకు తెలిపారు. కేసుకు సంబంధించి కీలక సమాచారం సేకరించాల్సి ఉందని, ఈ సమయంలో బెయిల్ ఇస్తే, ఆయన పరపతి ఉపయోగించి సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందని పోలీసుల తరుపు న్యాయవాది వాదనలు వినిపించారు. కేసులో పురోగతి కోసం పోలీసు కస్టడీకి అనుమతించాల్సిందిగా కోరారు. బెయిల్, కస్టడీ పిటిషన్లపై విచారించిన న్యాయస్థానం నిర్ణయాన్ని గురువారానికి వాయిదా వేసింది. శ్రీనివాస్ దరఖాస్తు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం తదుపరి విచారణను వాయిదా వేసింది. కుట్ర జరిగిందని, కావాలనే గజల్ శ్రీనివాస్‌ను ఇరికించారని ఆయన తరపు న్యాయవాది వాదించారు. అరెస్టు చేసిన సమయంలో కూడా పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని, ఆయనపై సెక్షన్లు కూడా ఎక్కువగా నమోదుచేశారని న్యాయమూర్తి దష్టికి తీసుకెళ్లారు. బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరారు.

సేవ్ టెంపుల్స్ నుంచి సస్పెన్షన్

సేవ్ టెంపుల్స్ సంస్థ ప్రచారకర్త బాధ్యతల నుంచి గజల్ శ్రీనివాస్‌ను తొలగించారు. ఈ మేరకు గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ అధ్యక్షుడు వెలగపూడి ప్రకాశ్‌రావు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ కోసం 2006లో ఈ సంస్థ ఏర్పాటయింది. ఇల్లు, సమాజంలో మహిళలకు అత్యున్నత గౌరవం ఉందని, భారత్‌లోని తమ కార్యాలయంలో లైంగిక వేధింపులు జరిగాయనే సమాచారం దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగుల్లో ఒకరిని లైంగికంగా వేధించారనే ఆరోపణలపై గజల్ శ్రీనివాస్‌పై కేసు నమోదు అయినందున, ఆయన్ని తక్షణమే సస్పెండ్ చేయాలని తమ సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారని వెల్లడించారు.

భూదాన్ యజ్ఞబోర్డుకు ప్రత్యేకాధికారి నియామక జీవో నిలుపుదల

ప్రజాశక్తి - హైదరాబాద్

ఏపీ భూదాన్ యజ్ఞ బోర్డుకు ప్రత్యేక అధికారిని నియమిస్తూ జారీ చేసిన జీవో అమలును నిలిపివేస్తూ హైకోర్టు న్యాయమూర్తి ఎమ్మెస్ రామచందర్‌రావు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. భూపరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ బోర్డు విధుల పర్యవేక్షణకు వీలుగా గత నెల 18న జారీ చేసిన జీవోను ఏపీ భూదాన్ బోర్డు అధ్యక్షుడు జి.రాజేందర్‌రెడ్డి హైకోర్టులో సవాల్ చేశారు. కొత్త కార్యవర్గం ఏర్పాటు అయ్యే వరకు అధికారి అవసరం లేదన్నది పిటిషనర్ లాయర్ వాదన. జీవోను సస్పెండ్ చేస్తూ బుధవారం హైకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చి ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

జన్మభూమిలో పర్యాటక శాఖ పోటీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పర్యాటక శాఖ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా శాఖ సహకారంతో గ్రామ పంచాయతీ, వార్డు, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో దశల వారీగా నిర్వహిస్తున్న పోటీలకు విద్యార్థుల, యువత నుంచి మంచి స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. తొమ్మిదో తేదీతో గ్రామ స్థాయి పోటీలు ముగుస్తాయని, 10న మండల స్థాయి పోటీలు నిర్వహించి 11న ధ్రువీకరణ పత్రాలు అందిస్తామని తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల తేదీలను త్వరలో వెల్లడిస్తామని, ఉగాది రోజున వారికి బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. జిల్లా స్థాయి విజేతలకు ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర స్థాయి విజేతలకు ముఖ్యమంత్రి బహుమతులను అందిస్తారని తెలిపారు.

జంతుహింస నిరోధక కమిటీలకు రూ. 60 లక్షలు విడుదల చేయాలి : హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

జంతు హింస నిరోధక జిల్లా కమిటీలకు మంజూరు చేసిన రూ.60 లక్షలను విడుదల చేయాలని ఎపి ప్రభుత్వాన్ని బుధవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. మంజూరు చేసిన నిధుల్ని విడుదల చేయకపోతే అందుకు కారణాల్ని 23న జరిగే విచారణ సమయంలో స్వయంగా తమకు వివరించాలని పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శిని బెంచ్ బుధవారం ఆదేశించింది. నిధులు మంజూరు అయ్యాయన్న అంశాన్ని ప్రభుత్వం హైకోర్టుకు తెలపడంతో విడుదల మాటేమిటని బెంచ్ ప్రశ్నించింది.

నవ్వి ఊరుకున్నారట!


చిరంజీవి

సినిమా ప్రారంభం నుంచి ఏదొక వార్త వింటునూ ఉన్నాం. ఆ వార్త తర్వాత నిజమవుతూ ఉంటున్నాయి. ఆ చిత్రమే చిరంజీవి 151 సినిమా 'సైరా నరసింహారెడ్డి'. ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ నాలుగు నెలలు క్రితం ప్రారంభించాలి. కానీ కారణాలేమైనా ప్రారంభమైతే కాలేదు. ఆ తర్వాత చాలా కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. ముఖ్యంగా సంగీత దర్శకుడు రెహమాన్ ఈ చిత్రం నుంచి తప్పుకోవడం, సినిమాటోగ్రాఫర్ కూడా మరో హాలీవుడ్ చిత్రం ఉందని వెళ్లిపోవడం వంటివి వినిపించాయి. తర్వాత రెహమానే స్వయంగా 'చిరంజీవి అంటే నాకు ఇష్టమైన నటుడు. ఆయన సినిమా చేయలేకపోతున్నందుకు బాధగా ఉంది. మళ్లీ అవకాశం వస్తే కచ్చితంగా చేస్తా' అని ప్రకటించాడు. ఆయన స్థానంలో తమన్ వచ్చారు. ఈ చిత్రానికి సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పుడు తాజాగా మరో వార్త చక్కర్లే కొడుతుంది. సురేందర్ రెడ్డి స్థానంలో వివి వినాయక్ దర్శకత్వం వహిస్తున్నారని, సంగీత దర్శకుడు కూడా మారారని ఎం.ఎం. కీరవాణి స్వరాలందించబోతున్నారని అనుకుంటున్నారు. అందుకే డిసెంబర్‌లో ప్రారంభమైన షూటింగ్‌ను నిలిపేశారని చిరంజీవి కూడా పాత్రకు తగ్గట్టు ఉన్న గడ్డం, మీసాలను తీసేశారని ప్రచారం జరుగుతుంది. ఈ విషయాలన్నీ చిరంజీవి చెవిన ఓ మిత్రుడు పడేశాడట. విన్న వెంటనే అవునా!...ఇన్ని రూమర్స్ ఉన్నాయా? అని ఓ పెద్ద నవ్వు నవ్వి ఊరుకున్నారట.

అసలు ఏం జరుగుతోంది?


కీర్తి సురేశ్


రకుల్ ప్రీత్ సింగ్

రకుల్ ప్రీత్ సింగ్ తెలుగులో వరుసపెట్టి సినిమాలు చేస్తుంది. కానీ ఈ మధ్య అవకాశాలు వచ్చినట్టే వచ్చి చేజారిపోతున్నాయి. ఇప్పటికిది రెండోది. ఈనెల ఒకటో తేదీన తెలుగు, తమిళ భాషల్లో రూపొందనున్న సూర్య చిత్రంలో రకుల్ ప్రీత్‌సింగ్‌ను మొదట ఎంపిక చేశారు. కారణం తెలియదు కానీ ఆమె స్థానంలో సాయి పల్లవిని ఎంపిక చేశారు. కార్తీతో 'ఖాకి' చేసి మెప్పించిందని అందుకే రకుల్‌ను తమ సినిమాలో హీరోయిన్‌గా తీసుకున్నామని దర్శకుడు సెల్వ రాఘవన్ కూడా ప్రకటించారు. ఇంతలోనే ఏమైందో కానీ సాయి పల్లవి కథానాయిక అని షూటింగ్ ప్రారంభం నాడు ప్రకటించిందీ చిత్రబృందం. ఇప్పుడు మళ్లీ తమిళ్‌లో ఓ చిత్రం విజయ్ హీరోగా మురగదాస్ దర్శకత్వంలో తెరకెక్కనుంది. ఇందులోనూ రకులే కథానాయిక అనుకున్నారు. ఇప్పుడు ఆమె స్థానంలో కీర్తిసురేశ్‌ను ఎంపిక చేశారు. ఇక రకుల్ చేతిలో సినిమాలు లేనట్టే. అటు తమిళ్, ఇటు తెలుగు రెండింట్లోనూ ఆమె చేయడానికి సిద్ధంగా ఉన్నా ఒక్కటీ ఆమె చేతిలో లేదు. అసలు ఆఫర్లు వచ్చినట్టే వచ్చి ఎందుకు చివరి నిమిషంలో చేజారుతున్నాయో అర్థం కావడం లేదని ఆమె తన సన్నిహితులతో చెప్పి బాధపడుతుందని ప్రచారం జరుగుతోంది.

రికార్డు 'సూర్య'

మీకు సూర్య అంటే సోల్జర్...కానీ ప్రపంచానికి మాత్రం యాంగర్...ఈ డైలాగ్‌ను 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' చిత్రం టీజర్‌లో బొమన్ ఇరానీ అల్లు అర్జున్‌ను ఉద్దేశించి అన్నది. సూర్య అంత యాంగర్‌గా ఉన్నాడా? ఏమిటో చూద్దామని మెగా అభిమానులు 'సూర్య...' టీజర్‌ను నెట్‌లో తెగచూశారు. ఫస్ట్ ఇంపాక్ట్ పేరుతో విడుదల చేసిన ఈ టీజర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. అందుకే రికార్డు నమోదు చేసింది. కేవలం 29 గంటల్లో లక్ష రెండు లక్షల మంది చూడలేదు...ఏకంగా కోటి మంది ఈటీజర్‌ను వీక్షించారంటే ఈ టీజర్ సత్తా ఏంటో తెలుస్తుంది. అల్లు అర్జున్, అనుఇమ్మాన్యూయేల్ జంటగా ఈ చిత్రంలో నటించారు. రచయిత వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయం కానున్నాడు. డిజిటల్ వ్యూస్‌లో 'బాహుబలి ది కన్‌క్లూజన్' తర్వాత స్థానంలో నిలిచింది.

ప్రస్తుతం హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ జరుగుతోంది. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి సినిమాను ఏప్రిల్ 27న విడుదల చేస్తున్నారు. బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్ – శేఖర్ ఈ చిత్రానికి అద్భుమైన సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని కె. నాగబాబు సమర్పణలో, రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ బ్యానర్లో శిరీష శ్రీధర్ నిర్మాతగా, బన్నీ వాసు నిర్మిస్తున్నారు. యాక్షన్ కింగ్ అర్జున్ , శరత్ కుమార్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.


అల్లు అర్జున్

'నా సూపర్ హీరోలు.. పారాగ్లైడర్స్'



తన కుటుంబ సభ్యులకు నిత్యం ఏదొక విషయంలో ఆశ్యర్యం కలిగిస్తాడు మహేష్ బాబు. ఆయన ఒక సినిమా చేశాడంటే చాలు ఫ్యామిలీతో విహార యాత్రకు వెళ్లిపోతాడు. మొన్ననే ఆయన మురగదాస్ దర్శకత్వంలో 'స్పైడర్' చేశాడు. అందుకే ఈసారి మళ్లీ ఒమెన్‌కు టూర్ వెళ్లారు. అక్కడ మహేశ్, ఆయన కుమారుడు గౌతమ్ పారాగ్లైడింగ్ చేశారు. గాల్లో విహరించారు. ఈ ఫొటోలను నమ్రత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'నా సూపర్ హీరోలు.. పారాగ్లైడర్స్. తండ్రిలాగే కుమారుడు. అందమైన ఒమన్' అని రాసింది.

ప్రస్తుతం మహేష్ బాబు 'భరత్ అనే నేను' సినిమాలో నటిస్తున్నాడు. కొరటాల శివ దర్శకత్వం. కైరా అద్వాని కథానాయిక. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూరుస్తున్నారు. ఇందులో మహేశ్ ముఖ్యమంత్రి పాత్రలో కనిపించనున్నారు. ఏప్రిల్ 27న ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



పారాగ్లైడర్స్ కట్టుకుంటున్న మహేష్ బాబు, గౌతమ్

రియల్ ఛేజింగ్స్

గంటకు 60 కిలోమీటరు...ఓ హీరో పరుగు వేగం ఇది. ఇదేంటి సినిమాకు ఇంత అవసరమా? అంటే ఆయనకవసరమే. ఎందుకంటే ఆయన సినిమాల్లో వాస్తవానికి కాస్తా దగ్గరగా ఉండాలని నిత్యం అనుకుంటూ ఉంటాడు. అందుకే సాహసాలు చేస్తుంటాడు. మొన్ననే 30 అడుగుల ఎత్తు ఉన్న భవనం నుంచి అమాంతంగా దూకేశాడు. ఇది చూసి ఆయన ఫ్యాన్స్ తిట్టారు. సారీ ఇక నుంచి ఇలా చేయను అని వివరణిచ్చాడు. ఇంతకీ అతనెవరు...అతనే బాలీవుడ్ హీరో టైగర్ ష్రాఫ్. మెటిరియల్ ఆర్ట్స్ బాగా తెలిసిన వ్యక్తి. ప్రస్తుతం 'బాఘి2'దర్శకుడు అహ్మద్ ఖాన్‌తో ఓ సినిమా చేస్తున్నాడు. గోవాలో చిత్రీకరణ జరుగుతోంది. ఇక్కడ గంటకు 60 కి.మి. వేగంతో పరుగెత్తాడు. అదీ మామూలుగా కాదు బస్సులు, కారులు తిరుగుతున్న ప్రాంతంలోనే వాటిని ఛేజ్ చేస్తూ ఆ వేగంతో పరిగెత్తాడంటే ఎంత సాహసం చేశాడో అర్థం చేసుకోవచ్చు. రోడ్డు మీద ఎలా ఇలా పరుగులు పెట్టనిచ్చారంటారా? దానికి ప్రభుత్వ అనుమతి తీసుకున్నారు. పోలీసులు ప్రతి కిలో మీటర్‌కు భద్రతను ఇచ్చారు. అంబులెన్స్‌లను కూడా ఏర్పాటు చేశారు. ఈ ఛేజింగ్ సీన్ టైగర్ ష్రాఫ్ ప్రాటియిక్ మధ్య జరిగింది. గోవాలోని పంజిమ్, దొన పౌల, కాండోలిమ్ వీధుల్లో చిత్రీకరించారు. 12 కెమేరాలను షూటింగ్‌కు ఉపయోగించారట. ఈ విషయాన్ని ఆ చిత్ర దర్శకుడు అహ్మద్ ఖానే స్వయంగా వెల్లడించాడు.


టైగర్ ష్రాఫ్


ఛేజింగ్ చేస్తున్న ష్రాఫ్

నీతో ఏదో చెప్పాలని ఉంది


ఆర్పీ పట్నాయక్

సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ దర్శక నిర్మాతగా మారిన తర్వాత తన సంగీతంతో మ్యూజిక్ ప్రేమికులను అలరించడం తగ్గిపోయింది. అయితే సంగీత ప్రేమికుల కోసం ఆర్.పి ఇప్పుడు 'నీతో ఏదో చెప్పాలని ఉంది' అనే మెలోడీ సాంగ్‌ను సిద్ధం చేశారు. ఈ సాంగ్ ఆదిత్య మ్యూజిక్ ద్వారా మార్కెట్లోకి విడుదలవుతుంది. సంగీతం అందించడమే కాకుండా ట్యూన్‌కు తగ్గ సాహిత్యం కూడా ఆర్.పియే అందించడం విశేషం. ఈ సాంగ్‌ను ఆస్ట్రేలియాలో చిత్రీకరించారు. 'బాహుబలి'లో 'మమతల తల్లి..' పాటను పాడిన సత్య యామిని ఈ పాటను పాడగా, సత్య యామిని, అనుదీప్ కలిసి నటించారు. ఈనెల 5న ఈ పాటను విడుదల చేస్తున్నారు.

'సారథి'లో నిజాయితీ


రేవంత్, అనిత రాఘవ

ధను క్రియేషన్స్ పతాకంపై అల్లం భువన్ దర్శకత్వం వహించి నిర్మించిన చిత్రం 'సారథి'. రేవంత్ జి. హెచ్, సమ్మోహిత్, అనిత రాఘవ, తేజా రెడ్డి హీరో హీరోయిన్స్‌గా నటించారు. చిత్ర దర్శక నిర్మాత అల్లం భువన్ మాట్లాడుతూ 'మొదటి సినిమా కావడంతో పలు జాగ్రత్తలతో తీశాం. ఇందులో రంజిత్ చక్కటి సంభాషణలు రాశారు. ఇక ఈ సినిమా కాన్సెప్ట్ విషయానికి వస్తే.. నిజాయితీగా ఉండటమే రాజకీయ నాయకుల, పోలీసుల విధి అనేది 'సారథి' చిత్ర సారాంశం. ఈనెల 5న సినిమాను విడుదల చేస్తున్నామని' తెలిపారు. హీరో రేవంత్ మాట్లాడుతూ... 25 షార్ట్ ఫిలిమ్స్‌లో నటించాను. మొదటి సారి వెండితెరకి పరిచయం అవుతున్నా. మంచి స్క్రిప్ట్‌ను నమ్ముకుని తీసిన చిత్రమిది. చిత్ర గీతాలను వైజాగ్‌లో విడుదల చేశాం. మంచి స్పందన వచ్చింది. భానుచందర్‌తో కలసి నటించినందుకు హ్యాపీగా ఉందని అన్నారు. హీరోయిన్ అనిత రాఘవ మాట్లాడుతూ 'ఈ చిత్ర కథ చాలా బాగుంది.. చూసే వారికి ఇంట్రెస్టింగ్‌గా అనిపిస్తుంది. మ్యూజిక్ హైలైట్. టీమ్ హార్డ్ వర్క్ ఫిల్మ్ అని చెప్పొచ్చు... ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేశారు. సినిమాను తప్పకుండా ఆదరిస్తారని ఆశిస్తున్నా' అన్నారు.

ధరమ్ తేజ్ 'ఇంటిల్‌జెంట్'


రణవీర్ సింగ్



సాయి ధరమ్ తేజ్ హీరోగా వివి వినాయక్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తయినట్టు తెలిసింది. ఈ చిత్రానికి చాలా టైటిల్స్ పెట్టినట్టు ప్రచారం జరిగింది కానీ ఫైనల్‌గా 'ఇంటిల్‌జెంట్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్టు తెలిసింది. త్వరలో దీన్ని అధికారికంగా ప్రకటించి ఆ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయబోతున్నారు. ఈ సినిమా కథ ప్రకారమే ఈ టైటిల్‌ను ఎంపిక చేశారట. సాయి ధరమ్ తేజ్‌కు 'విన్నర్' నిరాశపర్చిన తర్వాత చేస్తున్న ఈ సినిమా విజయం సాధిస్తుందని నమ్మకంగా ఉన్నాడు.

నా టైమ్ ఇంకా రాలేదు :రణవీర్

రణవీర్ సింగ్‌ను వెండితెరపై చివరిగా 'బఫిక్రీ'లో చూశాం. తర్వాత ఆయన హీరోగా చేసిన సినిమాలు ఒక్కటీ రాలేదు. అదీ 2016లో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇప్పుడు ఆయన ఎంతో ఇష్టంతో చేసిన సినిమా 'పద్మావతి' సంజయ్ లీలా భన్సాలీ దర్శకుడు. ఈ చిత్రం గత ఏడాది డిసెంబర్ ఒకటో తేదీన విడుదల అవుతుందనుకున్నారు. కానీ సెన్సార్ పూర్తికాకపోవడం, రాజ్‌పుత్ కర్ణిసేన ఆందోళన చేయడం వంటి పరిణామాల వల్ల ఇప్పటికీ విడుదల కాలేదు. గత ఏడాదంతా ఒక్క సినిమా అయినా విడుదల కాకపోయినా ఈ ఏడాది మాత్రం వరుసగా విడుదల కానున్నాయి. జోయ అక్తర్ దర్శకత్వంలో 'గల్లీ బాయ్', రోహిత్ శెట్టి కాంబినేషన్‌లో సిమ్బా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా రణవీర్ మాట్లాడుతూ " నేనే చాలా ఆతృతగా ఎదురు చూస్తున్నా. ఏదైనా బెస్ట్ అన్నట్టు చేస్తా. కానీ బెస్ట్ టైమ్ ఇంకా రాలేదు. దేవుడి దయకు ధన్యవాదాలు. కష్టించి చేస్తే విజయాలు అవే వస్తాయని నేను నమ్ముతాను" అని చెప్పాడు రణవీర్.


సుహాన ఖాన్

ఫ్యూచర్ బ్యూటీ!

చిత్రసీమలోకి సినీ స్టార్స్ కుటుంబ సభ్యులు రావడం పరిపాటే. బాలీవుడ్‌లో 2017లో ఎక్కువ మంది వస్తారని ఊహించారు. కానీ శ్రీదేవి కూతురు జహ్నవి కపూర్ మాత్రం వచ్చింది. సైఫ్ అలీ ఖాన్ తనయ సరా అలీ ఖాన్ కూడా ఆ ప్రయత్నంలోనే ఉంది. ఈ ఏడాది మరో తార ఎంట్రీ ఇవ్వబోతుందట. ఆమె షారుఖ్ ఖాన్ కూమార్తె సుహాన ఖాన్. ఎప్పుడూ లేనిది ఈ ప్రచారం ఎందుకు మొదలైందని ఆరా తీస్తే...ఢిల్లీలో జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి ఆమె హాజరైంది. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో నెటిజన్స్ చూసి రాబోయే తరం బ్యూటీ అంటూ కామెంట్స్ పెడుతున్నారు. అక్కడకొచ్చిన కొంతమంది కూడా సుహానను సినిమా ఇండస్ట్రీ ప్రవేశం గురించి ఆరా తీస్తు నవ్వి ఊరుకుందట. వస్తున్నట్టో రానట్టు మాత్రం స్పష్టం చేయలేదు. దీంతో సామాజిక మాధ్యమంలో ఆమె ఎంట్రీ సిద్ధమైనట్టేనని ప్రచారం మొదలుపెట్టారు.

సంగమం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti
విజయవాడ
గురువారం 4 జనవరి 2018

సంస్కృతి, కళలపై రచనలకు ఆహ్వానం!

ఇది కళలు, సంస్కృతి, రంగస్థలం తదితర అంశాలపై ప్రత్యేక పేజీ. మీ ప్రాంత సంస్కృతి, జానపద కళలు, వాటి ప్రత్యేక విశేషాలు; నాటకం, చిత్రకళా ప్రదర్శనలపై మీరు కూడా వ్యాసాలూ, నివేదికలూ రాసి పంపవచ్చు. సాంస్కృతికరంగంలో వస్తున్న మార్పుల మంచిచెడ్డలపై విశ్లేషణాత్మక వ్యాసాలు రాయవచ్చు.

మా చిరునామా : సంగమం, ప్రజాశక్తి, ఎంబి విజ్ఞానకేంద్రం, గవర్నరుపేట, విజయవాడ- 2.

మన పిల్లలు ఇలాగే ఆడి, పాడాలా?



ఒక పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమం. పిల్లలు నృత్యం చేస్తున్నారు. చక్కని తర్ఫీదుతో చూడచక్కని ప్రదర్శన. చుట్టానికి కనువిందుగా ఉంది. కానీ, వింటుంటేనే అపసవ్యత, అసభ్యతా ధ్వనిస్తోంది. పాటలన్నీ సినిమాల్లోవే. అవి ఇటీవలి సినిమాల్లో బాగా పాపులర్ అయిన ప్రౌఢ సినీగీతాలే!

"వచ్చిండే/ మెల్లమెల్లంగ వచ్చిండే/ క్రీము బిస్కట్టు వేసిండే/ గమ్మున కూచోనీయాడే' పాట నడుస్తోంది. 'అయ్‌బాబో ఎంత పొడవో/ ముద్దులెలా ఇచ్చేనే/' .. ఆ భావాన్ని అభినయం ద్వారా చూపిస్తున్నారు తొమ్మిదేళ్ల అమ్మాయిలు. తరువాత మరొక పాట. 'రత్తాలూ రత్తాలూ/ ఓసోసీ రత్తాలూ/ నిను చూస్తే నిలబడనంటాయ్ నా చొక్కా బొత్తాలూ' పాటకు పదేళ్లలోపు అబ్బాయిల డ్యాన్సు. 'అమ్మడూ లెట్స్ డు కుమ్ముడూ' అని తొమ్మిదేళ్ల పాప డ్యాన్సు. 'కొప్పున పూలెట్టుకొని/ బుగ్గన వేలెట్టుకొని/ వీధంట నేనెళ్తుంటే- ఓ కెవ్వుకేక' అని ఇంకో చిన్నమ్మాయి డ్యాన్సు.. దాదాపుగా పాటలన్నింటిదీ ఇదే వరుస. ఉపాధ్యాయులూ, తల్లిదండ్రులూ, వార్షికోత్సవ ముఖ్యఅతిథులూ అభినందన పూర్వకంగా చూస్తున్నారు. పాట ముగిశాక ఘనంగా చప్పట్లు మోగుతున్నాయి. పెద్ద తరగతుల ఔత్సాహిక విద్యార్థులు కొందరు ఈలలు కూడా వేస్తున్నారు.

ఇంచుమించుగా ఏ స్కూలు వార్షికోత్సవం చూసినా ఇదే తీరు.

పిల్లలతో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు సాగాల్సింది ఇలాగేనా?

వయసును బట్టి ఆటాపాటా ...

ఏ సంస్కృతిలోనైనా అన్ని వయసుల వారికీ తగిన సాహిత్యం ఉంటుంది. ఆటపాటలు ఉంటాయి. మనిషి అన్ని వయసులనూ దాటి ప్రయాణం చేస్తాడు. సమాజాన్ని తనదైన కోణంలో చూస్తాడు. వయసుకు తగినట్టుగానే ప్రకృతిని, సమాజాన్ని, ఇతర సంబంధాలనూ అవలోకిస్తాడు. అర్థం చేసుకుంటాడు. తదనుగుణంగానే ఆలోచనలూ ప్రతిఫలిస్తాయి.

ప్రకృతిని మనం ఎలా అర్థం చేసుకుంటున్నాం? ఎలా చూస్తున్నాం? ప్రకృతిలో వచ్చే మార్పుల్లోంచి ఎలాంటి స్పందన పొందుతున్నాం? ఉదాహరణకు వసంతకాలం ఆగమిస్తుంది. ఆకులు రాల్చిన చెట్లు కొత్త చివుళ్లను సంతరించుకుంటాయి. ప్రకృతి నిండా పచ్చదనం పల్లవిస్తుంది. కోయిల కుహూకుహూ రాగాలు వసంతోత్సవ ఉత్సాహాన్ని తట్టి లేపుతాయి. ఆ దృశ్యం ఒక చిన్నిపాపకు ఒకలాంటి అనుభూతిని కలిగిస్తుంది. హృదయవేదికపై ఒక లయబద్ధ ఊహనూ తట్టి లేపుతుంది. ఆ భావానికి పాట కడితే ఎలా ఉంటుంది? ఆ పాటకు నర్తిస్తే ఎలా ఉంటుంది? పసిపాప ప్రకృతిని ఎలా చూస్తుందో అలా ఉంటుంది. ఎలా అర్థం చేసుకుంటుందో అలా ఉంటుంది.

అదే ప్రకృతి దృశ్యం యుక్త వయస్కులకు మరొకలా అనిపిస్తుంది. ఆహ్లాదాన్ని కలిగిస్తుంది కుహూకుహూ రాగంలో ఓ అన్వేషణ అగుపిస్తుంది. ఒక ఆహ్వానం వినిపిస్తుంది. ప్రేమగీతమేదో మనసును తాకుతుంది. అదే వసంతకాల ప్రకృతి దృశ్యం తాత్వికుడికి ఒకలా, జీవితం కాచి వడపోసిన వృద్ధుడికి మరొకలా, ప్రకృతి ప్రేమికుడికి ఇంకొకలా అనుభూతుల, ఆలోచనల పరంపరను రేకెత్తిస్తుంది. అలాంటి సందర్భాన అయా వ్యక్తుల మాటలైనా, పాటలైనా వారి స్పందనకు అనుగుణంగానే ఉంటాయి. అందుకనే ఏ దేశంలోనైనా ఏ ప్రాంతంలోనైనా సాహిత్యం, ఆటలూ పాటలూ మాటలూ వయసుల వారీగానే విభజితమై ఉండటం సహజం, సముచితం.

ఇలాంటి సాహిత్య సృజన తెలుగులోనూ అనంతంగా జరిగింది. జానపదుల సాహిత్యంలోనూ, ఆటపాటల్లోనూ ఇలాంటి ప్రత్యేక దృష్టి, విభజన స్పష్టంగానే ఉంది. జానపద గీతాల్లో వ్యంగ్యమో, ప్రేమభావన వ్యక్తీకరణో ఉన్నప్పటికీ- అది అసభ్యతను స్ఫురింపచేసేదిగా ఉండదు. స్త్రీ పురుషుల అనుబంధాన్నో, పల్లెవాసుల అమాయకత్వాన్నో తేటతెల్లం చేసే ఆహ్లాద గీతాలుగా అవి ఉంటాయి.

జానపద గేయాలూ దేశభక్తి గీతాలూ ...

గిడుగు, గురజాడ, చింతా దీక్షితులు మొదలుకొని ఎంతోమంది బాల సాహిత్యవేత్తలు పిల్లలకోసం పెద్ద సాహిత్య నిధిని సమకూర్చి పెట్టారు. చిన్ని చిన్ని పదాలతో, లయబద్ధత, సరళత ప్రధానంగా ఎన్నో పాటలను, పాటల ఆధారిత ఆటలను జానపదులు సృష్టించారు. అవి ఒక పరంపరగా కొనసాగుతూ వచ్చాయి. తరువాతి కాలంలో లలిత గేయాలు, దేశభక్తి గీతాలూ అనేకం తోడయ్యాయి. ఎన్నో అభినయగీతాలు బాలల ఆలోచనలను, ఆకాంక్షలను వ్యక్తం చేస్తూ, వినేవారిని, చూసేవారిని అలరించాయి.

> **పిల్లలు ఎలా ఆడినా ముద్దుగానే ఉంటుంది. ఎలా పాడినా మధురంగానే ఉంటుంది. ఎందుకంటే బాల్యమే ఒక మాధుర్యం కాబట్టి. పిల్లలు పిల్లల పరిధిలోని పాటలు పాడితే ఇంకా బాగుంటుంది. వయసుకు తగిన నృత్యాలు చేస్తే మరింత హృద్యంగా ఉంటుంది. కానీ, అలా ఉండటం లేదిప్పుడు. పిల్లల వేదికల మీదికి సినిమాలోని ప్రౌఢ గీతాలు ఎక్కుతున్నాయి. పిల్లల హావభావాల్లోకి వయసుకు మించిన అభినయం ప్రవేశిస్తోంది. ఇది హర్షణీయం కాదు, అనుసరణీయమూ కాదు.**

అయితే పదీ, పదిహేనేళ్ళుగా పిల్లల వేదిక మీదకి మొత్తం సినిమా పాటలు వచ్చి చేరాయి. 'పిల్లల చేత పిల్లల పాటలూ, దేశభక్తి గీతాలూ పాడించాలి. నృత్యం చేయించాలీ' అన్న భావనకు గండిపడింది. సినిమాలు, టీవీలు జీవితం నిండా ఆక్రమించి పెద్దలకు వేరే గత్యంతరం లేదన్నంత ప్రభావాన్ని కలిగించాయి. ప్రభావాన్వితమైన సినిమా సంగీతం సహజంగానే ఆబాలగోపాలాన్ని ఒకే ధ్వనిపై ఊగిస్తోంది, తూగిస్తోంది. పాటలో పరమార్థాలు, ద్వంద్వార్థాలు, స్పష్టాతిస్పష్టమైన ఏకార్థ శృంగార భావాలూ ఘనంగా వినిపిస్తున్నా, అభినయంలో కళ్లకు కనిపిస్తున్నా- పెద్దలకు అవి పట్టడం లేదు. భావానికి అనుగుణంగా మేని విరుపులు, హొయలూ పిల్లలు ప్రదర్శిస్తున్నా చప్పట్లు కొట్టడానికే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులూ ఇతర పెద్దలూ పరిమితం అవుతున్నారు. ఈ పరిస్థితి అభ్యంతరకరం. ఆందోళనాకరం కూడా.

ఎక్కడ చూసినా సినీ నృత్యాలే!

పాఠశాల వార్షికోత్సవం కానివ్వండి, పిక్నిక్ అవనీయండి, ఫ్యామిలీ పార్టీ కానివ్వండి, పండగ సందర్భం అవనివ్వండి.. ఎక్కడైనా ఇప్పుడు సినీ సంగీతం మార్మోగిపోతోంది. సినిమా అత్యంత జనరంజకమైన మాధ్యమం కాబట్టి – ఈ ప్రతిస్పందన ప్రతిఫలనాలు వెంటనే సర్వత్రా వ్యాపిస్తున్నాయి.

'నెత్తిన బుట్టెట్టుకొని బుగ్గన వేలెట్టుకొని'
'సింహంలాంటి చిన్నోడు వేటకొచ్చాడే
అడవిలాంటి అందాల్ని ఆక్రమించాడే'
'హాయి హాయి హాయి హాయీ నాయకా/ హాయినింక వాయిదాలు వేయక/' వంటి పాపులర్ సినిమా పాటలు పిల్లల కార్యక్రమాల్లో భాగమవుతున్నాయి. స్క్రీన్‌మీద, ఇంట్లో, టీవీల్లో, ఎఫ్‌ఎం రేడియోల్లో, మొబైల్ ఫోన్‌లో వినీవినీ తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులూ వాటినే ఎంపిక చేస్తున్నారు.

సినిమాల్లో ఒక ప్రత్యేక సందర్భం కోసం పెద్దలను మాత్రమే దృష్టిలో పెట్టుకొని, అలాంటి పాటలను సినిమా వాళ్ళు సృష్టిస్తారు, చిత్రీకరిస్తారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాల్లోకి వాటినే దిగుమతి చేసుకోవటం మన సాంస్కృతిక దారిద్ర్యానికి అద్దం పడుతుంది. ఈ ప్రపంచీకరణ యుగంలో పిల్లల ప్రపంచంలోకి పెద్దల ఆశలూ, ఆకాంక్షలూ ప్రబలంగా ప్రవేశించాయి. తమ వ్యూహాలకు అనుగుణంగానే పిల్లలు తయారవ్వాలన్న లక్ష్యాలు బలంగా ఏర్పడి, ఆచరణలో అమలవుతున్న కాలంలో మనం ఉన్నాం. అదే ఒరవడి పిల్లల ఆటపాటల్లోనూ బలంగా చొరబడి రాజ్యమేలుతోంది.

ఇది మారాలి!


ఇలాంటి పరిస్థితిని మనం ప్రత్యేకించి ఆహ్వానించకపోయినా- ఆమోదించి హర్షధ్వానాలు చేసే 'అంగీకార సృష్టి' విజయవంతంగా జరిగిపోయింది. కానీ, ఇది అనుమతించదగినది కాదు. పిల్లల, పెద్దల ఆలోచనలపై ప్రభావం చూపించే ఇలాంటి పాటలను బాలల సాంస్కృతిక వాకిట్లోకి రాకుండా చూడాలి. స్పష్టమైన విభజన రేఖ ఉండాలి. మనకు బాలల గేయ సాహిత్యం చాలా ఉంది. దానిని వెతికే, వెలికితీసే పనిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులూ చేపట్టాలి. ఆ అభినయ గీతాలు సైతం ఇప్పటికీ అనుకూలంగా లేవనుకుంటే కొత్తవి సృష్టించుకోవాలి. ఉన్నవాటిలో మార్పులూ చేర్పులూ చేసుకోవాలి. ఫాస్ట్‌ఫుడ్ ధోరణి ఇప్పుడు ఒక అలవాటుగా మారిపోయింది. శ్రమ లేకుండా అన్నీ జరిగిపోవాలి. బాలల సాంస్కృతిక సంరంభంలోనూ ఇదే ధోరణి నడుస్తోంది. ఆ ఆలోచన పోవాలి. పిల్లల అభినయంలో ఏ పాటలు ఉండాలో, ఏ మాటలు ఉండాలో నిర్దిష్టమైన భావనతో, ఆచరణతో ఉండాలి. ఈ బాధ్యత తల్లిదండ్రులది, ఉపాధ్యాయులది, విద్యాసంస్థల యాజమాన్యాలది. ప్రత్యామ్నాయ సాంస్కృతిక విధానం గురించి ఆలోచించేవారు ఈ అంశాన్ని మరింతగా పట్టించుకోవాలి.

పిల్లలు దేశానికి దీపాలు. వారి వెలుగులు సంస్కృతికి ప్రాణప్రదంగా, సమాజానికి ఆరోగ్యప్రదంగా ప్రసరించాలి.

- సత్యాజీ

నేటి కార్టూన్లలో ఆధునిక దృక్పథం ఎంత?

కార్టూన్లు నవ్వించాలి. నవ్విస్తూనే ఓ ఆలోచనా శకలాన్ని మెదళ్లలోకి విసిరేయాలి. వ్యంగ్యం పూయించాలి. పూయిస్తూనే ఓ అంతరంపైనో, అవకరంపైనో ఆలోచన రేకెత్తించాలి. కూడని తీరులపై చురక వేయాలి. అది ఎవరికి తగలాలో వాళ్లకు తగలాలి. వాళ్లల్లో ఇంగితం మేల్కోవాలి. కార్టూన్ వట్టి గీత కాదు; చురుక్కుమనే వాత కూడా! గీతా వాక్కులకు ఉన్న చేతనా శక్తి అది. మరి పాత ఐడియాతోనే కొత్త కాలంలోనూ గీసేస్తే కుదర్దు. పాత పచ్చళ్లు వదిలేసి, కొత్త తోవల్లో పోవాలి. అప్పడే కార్టూన్‌కు ప్రయోజనం. కార్టూనిస్టుకు విలువ.



లోగడ ఒక కళా విమర్శకుడు తన వ్యాసాల్లో కార్టూన్ల గురించి ఒక మాట అన్నారు : 'తెలుగు కార్టూన్లు ఇంతకుముందు వాళ్లు ఎక్కడ మొదలు పెట్టి ఆపారో.. తరువాత వచ్చినవాళ్లు కూడా అదే ఒరవడి, ఆలోచనలతో కార్టూన్లు వేస్తున్నారు. దశాబ్దాలుగా ఇదే జరుగుతుంది' అని. ఇది చెప్పి కూడా దశాబ్దాలు గడిచిపోయిందనుకోండి. కార్టూన్లకు సంబంధించిన ఐడియాలను పాత వాటినే కొనసాగిస్తున్నామన్నది ఆయన అభిప్రాయం. ఇటీవల కాలంలో సోషల్ మీడియా పెరగడంతో కార్టూన్ గ్రూపుల్లో ఇదే ఒరవడి చూడాల్సి వస్తోంది. తెలుగు కార్టూనిస్టులు సంఖ్యాపరంగా ఎక్కువే ఉన్నారు. చాలా కొద్దిమంది మాత్రమే భిన్నంగా ఆలోచిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వినూత్నమైన కార్టూన్లు వేస్తున్నారు.

ఇపుడు 2018లో ఉన్నాం. ప్రపంచం ప్రతిరోజూ మారిపోతోంది. చాలా పరిణామాలను అర్థంచేసుకోవడం కష్టంగానూ మారుతోంది. ఈ నేపథ్యంలో ఇంకా మన కార్టూన్లు పురుషులు వంట చేస్తున్న అంశాలపై ఉండటం అవసరమా? అందులో ఇంకా హాస్యం ఉందా? (ఆడవాళ్ల శ్రమను గౌరవించే ఆలోచనా విధానం పురుషుల్లో పెరిగింది. వాళ్లకు సహాయం చేసేవాళ్లూ పెరిగారు. ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటూ పనిచేసుకుంటున్నారు) కానీ కార్టూనిస్టులేమో ఇంకా పురుషుడు వంట చేయడం, అప్పడాల కర్రతో మోదటం, నెత్తిమీద బొడిపెలు లేవడం.. వంటివి వేస్తున్నారు. (నలభై ఏళ్ల పైగా వేశాం కదా ఈ కార్టూన్లు!) కార్టూనిస్టు హాస్యదృష్టితో పాటు సామాజిక దృష్టి కూడా కలిగి ఉండాలి కదా? మొన్నొక కార్టూనిస్టు వీధులు తుడిచేవాళ్లు, చెత్తను ఇంటి నుంచి తీసుకువెళ్లే కార్మికులు కనీస వేతనం పెంచాలని డిమాండ్ చేస్తే – అదేదో తప్పన్నట్లు సాఫ్ట్‌వేర్ వాళ్ల కంటే చెత్త ఊడ్చేవాళ్లే ఎక్కువ డిమాండ్ చేస్తున్నట్లు కార్టూన్ వేశారు. అంటే ఆ కార్టూనిస్టుకి కనీసవేతన చట్టం మీద అవగాహన లేదు. లేదంటే మన రోజువారీ చెత్తను తీసుకెళ్లేవారి మీద గౌరవం లేదు. అలాగే పనిమనుషుల మీద దశాబ్దాలుగా వేస్తోన్న కార్టూన్లు కూడా. వాళ్లను పనిలో పెట్టుకున్నవాళ్లు పనిని బట్టి వేతనం ఇవ్వాలని ప్రభుత్వాలు చెబుతుంటే – మనం మాత్రం ఇంకా పనిమనుషులను చులకన చేసే కార్టూన్లు, (వాళ్లు కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుని వచ్చినట్లు, కంఫర్ట్స్ కోరుకుంటున్నట్లు, అరగంటకోసారి హార్లిక్స్ అడుగుతున్నట్లు వెకిలి బొమ్మలు వేస్తాం) కానీ వాస్తవం ఏమిటి? ఇళ్లల్లో పనిచేసే ఆడవాళ్లకు మిగిలిన పదార్థాలు యజమానులు ధర్మాత్ముల్లా పెడతారు.. లేదంటే లైంగికంగా వేధింపులు జరుగుతాయి, వాళ్లకు శ్రమకు తగ్గ ఫలితం ఇవ్వరు.

అంటే సీరియస్ కార్టూన్లు మాత్రమే వేయమని కాదు. కార్టూనిస్టులుగా మన దృక్పథం బట్టే సమాజంలో ప్రజల నుంచి, ఎడిటర్ల నుంచి, మేధావుల నుంచి, రచయితల నుంచీ గౌరవం ఉంటుంది.

ఒకసారి విశాఖపట్నంలో 'విశాఖ కార్టూనిస్టుల సంఘం' (వికాసం) ఆధ్వర్యాన కార్టూన్ల ప్రదర్శన పెడితే రచయిత ఎల్ఆర్ స్వామి ఒక మాట అన్నారు: దయచేసి కవులను కించపరిచే కార్టూన్లు వేయొద్దని. చాలాకాలం నుంచీ కవులను కించపరిచే కార్టూన్లు ఉంటున్నాయని. నిజమే కవులను కించపరిచే కార్టూన్లు వేయకూడదు.. తాజాగా ఓ పత్రికలో వచ్చిన కార్టూనూ విమర్శలకు గురైంది. (పొరపాటు జరిగిందని ఆ పత్రిక క్షమాపణ కూడా చెప్పింది అనుకోండి) కానీ, కవిత్వం పేరుతో జరిగే ధోరణులను వ్యంగ్యంగా వేయవచ్చు. ప్రస్తుతం ఎవరికి వారు మహాకవులుగా ప్రకటించుకుంటున్నారు వాటిమీద వేయొచ్చు. ఇజాల మీద కార్టూన్లు వేయొచ్చు. లేదంటే రికార్డు బ్రేకు కవిసమ్మేళనాల (48 గంటలు) మీద వేయొచ్చు. మన ధోరణి బట్టే మన కార్టూన్లకు సాహితీ గౌరవం ఉంటుంది. ప్రజలను, సాటివాళ్లను కించపరిచే ధోరణి సోషల్ మీడియాలో (ఇదీ అసహనమా?) పెరిగిందనేది వాస్తవం. మనం కార్టూన్లు, కథలు రాసి అవతల వాళ్లను ఏమైనా అనొచ్చు అనే ధోరణి పెరుగుతోంది. తిరిగి అవతలి వాళ్లు కథో, కార్టూనో వేస్తే పెడబొబ్బలు పెడుతున్నారు. 'తమలపాకుతో ఒకటిస్తే తలుపుచెక్కతో కొట్టేవాడు' ఉంటాడుగా మరి.

ఇక తెలుగు పొలిటికల్ కార్టూన్లు చాలాకాలం క్రితమే వాటి ప్రాభవాన్ని కోల్పోవడం మొదలుపెట్టాయి. జీతమిచ్చే ఆసామి మీద స్వామిభక్తి ఉండొచ్చుగానీ ఒంగొని నమస్కారం పెట్టే బదులు సాష్టాంగ నమస్కారాలు పెడుతున్నారు. కొన్ని పత్రికల పొలిటికల్ కార్టూన్లు పాఠకుల కంటే ఎం.డి గారిని సంతోషపరచడానికే ఎప్పుడో మారిపోయాయి. ప్రభుత్వాలను భజన చేసే కార్టూన్లు బాగా పెరిగాయి. తెలంగాణా ఆవిర్భావంతో ఈ ఒరవడి మరింత పెరిగింది. తెలుగు కార్టూనిస్టులు ఒకసారి అవలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

- హరి వెంకట్ (కార్టూనిస్ట్)
98660 84124



:: నిర్విరామ నృత్య ప్రదర్శనలో కళాకారుల ప్రదర్శన

కనుల పండువగా నృత్యోత్సవం

భారతీయ నృత్య వైభవంతో కృష్ణాతీరం పరవశించింది. రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి సౌజన్యంతో భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఎబిసి ఫౌండేషన్ సంయుక్తంగా డిసెంబరు 30వ తేదీన జాతీయ సమైక్య నృత్యోత్సవం ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిషా, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలకు నుంచి 405 మంది నృత్య కళాకారులు 405 నిమిషాల పాటు నృత్యప్రదర్శనలిచ్చి 'హానర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సు' స్థానం దక్కించుకున్నారు. వివిధ రాష్ట్రాల వచ్చిన కళాకారులు పలు నృత్య రీతులను ప్రదర్శించి, జాతీయ సమైక్యతను చాటిచెప్పారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం ఈ కార్యక్రమానికి వేదికైంది. కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ, ఆంధ్రనాట్యం నృత్యాంశాలతో కళాకారులు ఆకట్టుకున్నారు. కుండపై నిలిచి నాట్యం చేయటం, దీపాలు చేతబూని అభినయించటం వంటి నృత్యరీతులను అలవోకగా ప్రదర్శించారు. నాట్యగురువు వారి శిష్య బృందంతో వచ్చి ప్రదర్శనలు ఇచ్చారు. అంతర్జాతీయ కూచిపూడి నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్‌లను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ స్థాయి గురువుల సమక్షంలో తాము నృత్య ప్రదర్శనలు ఇచ్చినందుకు నాట్యగురువుల, యువకళాకారులు ఆనందించారు.



:: నాట్యాచార్యులకు, సినీనటుడు జగ్‌మోహన్‌మిత్రకు సన్మానం

- ప్రజాశక్తి, సత్యనారాయణపురం

అండర్-19 ప్రపంచకప్‌కు భారత అంపైర్లు


అనిల్ చౌదరి


సీకే నందన్

దుబాయ్ : భారత అంపైర్లు అనిల్ చౌదరి, సీకే నందన్‌కు అరుదైన అవకాశం దక్కింది. జనవరి 13 నుంచి న్యూజిలాండ్‌లో జరగనున్న అండర్-19 ప్రపంచకప్ పోటీలకు అంపైర్లగా విధులు నిర్వహించే అవకాశం వారికి దక్కింది. బుధవారం ఐసీసీ అండర్-19 ప్రపంచకప్‌కు అంపైర్లు, మ్యాచ్ రిఫరీల వివరాలను వెల్లడించింది. అనిల్ చౌదరి భారత్-శ్రీలంక మధ్య జరిగిన సిరీస్‌కు మ్యాచ్ రిఫరీగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు భారత్, ఆసీస్ మాత్రమే అండర్-19 ప్రపంచకప్ టోర్నీలో మూడు సార్లు విజేతగా నిలిచాయి. ముంబయి ఆటగాడు పృథ్వీ షా సారథ్యంలోని భారత జట్టు డిసెంబరు 27న న్యూజిలాండ్ బయల్దేరిన సంగతి తెలిసిందే. ఈ జట్టుకు కోచ్ బాధ్యతలను రాహుల్ ద్రవిడ్ నిర్వహిస్తున్నాడు. టోర్నీలో భాగంగా భారత్ తొలి మ్యాచ్‌ను జనవరి 14న ఆసీస్‌తో తలపడనుంది.

మాన్రో రికార్డ్ సెంచరీ

టి20 సిరిస్ కైవసం



ఓవల్ (న్యూజిలాండ్) : వెస్టిండీస్-న్యూజిలాండ్ జట్ల మధ్య ఇక్కడ జరుగుతున్న మూడో టి20లో కివీస్ 119 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. విండీస్‌తో జరుగుతున్న మూడో టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ హిట్టర్ కాలిన్ మన్రో రికార్డ్ సెంచరీతో చెలరేగాడు. కేవలం 47 బంతుల్లోనే శతకం పూర్తి చేసుకున్న మాన్రో.. అంతర్జా తీయ టీ20ల్లో మూడో సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి బ్యాట్స్‌మెన్‌గా రికార్డ్ సృష్టించాడు. తర్వాతి స్థానాల్లో రెండు సెంచరీలతో భారత ఓపెనర్ రోహిత్ శర్మ, విండీస్ ఆటగాళ్లు క్రిస్ గేల్, ఎవిన్ లెవీస్‌లు ఉన్నారు. మార్టిన్ గప్తిల్ 63, మాన్రో 104 (53 బంతుల్లో 3 ఫోర్లు, 10 సిక్సర్ల) సాయంతో మొదటి వికెట్‌కు 11.3 ఓవర్లలోనే 136 పరుగులు జోడించారు. వీరిద్దరు దూకుడుగా ఆడటంతో న్యూజిలాండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 243 పరుగుల భారీ స్కోర్ చేసింది. విండీస్ బౌలర్లలో బ్రాత్‌వైట్ రెండు వికెట్లు తీశాడు. అనంతరం భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన విండీస్ జట్టు 124 పరుగులకే ఆలౌట్ కావడంతో సిరీస్‌ను 2-0 తేడాతో కైవసం చేసుకుంది.

చెన్నైకు షాక్

పిబిఎల్‌లో ఢిల్లీ చేతిలో ఘోర పరాజయం

లక్నో : చెన్నై స్మాషర్స్ జట్టు ఢిల్లీ డాషర్స్ చేతిలో 0-3తో ఘోర పరాజయం పాలైంది. ఢిల్లీ ఆడిన తొలి ట్రంప్ పురుషుల డబుల్స్ మ్యాచ్‌లో చెన్నై 15-13, 15-11తో గెలిచి 2-0 ఆధిక్యత సంపాదించింది. చెన్నై జట్టు ఆ తర్వాత ఆడిన నాలుగు మ్యాచ్‌లలోనూ ఓటమిపాలైంది. పురుషుల సింగిల్స్ మ్యాచ్ రెండూ ఓటమి చెందడంతో 0-0 పాయింట్లతో ఇరుజట్లు సమంగా నిలిచాయి. మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో పి.వి. సింధూ (చెన్నై) ఎస్.జె. హున్ (ఢిల్లీ) చేతిలో 15-11, 13-15, 14-15తో ఓడిపోవడంతో 1-0 ఆధిక్యతలో ఢిల్లీ డాషర్స్ విజయం సాధించింది. నిర్ణయాత్మకమైన మిక్సిడ్ డబుల్స్‌లో మ్యాచ్‌ను ఢిల్లీజట్టు ట్రంప్ మ్యాచ్‌గా తీసుకొని 11-0, 11-0తో పొన్నప్ప జోడీ గెలిచి 3-0తో చెన్నైను ఓడించి సంచలనం సృష్టించింది.

టెస్ట్ సిరీస్‌కు భారత్ - దక్షిణాఫ్రికా సిద్ధం

రేపే కేప్‌టౌన్‌లో తొలి టెస్ట్ ప్రారంభం


ఫ్రీడం కప్‌తో ఇరుజట్ల కెప్టెన్లు

ఫ్రీడం ఎవరికో?

కేప్‌టౌన్ : దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా టీమిండియాకు 25 ఏళ్ళ తర్వాత సిరీస్ విజయం చేజిక్కించుకొనే అవకాశం లభించింది. స్వదేశంలో శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో ఘన విజయం సాధించిన భారత జట్టు సమిష్టిగా రాణిస్తే రికార్డు విజ యం సాధించడం ఖాయం. ఇప్పటివరకు దక్షిణాఫ్రికాలో ఎన్నో సార్లు పర్యటించినప్పటికీ ఒక్కసారి కూడా భారత జట్టు సిరీస్ విజయం చేజిక్కించుకోలేదు. ప్రస్తుతం విరాట్ కోహ్లి సారథ్యం లోని భారతజట్టు... డుప్లెసిస్ సారథ్యంలోని దక్షిణాఫ్రికా జట్టు తలపడే ఈ టెస్ట్ సిరిస్‌కు ఫ్రీడమ్ సిరీస్ అని నామకరణం చేశారు. కోహ్లి సారథ్యంలోని భారత జట్టు గత ఏడాది వరుసగా ఎనిమిది సిరీస్ విజయాలు సాధించింది. ప్రస్తుతం తొమ్మిదవ సిరీస్ విజయం కోసం భారత జట్టు దక్షిణాఫ్రికా పర్యటనకు బయలు దేరింది. చివరిసారిగా టీమిండియా శ్రీలంక జట్టుతో డిసెంబర్‌లో టెస్ట్‌మ్యాచ్‌లో తలపడింది. దక్షిణాఫ్రికా సిరీస్ విజయం సాధించి, ఆ తర్వాత పర్యటన అయిన ఆస్ట్రేలియాతోనూ సిరీస్ విజయం సాధిస్తే 10 సిరీస్ రికార్డ్ విజయాలు సాధించిన జట్టుగా నిలిచిపోనుంది. 66 రోజుల సుదీర్ఘ పర్యటనలో భాగంగా టీమిండియా మూడు టెస్ట్‌లు, ఆరు వన్డేలు, మూడు టి20 మ్యాచ్‌లలో దక్షిణాఫ్రికాతో తలపడనుంది. 1992లో మహమ్మద్ అజారుద్దీన్ సారథ్యంలోని భారతజట్టు దక్షిణాఫ్రికాలో పర్యటించి 0-1తో సిరీస్ ఓడిపోయింది. ఆ తర్వాత మొత్తం 17 టెస్టుల్లో ముఖాముఖి తలపడి కేవలం రెండు మ్యాచ్‌లలో విజయం సాధించి, ఎనిమిది మ్యాచ్‌లలో ఓడింది. ఏడు మ్యాచ్‌లు డ్రాగా ముగిసాయి.

తొలి టెస్ట్‌కు జడేజా దూరం?

టీమిండియా ఆల్‌రౌండర్ జడేజా తొలి టెస్ట్‌కు దూరమయ్యాడు. వైరల్ జ్వరంతో అతడు బాధపడుతున్న కారణంగా అతడు తొలిటెస్ట్ ఆడే అవకాశాలు తక్కువగా ఉన్నాయని బుధవారం బిసిసిఐ మెడికల్ టీమ్ తెలిపింది. జనవరి 5 నుండి ప్రారంభం కానున్న ఈ టెస్ట్‌లో అతడు ఆడేది లేనిది ఆరోజు ఉదయం జరిపే ఫిట్‌నెస్ పరీక్ష బట్టి తేలనుంది.

భారీ స్కోర్లు చేస్తే చాలు..

విజయం మనదే!

సచిన్



ముంబాయి : దక్షిణాఫ్రికా పర్యటనలో కోహ్లి సేన చరిత్ర సృష్టించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని టీమిండియా మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ తెలిపాడు. గత 25 ఏళ్ళలో టీమిండియా జట్టు ఒక్కసారి కూడా దక్షిణాఫ్రికాలో సిరిస్ విజయం సాధించలేదన్నాడు. ప్రస్తుతం కోహ్లి సారథ్యంలోని భారత జట్టు పటిష్ఠంగా ఉండి, పెద్ద స్కోర్లు చేయగల సత్తా గల క్రీడాకారులతో భారతజట్టు పటిష్టంగా ఉందని అన్నాడు. టాప్ ఆర్డర్‌తో పాటు మిడిలార్డర్ బ్యాట్స్‌మన్లు సమిష్టిగా రాణిస్తే దక్షిణాఫ్రికాను ఓడించడం ఏమంత కష్టం కాదన్నాడు. కోహ్లి టీమ్ చాలా బ్యాలెన్స్‌డ్‌గా ఉందని, పూర్తి సన్నద్ధమై తొలిటెస్ట్‌కై ఎదురుచూస్తోందని టెండూల్కర్ అన్నాడు. దక్షిణాఫ్రికాపై తొలిగా బ్యాటింగ్ చేసి భారీ స్కోర్ సాధిస్తే విజయం దానంతట అదే వస్తుందని అభిప్రాయపడ్డాడు. టీమ్ సక్సెస్ అయితే కోహ్లి సక్సెస్ అవుతాడని, విరాట్ తన నేచురల్ గేమ్ ఆడాలని టెండూల్కర్ అన్నాడు. కోహ్లి ఒక్కడే రన్స్ చేస్తే సరిపోదని, జట్టులోని ప్రతి క్రీడాకారుడు సమిష్టిగా రాణించి భారీస్కోర్ సాధనకు దోహదపడాలన్నాడు. ఇక ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా టీమ్‌కు పెద్ద ఆస్తి అని సచిన్ అభిప్రాయపడ్డాడు. పాండ్యాను కపిల్‌దేవ్‌లాంటి వాడని... పాండ్యా 17, 18 ఓవర్లు వేయడంతోపాటు ఏడు లేదా 8వ నంబర్‌లో బ్యాటింగ్ చేయగలగడం టీమ్‌కు పెద్ద ఆస్తి అన్నాడు. అతనికిది చాలా ముఖ్యమైన సిరీస్. కోహ్లి కూడా అతనిపైనే ఆధారపడతాడని సచిన్ అభిప్రాయం వ్యక్తం చేశాడు. నాలుగో పేసర్‌తోపాటు మంచి మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ పాత్రను పాండ్యా సమర్థంగా పోషించగలడని, దీనివల్ల టీమ్‌కు ముగ్గురు సీమర్లతో బరిలో దిగే అవకాశం కలుగుతుందని సచిన్ అన్నాడు. కపిల్‌దేవ్ ఆడిన రోజుల్లోనూ టీమిండియాకు అంత అనుకూలత లేదు. అప్పుడు కూడా ముగ్గురు పేసర్లతో దిగి నాలుగో పేసర్ కూడా టీమ్‌కు అందుబాటులో ఉంటాడన్నది కనీసం ఊహించలేని విషయం. గరిష్టంగా ముగ్గురు పేసర్లతోనే దిగేవాళ్లం. మనోజ్ ప్రభాకర్ అందులో ఒకడు. కానీ ఇప్పటి టీమ్‌కు ఆ అవసరం లేదని సచిన్ టెండూల్కర్ అన్నాడు. ఇక సౌతాఫ్రికా టూర్‌లో స్లిప్ క్యాచ్‌లు మ్యాచ్‌లను నిర్దేశిస్తాయని మాస్టర్ చెప్పాడు. సౌతాఫ్రికా పిచ్‌లలో బౌన్స్ ఎక్కువగా ఉంటుంది కాబట్టి స్లిప్ ఫీల్డర్లకు ఈజీగా క్యాచ్‌లు అందుతాయని, ఇండియాలో ఆ పరిస్థితి ఉండదని సచిన్ అభిప్రాయపడ్డాడు. ఇక సఫారీ టీమ్‌లో హాషీమ్ ఆమ్లా, డివిలియర్స్ కీలకమని మాస్టర్ చెప్పాడు. ఈ ఇద్దరి తర్వాత డుప్లెసిస్ కీలకంగా ఉంటాడని, వీళ్లను టీమిండియా త్వరగా ఔట్ చేయగలిగితే పని సగం పూర్తయినట్లేనని సచిన్ స్పష్టంచేశాడు.


పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి- భీమునిపట్నం, విశాఖ

ఆంధ్ర విశ్వవిద్యాల యం, రఘు ఇంజినీరింగ్ కళాశాల సంయుక్తంగా నిర్వ హిస్తున్న సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయ క్రికెట్ పోటీ లను బుధవారం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల లో మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాస రావు ప్రారంభించారు. ప్రభుత్వం ప్రత్యేకంగా క్రీడల విధానాన్ని రూపొందించి అమలు చేస్తోందన్నారు. విశాఖలో అగనంపూడి వద్ద 150 ఎకరాల్లో సమీకృత క్రీడా ప్రాంగణాన్ని నిర్మిస్తుందని తెలిపారు. యువత విద్యతో సమానంగా క్రీడలకు ప్రాధాన్యమి స్తూ బహుముఖ ప్రతిభ చూపాలని సూచించారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు ప్రత్యేకంగా మార్కుల్లో వెయిటేజీ ఇచ్చే ఆలోచన ఉందన్నారు. అనంతరం రఘు కళాశాలలో చదువుతూ రంజీ జట్టులో స్థానం సాధించిన వై.పృధ్వీరాజుకు రూ.20 వేలు నగదు పురస్కారాన్ని కళాశాల యాజమాన్యం తరపున గంటా అందజేశారు. క్రీడా పాత్రికేయులు జి.నర్సింహరావు, ఉమామహేశ్వరరావును సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-మైలవరం (కృష్ణాజిల్లా)

కృష్ణాజిల్లా మైలవరంలోని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల రెండో తేదీన ప్రారంభమైన రాష్ట్రస్థాయి సీనియర్ బాలుర అంతర జిల్లాల ఫుట్‌బాల్ పోటీలు రెండోరోజు బుధవారం హోరాహోరీగా జరిగాయి. 13 జిల్లాలకుగాను 10 జిల్లాల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. బుధవారం జరిగిన పోటీల్లో కడప జిల్లా తూర్పుగోదావరి జిల్లాపై 0-1 గోల్‌తో విజయం సాధించింది. నెల్లూరు, పశ్చిమగోదావరి జిల్లాల మధ్య పోటీ డ్రాగా ముగిసింది. కృష్ణాజిల్లా, ప్రకాశం జట్టుపై 1-0 గోల్ తేడాతో విజయం సాధించింది. చిత్తూరు, కర్నూలు జిల్లాపై 2-1 గోల్ తేడాతో, తూర్పు గోదావరి, గుంటూరుపై 2-1 గోల్ తేడాతో, నెల్లూరు, పశ్చిమగోదావరిపై 1-0 గోల్‌తో విజయం సాధించాయి. పోటీలకు ముఖ్యఅతిధులుగా హాజరైన లకిరెడ్డి బాలిరెడ్డి, రాష్ట్ర ఫుట్ బాల్ సంఘం ఉపాధ్యక్షులు డి.జగన్నాధరెడ్డి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం బాలిరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు సమయ స్పూర్తి, పట్టుదల కలిగివుండాలన్నారు.


క్రీడా కారులను అభినందిస్తున్న శాప్ ఎండి

క్రీడాకారులకు అభినందన సభ

ప్రజాశక్తి - విజయవాడ స్పోర్ట్స్

జన్మభూమి కార్యక్రమంలో భాగంగా 5న విజయనగరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో బాల్ బాడ్మింటన్ క్రీడా ప్రదర్శన నిర్వహించనున్నట్లు శాప్ విసి, ఎండి, ఎన్.బంగారురాజు పేర్కొన్నారు. బుధవారం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏపి సబ్ జూనియర్ బాల్ బాడ్మింటన్ జట్ల అభినందన సభ జరిగింది. 2017 డిసెంబర్ 26 నుంచి 30 వరకు భువనేశ్వర్‌లో జరిగిన 37వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి బాల్ బాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టు బంగారం పతకం, బాలికల జట్టు వెండి పతకం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బంగారు రాజు క్రీడాకారులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజేతలుగా నిలచిన బాలుర జట్టుకు రూ.లక్ష , బాలికల జట్టుకు రూ.50 వేల నగదు బహుమతి అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో శాప్ ఓఎస్‌డి పి.రామకృష్ణ, రాష్ట్ర బాల్ బాడ్మింటన్ సంఘం కార్యదర్శి ఆర్.వెంకటరావు పాల్గొన్నారు.

బాబు పాలన విశ్వసనీయతకు పాతర

51వ రోజు సంకల్పయాత్రలో జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - వాల్మీకిపురం

రాష్ట్రంలో నాలుగేళ్ల ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన విశ్వసనీయతకు పాతరేసిందని ప్రతిపక్ష నాయకుడు, వైఎస్ఆర్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. 51వ రోజు బుధవారం ప్రజా సంకల్ప యాత్ర చిత్తూరు జిల్లా పీలేరు నియోజకవర్గంలోని వాల్మీకిపురం మండలం చింతపర్తి నుంచి ప్రారంభమయ్యింది. చింతపర్తి, పాతకోటపల్లి, బీదావాండ్లపల్లి, గండబోయనపల్లి, టేకలకోన మీదుగా కలికిరికి చేరుకుంది. మహిళలు, రైతులు, చేనేత కార్మికులు, మైనార్టీలు జగన్‌తో కలిసి పాదయాత్రలో పాల్గొని తమ సమస్యలను విన్నవించారు. టమోటా, వేరుశనగకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. టిడిపి ప్రభుత్వంలో అర్హులకు పింఛన్లు, ఇళ్లు, రేషన్‌కార్డులు అందడం లేదని వాపోయారు. కలికిరి బహిరంగసభలో మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి పేదవానికి సొంతింటి కల నెరవేరుస్తామన్నారు. లబ్ధిదారుని కుటుంబంలోని మహిళ పేరుతో ఇంటిని రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. చేనేత, రైతన్నల ఆత్మహత్యల నివారణకు వైఎస్ఆర్ బీమా చేపట్టనున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి డ్వాక్రా రుణమాఫీ చేస్తామన్నారు. వడ్డీ రాయితీతో రుణాలను ఇస్తామన్నారు. వైసిపి ప్రకటించిన నవరత్నాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తామన్నారు. ప్రస్తుత టిడిపి ప్రభుత్వం తప్పుడు హామీలతో ప్రజలను మోసగించి, అధికారంలోకి వచ్చిన చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. విడతలు విడతలుగా రుణమాఫీ చేస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా రైతుల ఖాతాలలో డబ్బు జమ కాలేదన్నారు. ఈ యాత్రలో రాజంపేట ఎంపి మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, నగిరి ఎమ్మెల్యే ఆర్.కే రోజ పాల్గొన్నారు.


వృద్ధురాలి కష్టాలు తెలుసుకుంటూ, చిన్నారితో కలిసి నడుస్తూ, సంకల్పయాత్రలో జగన్‌తో పాటు ఎంపి మిథున్‌రెడ్డి

ఎన్‌ఎంసి బిల్లును ఉప సంహరించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసి) బిల్లును ఉపసంహరించుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. వైద్య విద్యలో ప్రమాణాలు, నాణ్యమైన విద్యా సేవలందించే లక్ష్యంతో రాజ్యాంగం అమలులో రావడానికి 16 ఏళ్ల ముందే ఎంసిఐని ఏర్పాటు చేశారని ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు కె రమేష్, వై రాము బుధవారం ఒక ప్రకటనలో గుర్తు చేశారు. ఎంసిఐ స్థానంలో ఎన్‌ఎంసి తీసుకురావడం తగదన్నారు. ఎంసిఐలో లోపాలుంటే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, రద్దు చేయడం అసంబద్ధ నిర్ణయమని విమర్శించారు. ఇంట్లో ఎలుకలు ఉంటే ఇల్లు తగలబెట్టిన చందంగా కేంద్ర ప్రభుత్వం తీరు ఉందని ఎద్దేవా చేశారు. హోమియోపతి, ఆయుర్వేదం ఆయుష్ కిందకు వచ్చే వైద్యులు సంవత్సరం బ్రిడ్జ్ కోర్సు చేస్తే అల్లోపతి వైద్యానికి అనుమతించే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.

బోల్తా పడిన టెంపో

ఏడుగురు వలస కూలీలు మృతి

- పత్తి కోతలకు వెళ్లి తిరిగివస్తుండగా సంఘటన
- అనంతపురం జిల్లా చిన్నహోతూరు వద్ద దుర్ఘటన

ప్రజాశక్తి - ఆస్పరి/హోళగుంద

వారంతా వలస కూలీలు. మూడు నెలల క్రితం పొట్ట చేతపట్టుకుని వేరే ప్రాంతానికి వలస వెళ్లారు. అక్కడ పనులు చేసుకుని తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. ఇంకో గంటలో ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని చర్చించుకుంటున్నారు. ఇంతలో ఏదో పగిలిన శబ్దం. ఏమైందో తెలుసుకునేలోపే ప్రమాదం జరిగిపోయింది. కర్నూలు జిల్లా ఆస్పరి మండలం చిన్న హోతూరు వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు వద్ద రోడ్డు ఐదుగురు మృతిచెందిన ఘటన జరిగి 24 గంటలు కాకముందే మరో విషాదం చోటు చేసుకుంది.

వివరాలిలా ఉన్నాయి... హోళగుంద మండలం కొత్తపేట గ్రామానికి చెందిన 30 మంది వ్యవసాయ కూలీలు మూడు నెలల క్రితం నల్గొండ జిల్లా డోరపల్లి గ్రామానికి పత్తి కోత పనులకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని మంగళవారం సాయంత్రం టెంపో వాహనంలో స్వగ్రామానికి బయల్దేరారు. బుధవారం ఉదయం ఏడు గంటల సమయంలో టెంపో వాహనం ఆస్పరి మండలం చిన్నహోతూరు వద్దకు చేరుకుంది. వాహనం కుడి వైపు వెనుక టైర్ పగిలి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో హోళగుంద మండలం కొత్తపేట గ్రామానికి చెందిన షేకమ్మ (45), నర్సమ్మ (45), హనుమంతమ్మ (16), గోవిందమ్మ (55), నారాయణ (30), ఈరమ్మ (40), మంగమ్మ (50) అక్కడికక్కడే మృతి చెందారు.


టెంపో బోల్తాపడి మృతి చెందిన వలస కూలీలు

తీవ్రంగా గాయపడిన గోవిందమ్మ, నారాయణ ఆదోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. నారాయణ, ఈరమ్మ, మంగమ్మలను మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. వారు ఆస్పత్రిలో కోలుకోలేక మృతి చెందారు. స్రవంతి అనే చిన్నారి ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతోంది. షేకన్న, నీలమ్మ, బాలరాజు, వెంకటేష్, లక్ష్మి, సుంకమ్మ, దుర్గమ్మ, గంగమ్మ కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన వెంటనే ఆస్పరి ఎస్ఐ శంకరయ్య సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లారు. క్షతగాత్రులను స్థానికులతో కలిసి ప్రత్యేక వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ఆలూరు సిఐ అబ్దుల్ గౌస్ సంఘటనా స్థలానికి చేరుకుని సంఘటన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంఘటనా స్థలాన్ని ఎస్‌పి గోపినాథ్‌జెట్టి పరిశీలించారు.

గ్రామీణ బ్యాంకుల్లో వడ్డీ భారం

ఆర్థిక శాఖకు సెర్ప్ లేఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గ్రామీణ బ్యాంకుల్లో అధిక వడ్డీ భారంగా మారుతోందని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆరోపిస్తోంది. ఈ మేరకు మరోసారి ఆర్థిక శాఖకు లేఖ రాసింది. ఇతర బ్యాంకుల కన్నా ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో స్వయం సహాయ సంఘాల రుణాలపై ఎక్కువ వడ్డీ వసూలు చేస్తున్నట్లు సెర్ప్ పేర్కొంటోంది. దీనిని కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్థిక శాఖకు తాజాగా మరో లేఖ రాసింది. గతంలో రిజర్వ్‌బ్యాంకు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆరు జిల్లాల్లో మూడు లక్షల రూపాయల వరకు ఏడు శాతం వడ్డీ వసూలు చేయాలని నిర్ణయించగా, సక్రమంగా అసలు చెల్లించే వారికి మూడు శాతం తగ్గించి వసూలు చేయాలని స్పష్టంగా ఉంది. మూడు లక్షలు పైబడిన రుణానికి 12.5 శాతం కన్నా ఎక్కువ వసూలు చేయరాదని కూడా ఆర్‌బిఐ పేర్కొంది. అయితే సప్తగిరి గ్రామీణ బ్యాంకు, చైతన్య గ్రామీణ బ్యాంకు, గోదావరి గ్రామీణ బ్యాంకు, ప్రగతి గ్రామీణ బ్యాంకులు అదనంగా వడ్డీ వసూలు చేస్తున్నట్లు సెర్ప్ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ పథకాలు అందుకుంటున్న స్వయం సహాయ సంఘాలు తీవ్రంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యను నివారించేందుకు ప్రతి గ్రామీణ బ్యాంకులో ఆర్థిక శాఖ తరపున ఒక డైరెక్టర్‌ను నియమించాలని లేఖలో కోరారు. ఏడు శాతం వడ్డీని మాత్రమే వసూలు చేయాలని, 2016 ఏప్రిల్ నుంచి సక్రమంగా అసలు చెల్లించే వారికి వడ్డీ రాయితీ అమలు చేయాలని కోరారు. ఈ విధానం వల్ల స్వయం సహాయ సంఘాలు విస్తృతంగా రుణాలు తీసుకునేందుకు, స్వీయ అభివృద్ధికి అవకాశం ఉంటుందని సెర్ప్ తన లేఖలో పేర్కొంది.



Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68